మే 16-31, 2023
సంపుటి 03, సంచిక 15

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక





తెలంగాణ చరిత్రకు నమూనా - బోధన్!



తెలంగాణ హరికథా పితామహుడు

**చందాల కేశవదాసు**

వర్ధంతి : మే 14, 1956

*Printed, Published and Owned by : **KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amrutharam Residency, H.No. 1-2-234/13/46/4, 4th Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

విషయ సూచిక


04 కొత్తసూర్యుని రాకకోసం ఎదురుచూసే కళ్ళను చూపిస్తూ, **కలువకుంట్ల రామకృష్ణ** కవిత **"ఇంత జరిగినా"**

41 **ఒక లోకసంచారి** తాత్వికత చెబుతున్న **డబ్బీకార్** పుస్తక పరిచయం....

45 తల్లి వియోగ దుఃఖచింత మాతృగీతాలు రాజేశ్వరి దివాకర్ల రచన... **స్మృతి మధురాలు "మాతృగీతాలు"**


తంగేడు




29 రచయిత నైతిక విజయం చాటే **చిటుకుల మైసారెడ్డి** వ్యాసం **నాటి 'పచ్చికి' కథే నేటి 'బలగం'...**





13 స్త్రీని నిలువెత్తు ధైర్యంగా చిత్రిస్తున్న **రావుల కిరణ్మయి** కథ **"పూసింది"**





09 బోధన్ తెలంగాణ చరిత్రకు ఒక శాంపుల్ స్టడీ అని చెప్తున్న **మామిడి హరికృష్ణ** వ్యాసం **"తెలంగాణ చరిత్రకు నమూనా - బోధన్!"**





05 ఆధిపత్యాన్ని ప్రశ్నించిన **"ఏకలవ్యుడు" సురవరం ప్రతాపరెడ్డి** నాటికథ...





21 పిల్లల స్వార్థానికి ఎదురీదుతున్న ఒక తండ్రి **దాసరి మోహన్** కథ **"ఎటులైనా నిలబెడతా"**





33 రచయిత అనుభూతులతో యాత్రా చరిత్రను చిత్రించిన సాగర్ల సత్తయ్య వ్యాసం... **"చార్ ధామ్ యాత్ర - అనుభూతి చిత్రణ"**

43 బాలశ్రీనివాసమూర్తి జ్ఞాపకాలను తడుముతున్న **ఘనపురం** వ్యాసం **"వ్యక్తిత్వంలో బాలుడు.. సాహిత్యంలో త్రివిక్రముడు"**

28 భావసంచలనాలను అక్షరించిన **మండోజు సైదాచారి** కవిత **"కఠిన ప్రేమ"**

37 నేటి సారస్వతపరిషత్తు కార్యదర్శి **జె. చెన్నయ్యతో గరిపెల్లి అశోక్** ఈ పక్షం ముచ్చట

దాస్యం సేనాధిపతి అంతర్వాహిని పైన **ఉషారాణి "తెలంగాణ అంతర్వాహిని"**...పేజీ 17

కంటివెలుగులో అక్షరాల తోరణం **ఉమాదేవి** కవిత **"చక్షు ప్రపంచంలో"** ...పేజీ 24

కష్ట సుఖాల కలయికని కొత్తగా ఆవిష్కరించే **కందకట్ల జనార్దన్** కవిత **"రగిలే వేసవి వెన్నెల్లో"** ...పేజీ 19

కొనసాగవలసిన మనిషిని చిత్రించిన **కొమ్మెట కళ్యాణి** కవిత **"మళ్లీ మొదలవ్వాలి"**..పేజీ 16

రేపటికలతో నడిచే కాలచక్రం చూపిస్తున్న **గోపగాని రవీందర్** కవిత **"ఒక రోజంతా"** ...పేజీ 08

అయ్య బతుకుచక్రం చిత్రించిన **రవి** కవిత **"మందకు నిలువెత్తు దైయిర్నం"** ...పేజీ 12

భాషాసృష్టికర్తలు ఆదిమానవులు అంటున్న డాక్టర్ **కాలువ మల్లయ్య** వ్యాసం **"ఒడి పలుకులు పలుకుబడులు"** ...పేజీ 25


**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

# జీవితము భారమ్మై



ముకురాల రామిరెడ్డి

ముకురాల రామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, కవి, రచయిత. 1976లో ఆకాశవాణి, ఢిల్లీ వారిచే 'జాతీయకవి'గా గుర్తింపబడి, సన్మానం అందుకున్నాడు. పద్యాలు, కవితలు, పాటలు, కథలు, వ్యాసాలు వంటి అనేక సాహిత్య ప్రక్రియలలో తనదైన ముద్రవేసిన సాహితీపరుడు. ఇతను పాలమూరు జిల్లా, కల్వకుర్తి మండలం ముకురాల గ్రామంలో 1929 జనవరి 1వ తేదీన మంద రామలక్ష్మమ్మ, బాలకృష్ణారెడ్డి దంపతులకు జన్మించారు. గంగాపురం హనుమచ్ఛర్మ ఇతని గురువు. గ్రామంలోని కానిగి పాఠశాలలో ఉర్దూ మాధ్యమంలో ప్రాథమిక విద్యనభ్యసించారు. క్రమక్రమంగా పరీక్షలు ప్రైవేటుగా రాస్తూ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చరిత్రలో, తెలుగులో ఎం.ఏ. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడై, పి.హెచ్.డి. చేసి డాక్టరేటు పొందారు. 1947-48లో నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. గ్రంథాలయోద్యమంలో కూడా పాల్గొన్నారు. తెలుగులో ప్రాచీన కవుల సృజనాత్మక ప్రతిభ అనే అంశంపై పరిశోధన చేసి పి.హెచ్‌డి. పట్టా పొందారు. దుందుభి అనే మాసపత్రికకు సంపాదకత్వం వహించారు. ఈ పద్యాలు ఆయన కాళిదాసు మేఘ సందేశానికి చేసిన గేయానువాదం నుండి తీసుకోవడం జరిగింది.

యక్షుడొక్కండు ప్రేయసికి దూరమ్మై
విలపించె విరహజీవితము భారమ్మై
కొలువు బాసిన బాసె, నెలవు బాసిన బాసె
తొలినాళ్ళలోనె ముద్దులభార్య కరువాయె
తప్పేమి జేసెనో తన స్వామి కోపింప?
ఏడాది పాటుగా ఇద్దరిని యెడబాపె
యక్షుడొక్కండు ప్రేయసికి దూరమ్మై
విలపించె విరహ జీవితము భారమ్మై
అలనాడు సీతమ్మ జలకమాడిన తాన
వెదకి, రాముడు గోడు వెల్లబుచ్చిన తాన,
ఆ రామగిరిపైన, ఆ యాశ్రమములున్న
జాడలో, సురపొన్ననీడలో, దినమొక్క
యేడుగా తలపోయు, యేడెట్లు గడచునో
యక్షుడొక్కండు ప్రేయసికి దూరమ్మై
విలపించె విరహ జీవితము భారమ్మై.

సంపాదకీయం

తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

16-31 మే, 2023

సంపుటి 03 సంచిక 15



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# నడకే ప్రధానం

ప్రపంచంలో దాదాపు ప్రతి తాత్త్వికుడు సాధనే పరమావధి అని చెప్తాడు. "సాధనమున పనులు సమకూరు" అనేది లోకవిదితమైన సామెతే.

ఒకలక్ష్యంమీద అడుగులు వేస్తున్నప్పుడు అనేక ఎదురుదెబ్బలు తగులుతాయి. ఎన్నోసార్లు కింద పడిపోతాము. ఎవరూ సహకరించరు. కొండకచో లక్ష్యం చేరలేము అని నిరాశ కలుగుతుంది. ఈ శ్రమ బూడిదలో పోసిన పన్నీరు అని బాధపడతాం. కాని మన ప్రయత్నం విడువకుండా సాగితే క్రమంగా అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. నిన్నటి ప్రతికూల అంశాలన్నీ తోకముడుస్తాయి. పైపెచ్చు ఈ విజయసాధనకు మేమే కారణమని మేమే ప్రోత్సహించామని మాట మారుస్తాయి. ప్లేటు ఫిరాయిస్తాయి. ఎగతాళి చేసిన నోళ్ళన్నీ ప్రశంసల వాక్యాలుగా మారుతాయి. కాబట్టి లక్ష్యసాధనకు తాను నిర్దేశించుకున్న గొప్ప లక్ష్యంతో పాటు సాధించే లక్షణం కూడా ఉండాలి. వెనుకకు తిరిగిచూడని ధీరత్వం ఉండాలి. ప్రతికూల వాతావరణాన్ని, పరిహాసాలని సహించే ఆత్మస్థైర్యం ఉండాలి. లక్ష్యం మీద చెరగని గురి ఉండాలి.

సాధారణంగా పరిపూర్ణత గురించి తాత్త్వికులు ఎన్నో సుభాషితాలు చెబుతారు. అసలు పరిపూర్ణత అంటే ఏమిటి? అది ప్రపంచంలో ఉంటుందా? మానవుడు దాన్ని సాధిస్తాడా? పారలౌకికులు చెప్పే విషయాన్ని కాకుండా సాధారణ భౌతికదృష్టితో చూస్తే పరిపూర్ణత ఒక కలగానే కనిపిస్తుంది పారలౌకికతలోని రేఖామాత్రమైన పరిపూర్ణత ఒక ఆదర్శమే. ఇది బహుశా నిరాశాగతుడైన మనిషికి ఊరటనిస్తుంది కావచ్చు.

కాని నిత్యాచరణలోని లక్ష్యం పరిపూర్ణతే ఇప్పుడు కావాలి. అసలు మన తృప్తిలో తప్ప పరిపూర్ణత ఎక్కడ ఉండదు. ఎంత చేసినా ఇంకా ఏదో మిగిలి ఉంటుంది. అట్లా కల కొనసాగుతూనే ఉంటుంది. మనిషి ఆరాటం పోరాటం జ్వలనశిఖలాగా మండుతూనే ఉంటుంది. మనిషిలో ప్రసరించే చైతన్యం అతని అడుగులు వేయిస్తూనే ఉంటుంది.

సృజన చైతన్యం కూడా అట్లాంటిదే. ఒక ప్రక్రియ కోసం నిరంతరం సాధన చేసే సృజనకారుడు ఆ ప్రక్రియలో పరిపూర్ణత సాధించగలుగుతాడా? పరిపక్వత అనేదాన్ని ఎవరు మాత్రం నిర్దేశించగలుగుతారు?

ఆ ప్రక్రియ సృజనతోపాటు అతను ప్రబోధించే సామాజిక లక్ష్యం నెరవేరు తుందా? సమసమాజం ఈ ప్రపంచంలో ఏ మానవుడైనా చూడగలుగుతాడా? అట్లాగని సృజన జరగకుండా ఉంటుందా? కాబట్టి అటు ప్రక్రియ నిర్మాణంలోనూ, ఆ ప్రక్రియ వెనుక ఉన్న సామాజిక లక్ష్యసాధనలోనూ, సృజనకారుడు నిరంతర జాగ్రుతుడై ఉండాలి. తన అడుగులకే తెలియని నడక కొనసాగుతూనే ఉండాలి. లక్ష్యసాధన విషయంగా పరిక్రమించే చైతన్యానికి చిన్నచిన్న విజయాలు కలుగుతాయి. అపజయాలతో పాటు రెంటిని సమతుల్యంగా స్వీకరిస్తూ అడుగు ముందుకు వేయాలి. చిరు విజయాలు, చిరు అపజయాలు కూడా మన మార్గంలో మనం దాటుతున్న గీటురాళ్లు అని గుర్తించాలి.

సృజనకారుడికి లక్ష్యం అనివార్యం. అది సిద్ధాంతంగా పిలిచినా, వాదంగా పిలిచినా, సామాజిక జీవనంలో సౌభాగ్యవంతమైన పరివర్తనే అతనికి కావలసింది. మనిషి సామాజికంగా, కళాత్మకంగా, ఆధ్యాత్మికంగా కూడా చేసే ఈ ప్రయాణం అతనికి తప్పక లక్ష్యసిద్ధి కలుగజేస్తుంది. లక్ష్యసిద్ధి దానికోసం చేసే సాధనే జీవితం, లేక సృజనజీవితం అని విశ్వసిద్దాం.

*జై తెలంగాణ! జై జాగృతి!!*

కవిత కల్వకుంట్ల



# ఇంత జరిగినా...



- డా॥ కలువకుంట రామకృష్ణ, 94401 52405

నగరాల దెబ్బకు జీవకళా విహీనమై
వన్నె తగ్గిన పల్లెలు చెట్లను పోగొట్టుకున్న
అడవి మౌనంగా మూలుగుతోంది
ఇసుకను కోల్పోయిన తల్లినది గుండె అవిశిపోతున్నది.
ముక్కల్ని చేసి తరలివెళ్తున్న బండరాళ్ళను జూసి
నేలతల్లి గుండె రాయైంది.

అంతులేని బీభత్సమేదో తరుముతున్నది
అకాల వడగండ్ల వానకు పురిట్లో
కన్నుమూసిన శిశువుల్లా రైతుబిడ్డలు.

చెట్లను కోల్పోయిన రోడ్లన్నీ కాంక్రీటు
రంగుదిద్దుకుని వెక్కిరిస్తున్నై.

పిల్లల ప్రేమ కోల్పోయిన వృద్ధ దంపతుల
ఆఖరిశ్వాసలు వృద్ధాశ్రమాల గదుల్లో...
నెత్తురోడ్తున్న రోడ్ల ప్రమాద చారికలు
గుండె మెలిపెడ్తున్నా
పులితోలు కప్పుకున్న నక్కలు,
తోడేళ్ల గుంపులు గుంపులుగా
వికారంగా... నవ్వుతూనే...

ఇంత జరిగినా...
నిరుత్సాహం వెంటాడినా
కొత్తసూర్యుని రాక కోసం
కళ్లింకా ఎదురుచూస్తూనే....

# ఏకలవ్య

అణచివేతను నాటకీయశిల్పంతో
సంభాషణలలో చిత్రించిన కథ...



సురవరం ప్రతాపరెడ్డి

ద్రోణ : అయితే నీ పేరు ఏకలవ్య యని వ్యవహరింపఁబడుచున్నదా? నీవేమి యభిలషించెదవు?

ఏకలవ్య : దేవా! నాకు ధనుర్విద్యయందుఁ జాల యభిమానము కలదు. మీ చరణముల నాశ్రయించి యావిద్యఁ గొంత సంపాదింపఁదలచితిని.

ద్రోణ : ఆవిద్యపై నీకెట్లభిలాష కలిగెను?

ఏకలవ్య : అది వంశపారంపరేణ వచ్చు విద్య. మా భిల్ల జాతి ప్రాచీనము నుండియు నీ విలువిద్య చేతనే ప్రసిద్ధి నొందినట్టిది.

ద్రోణ : ఓహో! నీవు భిల్లుఁడవా? బ్రాహ్మణ క్షత్రియులు తప్ప నితరుల కీవిద్య నేర్పఁ దగదను సంగతి నీకుఁ దెలియదా?

ఏకలవ్య : స్వామీ! ఏవిద్య నైన సభ్యసించుటకు జగదీశ్వరుని సృష్టియందందఱకును సమానమైన యధికారము కలదని పెద్దల వలన

**ఓరీ! నీవు నీచజనుఁడవు. అట్టి నీకు విద్య నేర్పుట దైవనిర్మితమగు వర్ణాశ్రమధర్మమునకు విరుద్ధము. నీవీ జన్మమందేమి చేసినను నుత్తమజాతి పదవి నందనేరవు. కావున నిక నీవు నీ పట్టును వదలుము.**

## ఆధిపత్యాన్ని నిరసించిన సురవరం 'ఏకలవ్య'

ఈ రచన కూడా బ్రాహ్మణేతర ఉద్యమంలో భాగంగా ప్రారంభమైన సమదర్శిని 1930 ఉగాది సంచికలో వెలువడింది. ఈ సమదర్శిని పత్రికలో బ్రాహ్మణుల రచనలు ప్రచురించినప్పటికీ సామాజిక, సంస్కరణ రచనలకు ప్రాధాన్యత నిచ్చి ప్రచురించేవారు. అందులో భాగంగానే సురవరం ప్రతాపరెడ్డి రచన వెలువడింది. ఈ పత్రికకు కవి, బ్రాహ్మణేతర ఉద్యమనాయకుడు పింజల సుబ్రహ్మణ్యశెట్టి అనే బహుజనుడు నడిపించాడు.

తెలంగాణ ఆత్మను, ధిక్కారాన్ని అక్షరాల్లోకి ఒంపి ఇక్కడి ఘనతను చాటిన వైతాళికుడు సురవరం రచనలు సమగ్రంగా రావాల్సిన సందర్భమిది. ఈనెల 28న ఆయన 137వ జయంతి. ఈ సందర్భంగానైనా సమగ్ర రచనలపై ఒక కార్యాచరణను తెలుగు అకాడెమీ, తెలంగాణ సాహిత్య అకాడెమి, తెలుగు యూనివర్సిటి, తెలంగాణ సారస్వత పరిషత్తు, సురవరం సాహితీ వైజయంతి ఎవరో ఒకరు పూనుకొని ఆయనకి నిజమైన నివాళి అర్పించాలని కోరుకుంటూ..

**- డా॥ సంగిశెట్టి శ్రీనివాస్**

వింటిని.

దుర్యోధన : ఓహోహో! వీనికిఁ గేవలము ధనుర్విద్యయే గాక నీతివిద్యయు నీచిఱుతప్రాయమునందే యలవడినట్లున్నది!

అర్జున : కలికాలము సమీపించుచున్నది. కావుననే బెండ్లు మునిగి గుండ్లు తేలుచున్నవి!

ద్రోణ : ఓరీ మూర్ఖా! నీవు చాల యమాయకుఁడవుగాఁ గాన్పించుచున్నావు. సూర్యచంద్రవంశజులకే మేమీ ధనుర్వేదమును నేర్పించువారము.

ఏకలవ్య : అయ్యా! నేనును సూర్యచంద్రవంశము వాఁడనే.

దుర్యోధన : ఓహోహో మాకన్న నాలుగాకులు వీఁడెక్కువగాఁ జదివిన్నట్లున్నదే!

ద్రోణ : (నవ్వి) ఓరి! నీవీ యుభయవంశములందెట్లు జన్మించితివిరా?

ఏకలవ్య : స్వామీ! మాకు గుడిసెలే మేడలు. ఆ గుడిసెల సందులలో సూర్యచంద్రులు సదా తాండవ మాడుచుందురు, మేమీ సూర్యచంద్రుల నిలవేల్పులనుగా వంశక్రమాగతముగాఁ బూజించుచున్నాము. ఇంతే కాక మా ఆదిపురుషుఁడు సూర్యుని కొడుకనియు, మా యాదిమాత చంద్రుని కూతురనియుఁ మా పెద్దలు చెప్పుచుందురు,

అర్జున : ఇదియా నీవంశము! సరే!

ద్రోణ : వీఁడు మూర్ఖుఁడని నే నప్పుడే చెప్పలేదా? ఓరి ఏకలవ్యా ! నీకీ జన్మమున నాబోధ యబ్బనేరదు. ఊరక నీ వచ్చిన దారినే పోవలయు.

ఏకలవ్య : నాకీ జన్మముననే మీ యనుగ్రహము కలుగవలయునని ప్రార్థించుచున్నాను. మీ పాదములయాన మిమ్ము వదలను. (అని మ్రొక్కఁ బోవును)

ద్రోణ : ఛీ! పాపాత్మ! నీవు దూరముననే యుండుము. నీ వనార్యుఁడవు, అస్పృశ్యుఁడవు. నీ గాలియైన మాకు సోకఁగూడదను సంగతిని యెఱుఁగవా?

ఏకలవ్య : స్వామీ! మీరిట్లు నన్ను బరీక్షించినను మిమ్ము వదలువాడనా? నే నెందుండినను సర్వవ్యాపియగు వాయుదేవుఁడు నాపై వీచిన విధముగనే మీ మీదను వీచుటకు 'మానునా?

దుర్యోధన : ఆచార్యా! వీనికి వేదాంతము ముదిరినట్లున్నది? నాకు సెలవిండు. వీని నిప్పుడే యమలోకమున కంపెదను.

ఏకలవ్య : మహారాజుగారి చేతఁ జచ్చిన నాకు స్వర్గలోకమే ప్రాప్తించును, గాన నదియు ననుగ్రహమే యని భావింతును.

ద్రోణ : ఓరీ! నీవు నీచజనుఁడవు. అట్టి నీకు విద్య నేర్పుట దైవనిర్మితమగు వర్ణాశ్రమధర్మమునకు విరుద్ధము. నీవీ జన్మమందేమి చేసినను నుత్తమజాతి పదవి నందనేరవు. కావున నిక నీవు నీ పట్టును వదలుము.

ఏకలవ్య : స్వామీ! అనుగ్రహింపవలయును. ఈ మీ సేవకుఁడు ద్రోహమెన్నడును పెంచనివాఁడని నమ్ముఁడు. తమ యాజ్ఞ యయ్యేనేని తన ప్రాణముల సహితము తమ పాదములకడ సమర్పింప సంసిద్ధుఁడని యెఱుంగుఁడు.

ద్రోణ : తుచ్ఛా! చండాల! వెడలెదవా? లేదా? తక్షణ మిచ్చటినుండి వెడలిపొమ్ము! లేదా నిన్నిప్పుడే నాతీవ్రబాణములచే భస్మీభూతునిగా జేయుదును. పొమ్ము పొమ్ము!



**స్వామీ!** ఇంతయేనా తాము కోరినది. ఈ శరీర మంతయును దమది కాదా! తలకోసి యిమ్మనిన నిచ్చి యుందునే. ఇదిగో యీ క్షణమే మీ కానుకను జెల్లించుచున్నాను. (అని ఛురికచే వ్రేలు కోసి యిచ్చును) ఇంకేమైనను నాజ్ఞాపించుడు. ఇంతటి పనికిరాని దక్షిణ యిచ్చినందులకు నాకు సిగ్గగుచున్నది.

నీముఖము జూడ నొల్లను పొమ్ము.

ఏకలవ్య : చిత్తము! గురువులవారి యాజ్ఞ యనుల్లంఘనీయం! ఓ ద్రోణాచార్యస్వామీ! ఇదే సెలవు దీసికొనుచున్నాడను. ఎన్నటికైనను దామే నా గురువులని నమ్మినాడను. మీ నామస్మరణముచేతను, నా పరమేశ్వరుని కరుణచేతను నేను ధనుర్విద్యను నేర్చియే తీరుదు నని విన్నవించువాఁడ!

కొంతకాలమునకు ద్రోణుడును, శిష్యులును వేట కరుగుదురు. ఏకలవ్యుని బాణములు వారి శునక ముఖమునకు చిక్కము రీతిఁ దగుల్కొనెను. ఆ బాణశిక్యముతో నా కుక్క యర్జునుని సమీపించెను. అర్జునుఁ డేకలవ్యుని జూడనరసి వాని విద్య కచ్చెరు వంది వాని కెవరా విద్యను నేర్పినవాఁడు. తాను ద్రోణశిష్యుఁడని చెప్పికొనెను. అర్జునుఁడు ద్రోణుని బిలచికొని యేకలవ్యుని దగ్గఱ వచ్చుచు-

అర్జున : ఆచార్య! తాము నిజముగా శిష్యద్రోహము చేసితిరి. ఆనాడు నన్ను సర్వశిష్యులకన్న నెక్కుడుగా మన్నించితిననియు నా కందఱకన్న నెక్కుడుగా విద్య నేర్పితి మనియు సెలవిచ్చితిరి.

ద్రోణ : అర్జునా! నే నిప్పుడును నదే మాట

చెప్పుచున్నాను. ద్రోణుని నాలుక కబద్ధపు రుచి యెట్టిదో తెలియదు.

అర్జున : అనాఁ డేకలవ్యుఁడను బోయకు ధనుర్విద్యను నేర్పనని తాము నిరాకరించితిరి.

ద్రోణ : అవును ఇప్పు డాసంగతితో నేమి ప్రయోజనము?

అర్జున : ఆ ఏకలవ్యుఁడు మీవద్దనే ధనుర్విద్యాపాండిత్యమును నిరుపమానముగా సంపాదించినందుల కీశునకమే సాక్ష్యమిచ్చుచున్నది.

ద్రోణ : అర్జునా! వాడు నీతో నబద్ధము చెప్పినాడు. అయినను నా యెదుట విచారించిన నంతయు వెల్లడి కాదా.

అర్జున : అదిగో వాడి గుడిసె రండు విచారింతము.

(ఏకలవ్యుడు ప్రవేశించును)

(స్వగతము) ఆహా! నే నెంత ధన్యుఁడను ఆ దినము నిష్ఠూరముగా నన్ను దఱిమినట్టి గురువే నాదగ్గఱకు వచ్చుచున్నాడు.

*(ద్రోణునితో) గురూత్తమా! ఇదే మీ శిష్యపరమాణువు మీకు నమస్కరించుచున్నాడు. (అని సాష్టాంగ నమస్కారము చేయును.)*

ద్రోణ : దూరమునుండియే మాట్లాడుము. ఏకలవ్యా లెమ్ము. నీ విద్యకు నేను మెచ్చితిని. నీ పాండిత్యము నే గురుపాదములకడ నేర్చికొంటివో

**అర్జునా! చూచితివా ఇప్పుడైనను యథార్థము తెలిసేనా? ఓయీ! వీని భక్తిలో సహస్రాంశమైన మనయందుండిన మన మందఱమును దరింతుము సుమా! వీఁడు గురువు లేకయే యింత ప్రవీణుఁడయ్యెను. గురుముఖముననే నేర్చియుండిన వీఁడెంతటి జగదేకవీరుఁడై యుండునో కదా.**

తెలుపుమా?

ఏకలవ్య : దేవా! ఇదంతయుఁ దమ యనుగ్రహమే.

అర్జున : చూచితిరా!

ద్రోణ : ఏమిరా అబద్ధము చెప్పు మీ జాతిగుణ మింకను వదలకున్నాడవు.

ఏకలవ్య : స్వామి! ద్రోణుల శిష్యుఁ డెప్పుడును నబద్ధము చెప్పడు.

ద్రోణ : మరల యదే ధోరణిలో మాట్లాడెదవేమి? నేను నీకెన్నడు నేర్పియుంటినిరా?

ఏకలవ్య : త్రికరణశుద్ధిగ నాగురువు ద్రోణాచార్యులే! అందులకు సాక్ష్య మిదిగో యీ ద్రోణులే (అని చెట్టు క్రింద నొక కట్టె బొమ్మను జూపును.)

ద్రోణ : ఏకలవ్యా మాకేమియు బోధయగుట లేదు. నిజము చెప్పుము. మాయర్జునుఁడు కూడ నింత విద్యను నేర్వలేదు.

ఏకలవ్య : మహాత్మా! ఆ దినము తాము నన్ను కరుణాదూరులై తఱిమినను నేను నా యాశ్రమమునకు వచ్చి తమ విగ్రహము నొకటి స్థాపించి,

ద్రోణ : అదియేనా నా విగ్రహము (అని బొమ్మను జూపును)

ఏకలవ్య : చిత్తము దానిని స్థాపించి ప్రతిదినము పూజించి దాని యెదుటనే గుఱి నేర్చుకొంటివి.

ద్రోణ : అర్జునా! చూచితివా ఇప్పుడైనను యథార్థము తెలిసేనా? ఓయీ! వీని భక్తిలో సహస్రాంశమైన మనయందుండిన మన మందఱమును దరింతుము సుమా! వీఁడు గురువు లేకయే యింత ప్రవీణుఁడయ్యెను. గురుముఖముననే నేర్చియుండిన వీఁడెంతటి జగదేకవీరుఁడై యుండునో కదా.

అర్జున : ఆచార్య! వీఁడిప్పటికే మమ్ములందఱను మించి యున్నాడు. వీఁడు జీవించి యుండునంతకాల మర్జునుడు మీ శిష్యులలో నగ్రగణ్యుఁడను మాట నేతిబీరకాయ వంటిది.

ద్రోణ : అట్లనా! (ఆలోచించి) ఏకలవ్యా అయితే నీవు నిశ్చయముగ నా శిష్యుఁడవేనా?

ఏకలవ్య : అవును మహాత్మా! మీ శిష్యులందఱిలోఁ గడవాఁడను.

ద్రోణ : అట్లయిన నీ యర్జునుడు గురుదక్షిణగా ద్రుపదుని బట్టి తెచ్చి యిచ్చియుండెను. నీవును నాకు గురుదక్షిణగా నేనడిగిన దీయఁజనదా?

ఏకలవ్య : గురుదేవా మీకు ధన మిత్తు ననిన నా యీ ధనుర్బాణములే యావద్ధనమై యున్నవి. ఏ మహావీరుని సాధింపవలయు ననిన నీ హీనుఁ డర్జునాది మహావీరుల కేపాటి సాటి అయినను గురువుల యాజ్ఞ యేదియో వినఁగోరుచున్నాను.

ద్రోణ : ఏకలవ్యా! నీవు నాకు ధనము లీయవలదు. నాకై యేశత్రువును సాధింపవలదు. నే నడుగున దొక చిన్న కానుకయే.

ఏకలవ్య : ఆజ్ఞ యిండు సిద్ధముగ నున్నాఁడను.

ద్రోణ : నీవు నీ కుడిచేతి బొటన వ్రేలిని నాకిచ్చుటయే నాకగు గురుదక్షిణ.

ఏకలవ్య : స్వామీ! ఇంతయేనా తాము కోరినది. ఈ శరీర మంతయును దమది కాదా! తలకోసి యిమ్మనిన నిచ్చి యుందునే ఇదిగో యీ క్షణమే మీ కానుకను జెల్లించుచున్నాను. (అని చురికచే వ్రేలు కోసి యిచ్చును) ఇంకేమైనను నాజ్ఞాపించుడు. ఇంతటి పనికిరాని దక్షిణ యిచ్చినందులకు నాకు సిగ్గగుచున్నది.

ద్రోణ : ఇంకేమియు వలదు. మేము వెళ్ళెదము.

ఏకలవ్య : స్వామీ! తమ పాదధూళిచే నా యాశ్రమము తమ సేవచే నా తనువును బవిత్రములయ్యెను.

ద్రోణ : అర్జునా! నామాట యిప్పుడైనను దక్కెనా?

అర్జున : ధన్యోస్మి.

ఏకలవ్య : ధన్యోస్మి! ధన్యోస్మి! ధన్యోస్మి!

*(మే 28 సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా)*

కవిత

# ఒక రోజంతా...!



గోపగాని రవీందర్, 94409 79882

కొత్త ఆశల చిగుళ్ళతో నిద్ర లేచాను
బయటంతా ఇంకా విచ్చుకోని వెలుగు
మసకమసక చీకట్లను చీల్చుకుంటూ
అలసిన శరీరాన్ని ఉత్తేజపరచడానికి
వడివడి అడుగులతో బయలుదేరిన..!

అలవాటైన బాటనే కావచ్చు
రోజు చూసే పరిచితముఖాలే కావచ్చు
వేకువన వీచే పరిమళభరితమైన గాలిలో
సమ్మోహన పరిచే గమ్మత్తైన మత్తుంది
నరనరాన్ని ఆత్మీయంగా కౌగలించుకుంది..!

ఆశయాలను మననం చేసుకుంటూ
ఒకటిపై ఒకటి ఇటుకల్లా పేర్చుకుంటూ
అంతర్మథనంతో సాగుతూనే ఉన్న
తలంపుల తండ్లాట పూర్తికాదు
ఆదిలోనే ఆగిపోయేటివి మరెన్నో..!

నచ్చిన పుస్తకపఠనంతో కొద్దిసేపు
మిత్రులతో సంభాషణ కొద్దిసేపు
సామాజిక బాగుకోసం కొద్దిసేపు
చరవాణితో స్నేహం కొద్దిసేపు
పిల్లలకు బోధించే పాఠాలతో కొద్దిసేపు..!

కాలచక్రానికి విశ్రాంతి లేదు
పోటీలు పడుతూనే ఉంటున్నా
మెరుగైన జీవిక కోసమే
అనుబంధాల ఎదుగుదల కోసమే
నిరంతర అన్వేషణలోనే సాగుతున్నా..!

ఒకరోజు చూస్తుండగానే కనుమరుగైంది
విశేషమైన అనుభూతిని మిగల్చకుండానే
అనుకున్నవేవి కూడా అమలు కాకుండానే
అతిసాధారణంగానే మనల్ని ఒదిలిపోయింది
రేపటి ఉషోదయానికి వాగ్దానం చేస్తూ...!

# తెలంగాణ చరిత్రకు నమూనా - బోధన్!

నాటి అస్మక మహాజనపదమే నేటి బోధన్....



మామిడి హరికృష్ణ
80080 05231

We are not makers of history.
We are made by history
- Martin Luther King, Jr.

చరిత్రపరంగా తెలంగాణ ఇప్పటికీ ఒక అన్వేషిత మార్మిక నిలయమే Telangana is an Unexplored mysterious and mystic land! లక్షలాది సంవత్సరాల భౌగోళిక, నైసర్గిక, చారిత్రక ఆధారాలు తెలంగాణ నేల మీద ఉన్నాయనేది భౌమ కాలమానం Geographical calendar) లోని మెసోజాయిక్ యుగం తాలూకు అవశేషాల నుంచి లభిస్తున్న సమాచారం. డైనోసార్లకు స్వర్ణయుగంగా కీర్తించబడిన 65 మిలియన్ల సంవత్సరాల క్రితం ఈ నేలమీద జీవి సంచారం ఉందని చెప్పే ఎన్నో శిలాజ ఆధారాలు మంచిర్యాల జిల్లా వేమనపల్లిలో లభించిన విషయం మనందరికీ తెలిసిందే. ఇలాంటి ఎన్నో చారిత్రక విశేషాలకు ఆలవాలం తెలంగాణ. అలాంటి తెలంగాణలో షోడశ మహాజనపదాల కాలంనుంచే మహోన్నత చారిత్రక వైభవాన్ని చూసిన ప్రాంతం కూడా ఉండడం గొప్ప విశేషం.

మరొక వైపున భారతదేశ చారిత్రిక వైభవాన్ని "India is, the cradle of the human race, the birthplace of human speech, the mother of history, the grandmother of legend, and the great grandmother of tradition. Our most valuable and most instructive materials in the history of man are treasured up in India only" అని The Adventures of Tom Sawyer (1876), Adventures of Huckleberry Finn (1884) వంటి విఖ్యాత నవలల సృష్టికర్త Mark Twain అంతటి ప్రఖ్యాత సాహితీవేత్త ఎంతగానో కొనియాడారు. అలాంటి భారతదేశ చరిత్రలో క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దపు కాలం షోడశ(16) మహాజనపదాలు (అంగ, కాంభోజ, మల్ల, కాశి, కోసల, కురు, మగధ, ఛేది, వజ్జి, అవంతి, కురు, పాంచాల, మచ్చ, శూరసేన, గాంధార, అస్సక) వర్ధిల్లిన కాలంగా కీర్తి గడించింది. ఇలా 16 మహాజనపదాలు కొలువైన నేలలో, దక్షిణాదిలో మహాజనపదంగా కీర్తించ బడిన భూమి "అస్మక రాజ్యం" ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా బోధన్ ప్రాంత పరిసరాలలో నిక్షిప్తమై ఉంది అనేది చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలు నిర్ధారించిన సత్యం.

అలాంటి బోధన్ "తెలంగాణ చరిత్రకు ఒక శాంపుల్ స్టడీ" లాంటిది. భారతదేశంలో నాగరికత పరిఢవిల్లిన అనంతరం విలసిల్లిన జైన, బౌద్ధమత భావాలు ఒకవైపు, మహాజనపదాల నిర్మాణం ఇంకొకవైపు జరిగిన నాటి నుంచి ప్రాచీన చారిత్రక వైభవం, మధ్యయుగాల కాలపు గొప్పతనం, ఆధునిక కాలపు నవీనత్వం, వీటన్నిటికీ ప్రత్యక్ష సాక్షిగా నిలిచిన నేల బోధన్.

తెలంగాణలో ఎక్కడ మట్టిని



ముట్టుకున్న, ఒక అద్వితీయ చరిత్రని ఆ మట్టి ఆవిష్కరిస్తుంది. అలా తెలంగాణ నలుచెరగులా ఇసుక రేణువు పొరల్లో నిక్షిప్తమై ఉన్న చారిత్రక విశేషాలు ఎన్నో ఉన్నాయి. తెలంగాణ మట్టి ఎన్నెన్నో పురావస్తు చారిత్రక ఆధారాలను తన గర్భంలో దాచుకున్న మహామాత. అందుకే ఇక్కడి ఏ నేలని స్పర్శించినా వేలాది చారిత్రక విశేషాలను మనకు అది చెబుతుంది.

One of the deepest impulses in man is the impulse to record, to scratch a drawing on a tusk or keep a diary…… The enduring value of the past is, one might say, the very basis of civilisation అని Causes and Consequences (1898), Practical Agitation (1900) వంటి గ్రంథాలు రాసిన ప్రముఖ అమెరికన్ సాహితీవేత్త John Jay Chapman, (1862-1933) అన్నట్లు ఈ భూగోళం మీద సంభవించిన ప్రతీ పరిణామం, సంఘటన, సందర్భం గ్రంథస్థం చేయదగినదిగానే ఉంటుందనడంలో సందేహం లేదు.

ఇక తెలంగాణా మట్టిపొరలలో దాగి ఉన్న అసంఖ్యాక చారిత్రక విశేషాలకు ప్రతినిధిగా, దాదాపు 2600 సంవత్సరాలకు పైగా నిలిచిన మహోన్నత తెలంగాణ చరిత్రకు ప్రతీకగా బోధన్ చరిత్రని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

**ప్రాచీన కాలం నుంచీ తెలంగాణా ప్రాంతాన్ని పాలించిన అందరు చక్రవర్తుల పాలనను బోధన్ ప్రాంతం కూడా చవి చూసింది. శాతవాహనులు, బాదామి చాళుక్యులు (క్రీ.శ. 500-755), రాష్ట్ర కూటులు (క్రీ.శ. 755-973) కళ్యాణి చాళుక్యులు (క్రీ.శ. 973-1189), కాకతీయులు (క్రీ.శ. 1000-1323), వరకు అన్ని దశలలోని అందరు పాలకులకు, అన్ని రకాల పాలనారీతులకు వేదికగా మారింది.**

బోధన్ తెలంగాణ ప్రాంతంలో గొప్ప చారిత్రక పరిణామానికి ఒక నిలువెత్తు ఉదాహరణ. ఈ నేల ఎన్నో చారిత్రక సంఘటనల్ని చూసింది, మరెన్నో పరిపాలనలను గమనించింది, ఇంకెన్నో విశేషాలని, పురావస్తు సంస్కృతులను తనలో నిక్షిప్తం చేసుకుంది. గొప్ప తాత్వికతకి, మరెన్నో ఆధ్యాత్మిక విశేషాలకీ, ఇంకెన్నో మరిచిపోలేని, సామాజిక పరిణామాలకి, విస్మరించలేని సాంస్కృతిక వైవిధ్యతకి బోధన్ ప్రాంతం నిలయంగా ఉంది. చారిత్రక పరిశోధకులకు ఒక నిరంతర స్ఫూర్తి ప్రసాదించే ఆలయంగా ఉంది. అలాంటి బోధన్ 2600 సంవత్సరాల చరిత్రని 'కాల యంత్రం'లో విహంగ వీక్షణం చేయడమనేది ఒక గొప్పవిశేషం.

బోధన్ ఎన్నో విధాలుగా ప్రత్యేకతను సంతరించుకున్న నేల. వాటిలో ప్రధానంగా చెప్పదగినవి

- క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి భారత భూభాగంలో విలసిల్లిన షోడశ మహాజనపదాలలో ఒకటి అస్మక మహాజనపదం. దాని ప్రధాన కేంద్రంగా బోధన్ ప్రసిద్ధి.
- మహాభారతంలో బోధన్ ప్రాంత ప్రశస్తి ఉందనే ఆధారాలు ఉన్నాయి.
- బౌద్ధ, జైన మతానుయాయులకు ప్రాచీనకాలంలో నెలవుగా బోధన్ ప్రత్యేకతను సాధించింది.
- జైన ఇతిహాసాలను అనుసరించి చక్రవర్తి బాహుబలి రాజధాని బోధన్.
- బుద్ధుని కాలంలో 'పోతని'గా, జైనులపరంగా 'చక్రేశ్వరపురం'గా కాలక్రమంలో 'బహుధాన్యపురం'గా, 'బహుధనపురం'గా, 'ముక్తిపురం'గా ఎన్నెన్నో నామాంతరాలను పొందిన నేల బోధన్.
- తెలుగు, కన్నడ భాషల ఆదికవి పంపన జన్మభూమిగా బోధన్ సాహితీ సృజనకు కొలువుగా అలరారింది.



నిజానికి తెలంగాణలో ఉండే ప్రాచీన నగరాలు, వాటి విశేషాలు అన్నిటినీ గ్రంథస్థం చేసి వాటికి శాశ్వతత్వాన్ని చ్చేలాగా, డాక్యుమెంటేషన్ చేయాల్సిన అవసరం ఉంది. A historian ought to be exact, sincere and impartial, free from passion, unbiased by interest, fear, resentment or affection. And faithful to the truth, which is the mother of history, the preserver of great actions, the enemy of oblivion, the witness of the past, the director of the future అని B. R. Ambedkar, (1891-1956) గారు చెప్పిన మాటలను సాకారం చేస్తూ తెలంగాణ చరిత్రను నిక్షిప్తం చేసే దిశగా ఎందరో చరిత్రకారులు గతంలో కృషి చేశారు. ప్రముఖ చరిత్రకారుడు ఆదిరాజు వీరభద్రరావుగారు కొన్ని దశాబ్దాల కాలం క్రితమే 'ప్రాచీన నగరాల చరిత్ర' గురించి వివరిస్తూ ప్రతీ నగరం ఒక పోగేసుకున్న చరిత్ర పుట్ట అని చెపుతూ ప్రపంచానికి తెలియని ఎన్నో విషయాలను తెలియ జేశారు. అలాగే బి.ఎన్. శాస్త్రిగారు కూడా శాతవాహనుల కాలం నుంచి తెలంగాణ వైభవ సంపదను ప్రపంచానికి చాటి చెప్పారు. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, శ్రీ కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారు, శ్రీ పి.వి. పరబ్రహ్మశాస్త్రిగారు. శ్రీ గులాం యజ్దానీగారు, శ్రీ దేమె రాజారెడ్డిగారు





ఇంకా మరెంతో మంది చరిత్రకారులు తమ కాలాన్ని, శక్తిని అంతా వినియోగించి తెలంగాణ చరిత్రను ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. శాసనాలను, పురావస్తు ఆధారాలను తాళపత్ర గ్రంథాల లోని విశేషాలు ఎన్నింటినో అధ్యయనం చేసి, వాటిలోని భాషని "డీకోడ్" చేసి, ప్రపంచానికి తెలియని మరెన్నో విశేషాలను వెల్లడించారు. తెలంగాణ వైభవాన్ని, తెలుగుజాతి కీర్తిని, తెలంగాణ ప్రాంతపు చారిత్రక వికాసాన్ని తమ రచనల ద్వారా పరిశోధనల ద్వారా ఆవిష్కరించారు. ఆ కోవలోనే బోధన్‌కు చెందిన సిద్ధసాయిరెడ్డిగారు 'తరతరాల బోధన్ చరిత్ర' పేరుతో ఒక పరిశోధనా గ్రంథాన్ని రాయగా దానిని భాషా సాంస్కృతికశాఖ ప్రచురించింది.

ఆ మాటకు వస్తే తెలంగాణ ప్రాంతంలో ఉండే ప్రతి ఊరికి తనదైన చరిత్ర ఉంది, తనదైన స్థానం ఉంది. Toponomastics అనే శాస్త్రం ప్రకారం ప్రతి ఊరు నిర్మాణం వెనక పెద్ద చరిత్రే ఉంటుంది. ప్రతి గ్రామం ఏర్పాటు వెనుక, జనావాస పొందుబాటు వెనక ఎన్నో పురిటి నొప్పులు ఉంటాయి, మరెన్నో సంఘర్షణలు, పోరాటాలు, వైఫల్యాలు, విజయాల పరంపర ఉంటుంది. వాటన్నిం టినీ అన్వేషించి ప్రతి ఊరి చరిత్రని కూడా గ్రంథస్తం చేసి, భావితరాలకు అందిం చాల్సిన గురుతర బాధ్యత ఉంది. అయినప్పటికీ ప్రస్తుతానికి తెలంగాణ చరిత్రకు దాదాపు రెండున్నర వేల సంవత్సరాల రూపాన్ని ఇవ్వగలిగిన 'బోధన్' ను ప్రతినిధిగా తీసుకుంటూ ఈ తరతరాల తెలంగాణా చరిత్రని అధ్యయనం చేయాలి.

ప్రాచీన కాలం నుంచీ తెలంగాణా ప్రాంతాన్ని పాలించిన అందరు చక్రవర్తుల పాలనను బోధన్ ప్రాంతం కూడా చవి చూసింది. శాతవాహనులు, బాదామి చాళుక్యులు (క్రీ.శ. 500-755), రాష్ట్ర కూటులు (క్రీ.శ. 755-973) కళ్యాణి చాళుక్యులు (క్రీ.శ. 973-1189), కాకతీయులు (క్రీ.శ. 1000-1323), వరకు అన్ని దశలలోని అందరు పాలకులకు, అన్ని రకాల పాలనారీ తులకు వేదికగా మారింది. వీరేకాక, ముస్లిం పాలకులైన ఢిల్లీ సుల్తానులు, విజయనగర చక్రవర్తులు, బహమనీ సామ్రాజ్యం (క్రీ.శ. 1347-1482), కుతుబ్‌షాహీలు (1482 -1687), మొఘల్‌లు, అసఫ్‌జాహీల ఏలుబడిలో ఆ తరహాపాలనకు కూడా సాక్షిగా నిలిచింది. మిగతా తెలంగాణా ప్రాంతం కన్నా అదనంగా కొంతకాలం బోధన్ ప్రాంతం మహారాష్ట్రుల అధీనంలో ఉన్నట్లుగా తెలుస్తోంది.

ఈ చరిత్ర, పాలనా పరిణామాల దృష్ట్యా 'బోధన్' చరిత్రను అధ్యయనం చేయడమంటే Miniature of Telangana History అని చెప్పడంలో అతిశయోక్తి ఉండదు.

కవిత

# మందకు నిలువెత్తు ధైర్యం



చిక్కొండ్ర రవి, 95023 78992

మా అయ్య
సూర్యుడు
చుక్కల్ని మేయకముందే లేచి
మంద చూట్టూ భూమిలా తిరుగుతడు
మాపున వలల పడ్డ
దొంగ గొర్ల, బిత్తిరి మ్యాకల విముక్తి చేసి
తోటోళ్ళ నిద్ర లేపుతడు

అలిగిన తల్లిపిల్లల కలిపి
అనాథ గొర్రెపిల్లల కుడిపి
ఆకుల మందు పసర్లు నూరి కట్లు గట్టి
పానం బాలేని జీవాలకు పానం పోసే డాక్టరైతడు
ఈనే గొర్లకు పురుడుపోసి మంత్రసానైతడు
కడుపునిండా పాలు తాగి
గంతులేసే గొర్రె పిల్లల్ని చూసి
ఆకాశమంతెత్తు సంబరపడుతడు
మా అయ్యది అమ్మ గుణమే

అంబటాళ్లకు మాయమ్మ
అంబలి అన్నం మెతుకుల గంజి
పచ్చిమిరపకాయ కారం
మమకారంతో మెత్తగా నూరి
సిక్కంలో సద్ది గట్టుకొని వస్తది

మా అయ్య
పొద్దుతో పోటీపడుతూ
కొండలు కోనలు వాగులు వంకలు
అడవులు గుట్టలునట్లు
బీడు భూములు పచ్చిక బయళ్ళన్నీ పరివ్యాప్తిస్తడు
తప్పిపోయిన తుంటరి గొర్రెపిల్లను
"టర్రే కూహ్" యని ప్రేమగ  కూతేసి పిలుస్తడు

కర్రెగొర్రె, ఎర్రగొర్రె, బింగిగొర్రె
కన్నెగొర్రె, బట్టగొర్రె, సుక్కగొర్రె అంటూ
సూడముచ్చటైన పేర్లతో పిల్సుకుంటం
అక్కచెల్లెండ్లు, అన్నతమ్ముడ్లని తల్సుకుంటం
మందలో బింగిగొర్రె పోడేలుంటే మందకు బిగువు

మెలితిరిగిన కొమ్ములతో
గండుచిరుతల సైతం
ఒక్కగుద్దుతో దెబ్బతీయగల
మేలైన రెండు టగారలు (పోడేళ్ళు)
మల్లన్న బీరన్న దేవుండ్లలాగ
మా మందకు నిలువెత్తు ధైర్యం

పొలాల్లో పొద్దంతా
తిట్లమూటలు మోసిన మా అయ్య
సాయంత్రం కడుపారా తిన్న గొర్లు
కుడుపుతుంటే గొర్రెపిల్లల్ని
ఆ దృశ్యాన్ని చూసి
తల్లి పిల్లల ప్రేమ పరిమళాలను చూసి
ఎంతటి భారాన్ని అలుకగా దించుకుంటడు

మాపున మందకాడ
కాల్చిన చింతవలకాయలు కమ్మగా తింటూ
పగటీలి సుద్దుల మూటలు విప్పి
తోటోళ్ళ ముందు గుమ్మరిస్తడు
ఏ గుట్టల ఏ చెట్టు ఉందో
ఏ పుట్టల ఏ పాముందో
ఏడేడా ఏం జరుగుతుందో విలేకరిలా
అన్ని పొల్లుపోకుండా పూసగుచ్చినట్టు
అందరికి వివరంగా ఇగురంగా ఎరుకజేస్తడు

మా అయ్య
అచ్చరం ముక్క రాకున్నా
అద్భుతంగా మందలోని గొర్ల లెక్కపెడుతడు
మహాజ్ఞాని కాకున్నా
మాయమైన గొర్రెపిల్లల్ని గుర్తువడతడు

భుజాన గొంగడి, చేత దుడ్డుకర్రతో
అన్నెం, పుణ్యమెరుగుని అమాయకపు మనిషి
నిత్యం ప్రకృతి ఒడిలో పెరిగి
మాసిన తల, మురికి బట్టలతో
నిర్మలమైన హృదయపుటద్దం
మా అయ్యది సాత్విక రూపమే

కథ

# పూసింది

పిడికిలై బిగుసుకోవలసిన ఆడతనం...



రావుల కిరణ్మయి
82475 66615

ఉదయం పాఠశాల ప్రారంభం కావడానికి ఇంకా అరగంట పైనే ఉంది. రోజులాగే ఊర్లోబస్‌కు వచ్చి ఆ రోజటి పేపర్ తిరగేస్తున్న ఆ పాఠశాల ఉపాధ్యాయిని దగ్గరకు ఆయాసంతో పరుగెత్తుతూ వచ్చిన ఏడవ తరగతి విద్యార్థి శారద

"టీచర్! టీచర్! మన వసంత కెనాల్‌లో పడిపోయింది" అని మొస పోస్తూనే చెప్పి వాళ్ళ అమ్మానాన్నలకు చెప్పడానికి అన్నట్లు ఊర్లోకి పరుగు తీసింది.

బడి, కెనాల్ రెండూ ఊరవతలే. కెనాల్ వైపు జనసంచారం తక్కువ అనేకంటే అసలు ఉండదనే చెప్పాలి. స్వచ్ఛ భారత్ పుణ్యమాని అటువైపు చెంబుతో వెళ్ళేవారుకూడా ఉండరు. వసంత మునిగి పోయి ఉంటుందని భయపడుతూనే, తామస కెనాల్ దగ్గరకు చేరి క్షణం ఆలస్యం చెయ్యకుండా కెనాల్‌లోకి దూకి ఒక దగ్గర నీళ్ళలో మునుగుతూ, తేలుతూ ఉన్న వసంత వైపు వేగంగా ఈదుతూ వెళ్ళి గట్టిగా ఒడిసి పట్టుకొని వీపు మీదకు ఎక్కించుకుంది, కానీ బరువు వల్ల వేగంగా ఈదలేక అవస్థ పడుతుంటే శారద చెప్పడంతో బండ్లమీద వచ్చిన యువకులు నలుగురయిదుగురు దూకి ఇద్దరినీ క్షేమంగా ఒడ్డుకు చేర్చారు.

అందరూ తామస చేసిన సాహసానికి అభినందించలేకుండా ఉండలేకపోయారు.

వసంత తల్లి జానకమ్మ తామస కాళ్ళపై పడి బోరున ఏడ్వసాగింది.

ఇవన్నీ తరువాత, ముందు వసంతను పి.హెచ్.సి.కి తీసుకెళ్ళండి అని ఇంతకు ముందు బండ్లపై వచ్చిన యువకులతో చెప్పి పంపించి వేసింది.

తామస చుట్టూ చూసింది శారద కోసం, శారద కనిపించలేదు. తడిచిన డ్రెస్‌తో తడబడుతూ నడుస్తూ బడికి చేరింది.

ఒక్కొక్కరూ ఊరిజనం ఎలా జరిగింది? అయ్యో! అయ్యో! టీచర్ లేకుంటే ఎలా ఉండేది? అంటూ ఆరాలు తీస్తూ రావడం మొదలుపెట్టారు.

ఈ హడావుడిలోనే తామసతో పాటు పనిచేసే ఉపాధ్యాయులు వచ్చేశారు. పూర్తిగా తడిసిపోయి తన దగ్గరున్న స్కార్ఫ్‌తో తుడుచుకుంటున్న తామసను, జనాన్ని ఆశ్చర్యంగా చూస్తుండగా, సురేష్ అనే టీచర్ మాత్రం తడిసి ముద్దయిన తామసను చూపులతోనే తడిమి తడిమి ఎగాదిగా చూడసాగాడు.

ఆమె భరించలేక స్కార్ఫ్ మొత్తం కప్పేసుకుంది. ఇప్పటికిప్పుడు ఇంటికి వెళ్ళాలన్నా వెళ్ళలేని పరిస్థితి. తను వేసుకున్న డ్రెస్ కొంచెం ఎండే వరకైనా ఆగాలని అనుకున్నది.

ప్రార్థనా సమావేశం అనంతరం హెచ్‌మ్ గారు తామసను పిలిచి, "మేడం! మీరు చేసిన ఈ సాహసం హర్షించదగినది. మీరే గనుక లేకుంటే వసంత బతికేదే కాదు. మిమ్మల్ని చూస్తే నాకు చాలా గర్వంగాను, సిగ్గుగాను ఉన్నది. ఎందుకంటే ఆ సమయానికి మేము పాఠశాలకు వచ్చి ఉన్నా కాపాడలేక పోయేవాళ్ళం. ఎందుకంటే మాకెవ్వరికీ ఈత రాదు. ఈ విషయంగానే నేను సిగ్గుపడుతున్నాను. ఏది ఏమైనా మీకు మరొకసారి మా అందరి తరుపున అభినందనలు తెలుపుకుంటున్నాను. మీరు సంతకం చేసి ఇంటికి వెళ్ళండి. తడిసిన బట్టలతో ఇబ్బందిగా ఉండి ఉంటుంది" అన్నాడు.

"థాంక్యూ సర్! కొంచెం ఆరగానే వెళ్ళిపోతాను" అన్నది.

"ఇప్పుడు ఇలా క్లాస్‌కేం వెళతారు? కానీ ఇక్కడే, ఫ్యాన్ కిందే ఉండండి. నాకూ క్లాస్ లేదు, మీకూ హాయిగా ఉంటుంది" అన్నాడు సురేష్ వెకిలిగా నవ్వుతూ ఎక్సరే కళ్ళతో చూస్తూ.

తామసకు చాలా చిరాకుగా అనిపించింది, అయినా పైకి శాంతంగానే "పరవాలేదు సర్! మీ సహృదయతకు చాలా చాలా ధన్యవాదాలు" అంది అంతే వెటకారంగా.

గ్రౌండ్‌లోకి వచ్చి కూర్చున్నా, వాడు మాత్రం తన చుట్టే చూపులు తిప్పడం గమనిస్తూనే ఉండగా శారద కవర్‌తో

కథ

వచ్చింది.

తన కోసమే వెతుకుతున్నట్టుగా తన క్లాస్‌కు వెళ్తుండడంతో "శారదా! నేను ఇక్కడ, ఇలా రా!" అని పిలిచింది.

శారద పరుగు పరుగున వచ్చి, నిలబడింది.

వసంతకు ఎలా ఉంది? ఇంత సేపు అక్కడే ఉన్నావా? అడిగింది.

వసంత బాగానే ఉంది టీచర్. నేను అప్పుడే ఇంటికి వెళ్ళి మీ కోసం మా అమ్మ చీర తీసుకొచ్చాను, టీచర్, మీ బట్టలు తడిసిపోయాయి కదా! అందుకని, మార్చుకుంటారని అన్నది ఇవ్వడానికి సంశయిస్తూనే.

ఏం వద్దు, నేను కాసేపటి తరువాత ఇంటికి వెళుతున్నాను అన్నది.

**ప్లీజ్! టీచర్! మీరు బట్టలు తడిసాయని ఇంటికి వెళ్ళొద్దు టీచర్! నేను మీతో చాలా మాట్లాడాలి. రెండు రోజులు పండుగ, ఆదివారం కలుపుకొని మూడు రోజులు వరుసగా సెలవులు వస్తున్నాయి. నేను చాలా ముఖ్యమైన విషయం మీతో మాట్లాడాలి టీచర్! ప్లీజ్! అంది ఏడుస్తూనే. ఇంకా, ఇది మా అమ్మ కొత్త చీరనే టీచర్, ఈరోజుకు కట్టుకోండి అంటూ చేతుల్లో పెట్టింది. తామసకు శారదను చూస్తే చాలా బాధగానూ, వింతగానూ అనిపించింది.**

ప్లీజ్! టీచర్! మీరు బట్టలు తడిసాయని ఇంటికి వెళ్ళొద్దు టీచర్! నేను మీతో చాలా మాట్లాడాలి. రెండు రోజులు పండుగ, ఆదివారం కలుపుకొని మూడు రోజులు వరుసగా సెలవులు వస్తున్నాయి. నేను చాలా ముఖ్యమైన విషయం మీతో మాట్లాడాలి టీచర్! ప్లీజ్! అంది ఏడుస్తూనే. ఇంకా, ఇది మా అమ్మ కొత్త చీరనే టీచర్, ఈరోజుకు కట్టుకోండి అంటూ చేతుల్లో పెట్టింది.

తామసకు శారదను చూస్తే చాలా బాధగానూ, వింతగానూ అనిపించింది.

ఏమిటి? ఈ అమ్మాయి, దేని గురించి చెప్పాలని అనుకుంటున్నది. ఎంత ముఖ్యమయిన విషయం కాకుంటే ఇంత సాహసం చేసి, పెద్ద ఆలోచనతో చీర పట్టుకువస్తుంది? అదేమిటో తెలుసు కోవాలంటే తను ఉండవలసిందే. ఉండాలి అంటే తడిసి బిగుతుగా ఉన్న డ్రెస్ మార్చాల్సిందే, అని అనుకుంటూ మారు మాట్లాడకుండా చీరను అందుకొని మధ్యాహ్న భోజనం వంటగది వైపు కదిలింది.

వంటలమ్మ నీలమ్మ అడ్డుపడి, ఏంటి మేడం? మీరు ఆ పిల్ల తెచ్చిన చీర కట్టుకోవడమేమిటి? ఆ పిల్ల కులం ఎరికేనా? అన్నది దీర్ఘం తీస్తూ బుగ్గలు నొక్కుకుంటూ.

కులం, మతం అనే భేదభావాలు ఉండకూడదని చెప్పే పవిత్ర విద్యాలయంలో గురువుగా ఉన్నాను. నేను వాటిని ఖండించి చూపించినప్పుడే కదా! పిల్లలు వాటిని ఖండించేది. ఇంకెప్పుడూ ఇటువంటి చౌకబారు ఆలోచనలు చేయకు. ఇంకొకరికి కల్పించకు. అని చక చకా చీరలోకి మారిపోయి క్లాస్‌కి వెళ్ళింది.

శారదను చూస్తే చాలా సంతోషంగా కనిపించింది.

ఉపాధ్యాయులు కూడా నీలమ్మ లాగే ఆలోచించారో! ఏమో! తెలియదు, కానీ, అలాగే చూస్తూ ఉండిపోయారు.

మేడం! మీరు వెళ్ళడం లేదా? అడిగాడు హెచ్‌ఎం.

"లేదు సర్, పిల్లలకు వరుసగా సెలవులు వస్తున్నాయి కదా! ఈ రోజు ప్రాజెక్టు ఇద్దామని ఉన్నాను" అన్నది.



క థ

సరే, మీ ఇష్టం అన్నాడు.

తరువాత, ఏడవ తరగతి క్లాస్‌కు వెళ్ళి, పిల్లలకు వర్క్ ఇచ్చి, శారదను ప్రత్యేకంగా పిలిపించుకుని కొద్ది దూరంలో కూర్చోబెట్టుకొని నెమ్మదిగా "శారదా ఏదో మాట్లాడాలన్నావ్ ఏమిటది?" అడిగింది ఎంతో లాలనగా.

శారద అటూ ఇటూ చూసి, ఎవరి పనుల్లోవారు ఉండడం గమనించాకే, వెక్కి వెక్కి ఏడుస్తూ

టీచర్! ప్రొద్దున వసంత కావాలనే కెనాల్‌లో దూకింది. మీరు లేకుంటే బతికేదే కాదు. నేనే జారిపడినట్టుగా అబద్ధం చెప్పాను. అలా చెప్పకపోతే ఎందుకు చావాలనుకున్నావని అందరూ ఇంకా తనని బాధపెడతారని, వాళ్ళ అమ్మ వాళ్ళు దానిని కొడుతారని భయంతో అలా చెప్పాను టీచర్!

వెరీగుడ్! వసంత ఫ్రెండ్‌గా చక్కగా ఆలోచించావు. మరి ఎందుకు చనిపోవాల నుకుందో నీకైనా తెలుసా?

తెలుసు టీచర్! వసంతకు ఓణీల ఫంక్షన్ అయినప్పటి నుండీ కొంతమంది వాళ్ళ ఇంటికి మందు కోసం, చికెన్ కోసం, మిర్చీల కోసం వచ్చేవాళ్ళు "పువ్వయి పూసిందిరా వసంత రాణి, కనిపించకుండా కప్పేస్తూ వేసిందిరా ఓణీ" అంటూ ఆకతాయిగా నవ్వుతూ ఏడిపిస్తున్నారట.

మరి, వాళ్ళ అమ్మానాన్న ఎవరూ అడగడం లేదా?

అడిగితే, ఏదో మనపిల్లే అని తమాషా చేస్తున్నామని చెప్పి తప్పించుకుం టున్నారట.

మొన్నొకడు చేయి పట్టి పిచ్చిపిచ్చిగా ప్రవర్తించాడట. అక్కడున్నవాళ్ళు తాగిన మత్తులో ఏదో తెలియక చేశాడు, వదిలెయ్యండి అన్నారట.

మరి, తనెందుకు ఉండాలి షాప్‌లో బడికి రావాలి కదా! అడిగింది తామస.

వాళ్ళకు ఆ షాప్ తప్ప వేరే బతుకు తెరువు లేదు. వాళ్ళ అమ్మ ఎక్కువ సేపు కూర్చోలేదు. వాళ్ళ నాన్న సరుకులు తేవడం, చిరుతిండ్లు చెయ్యడంలాంటివి చేస్తుండడం వల్ల వసంతకు తప్పడం లేదు.

అలాగా! అయినా, ఈ మాత్రం దానికే చనిపోతారా? ఎవరయినా?

లేదు టీచర్! మొన్న ఒకడు రాత్రికి నాతో రాకున్నా, ఈ విషయం ఎవరికైనా చెప్పినా మీ అమ్మానాన్నలను చంపేస్తానని బెదిరించాడట. దానితో ఎవరికీ చెప్పుకోలేక ఇలా చేసింది.

ఎంత దారుణం. పన్నెండేళ్ళ అమ్మాయిని కూడా వేధించాడంటే వాడెంతటి మూర్ఖుడు? ఇలాంటి వాన్ని ఊరికే వదిలిపెట్టకూడదు. కానీ, కర్ర విరగకుండా పాము చావాలన్నట్టుగా నిర్ణయం తీసుకోవాలి అనుకున్నది మనసులో.

టీచర్! మీరంటే వసంతకు చాలా ఇష్టం, మీరు చెప్తే తప్పకుండా వింటుంది. మీరే ఎలాగైనా తనకు ధైర్యం చెప్పి మళ్లెప్పుడూ ఇటువంటి పని చెయ్యకుండా చూడండి టీచర్! ఈ విషయాలన్నీ ఎవరితోనూ చెప్పకండి టీచర్! నేను తనకు మాట ఇచ్చాను. కానీ ఇప్పుడు తనను కాపాడుకోవడం కోసం మీకు చెప్పక తప్పలేదు అన్నది.

పన్నెండేళ్ళ వయసులోనే ఎంతో మెచ్యూరిటీతో మాట్లాడుతున్న శారదను మెచ్చుకోకుండా ఉండలేకపోయింది.

"శారదా! నువ్వు ఎవరికీ చెప్పకు, ఇక నేను చూసుకుంటాను. నువ్వు మాత్రం ఎప్పటిలాగానే వసంతను ఒక కన్నేసి ఉంచు" అని చెప్పింది.

మధ్యాహ్నం లంచ్ కాగానే తామస పర్మీషన్ తీసుకొని, శారదను వెంట బెట్టుకొని వసంతను చూడడానికి వాళ్ళింటికి వెళ్ళింది.

ఇల్లు ఓ మోస్తరుగా ఉంది, ఇంటి ముందు మిర్చీ బండి, చికెన్ సెంటర్, సిగరెట్లు, బీడిలు, మందు, కూల్ డ్రింక్ లాంటి వాటితో షాప్ కొంచెం పెద్దదిగానే ఉంది. పక్కనే గుడిసె లాంటి ఏర్పాటు కూడా ఉంది. తాగేవాళ్లు చాటుగా కూర్చోడానికి వీలుగా. ఇవన్నీ నిశితంగా చూస్తూ, లోపలికి వెళ్ళింది తామస.

చూడగానే జానకమ్మ కుర్చీవేసి, నిద్ర పోతున్న వసంతను లేపబోయింది.

తామస వారించింది. "నేను మీతోనే మాట్లాడాలి. వసంతను రోజూ బడికి ఎందుకు పంపించడం లేదు?" అడిగింది.

చూస్తిరి గదమ్మా! వసంత బొద్దుగా ఉండి ఎంత పెద్దదానిలా కనిపిస్తుందో! అందుకే చిన్నచిన్నగా పనులు నేర్పి వచ్చే ఏడు పెళ్ళి చేస్తే బాగుంటుందని అనుకుం టున్నాం, నాకూ పొద్దస్తమానం కూర్చోవడం చేతకావడం లేదు అంది.

"అందుకని ఆమె భవిష్యత్తు పాడు చేస్తారా?" అన్నది చాలా సీరియస్‌గా.

"అమ్మా! పేద ఇంట్లో ఆడపిల్లలంటే అందరికీ చులకనే. మీరు చెప్పే పుస్తకాలలోని ముచ్చట్లు వినడానికే బాగుంటాయి కానీ, నిజంగా మాలాంటి వాళ్ళకు అవి ఇమడవమ్మా!" అన్నది.

"నువ్వు ఈ ముచ్చట్లన్నీ పక్కన పెట్టి బడికి పంపించకుంటే నీ మీద పైవారికి కంప్లైంటు ఇవ్వవలసి వస్తుంది, జాగ్రత్త" అని కాస్త కటువుగానే హెచ్చరించింది.

"అమ్మాయిని జాగ్రత్తగా చూసుకో!" అనిచెప్పి బడికి వచ్చేసింది.

వచ్చేటప్పుడు వసంత వాళ్ళ నాన్న తననే తదేకంగా ఎందుకు చూశాడో అర్థం కాలేదు.

★ ★ ★

బడి వదిలేశారు. బస్ రావడానికి ఇంకా సమయం ఉండడంతో అక్కడే కూర్చుంది పోయింది తామస, ఒక్కతే ఉంది. చుట్టూ ఎవరూ లేరు. దూరంగా సైకిల్‌పై వసంత వాళ్ళ నాన్న తన వైపే రావడం గమనించింది.

ఈయన ఎందుకు వస్తున్నట్టు? ఇంటి దగ్గర ఏమీ మాట్లాడని వాడు ఇప్పుడెందుకు వస్తున్నాడు అనుకుంది మనసులో.

అమ్మా! మీతో ఒక విషయం చెప్పి పోదామని వచ్చాను. మా వసంతను మీరే ఈ ఊరి బడిలో కాకుండా వేరే ఎక్కడైనా దూరంగా ఉంచి చదివించండమ్మా! తను ఎక్కడున్నది మాక్కూడా తెలియనంత దూరంగా అన్నాడు.

ఏం? ఎందుకని?

కథ

ఎందుకంటే, ఈ ఊర్లో వసంత మీద చాలామంది కన్నేసి ఏడిపిస్తున్నారు, ఇలాగే నా పెద్దబిడ్డను కూడా చేస్తే తను తట్టుకోలేక బావిలో దూకి చనిపోయింది. ఇప్పుడు ఇది కూడా అలాగే చేస్తుందేమోనని భయంగా ఉందమ్మా! నా భార్యకు చదివించడం ఇష్టం లేదు. తను లేకుంటే ఇంటిపని, దుకాణంపని జరుగదు కాబట్టి, ఇక్కడే ఉంచి పని నేర్పిస్తూ ఎవరికో ఒకరికి అప్పగిస్తే బాధ్యత తీరిపోతుందని అనుకుంటున్నదమ్మా!

ఇంకో విషయం, సిగ్గు విడిచి చెప్తున్నాను, వసంత షాప్‌లో ఉంటె మాకు గిరాకీ కూడా బాగా జరుగుతుండడంతో తనను చూసి ఎవడైనా ఏమీ అడుగకుండా పెళ్ళి చేసుకుంటాడనే ఆలోచన వల్ల కూడా బడికి తోలడం లేదు. నాకు ఇది ఏమాత్రం ఇష్టం లేదు. నా బిడ్డను మీరే ఒకదారికి తెండమ్మా! అని ఏడుస్తూ ప్రాధేయపడ్డాడు.

తామస చలించిపోయింది. వసంతపై ప్రేమ ఉన్నా, పరిస్థితుల ప్రభావం వల్ల నిస్సహాయతను కొందరు ఆకతాయిలు ఎలా సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారో నెమ్మది నెమ్మదిగా అర్థమవుతుండగా, అతనికి ధైర్యం చెప్పి పంపించింది.

* * *

తామసను చీరలో చూసి ఆశ్చర్య పోతూ అడిగాడు తమన్. ఏం జరిగిందని?

కాస్త ఫ్రెష్ అయిన తరువాత, ఉదయం జరిగిన సంఘటన పూసగుచ్చి నట్టుగా చెప్పింది.

మరి నువ్వేం చెయ్యగలనని అనుకుంటున్నావు? అడిగాడు, వంటలో సాయం చేస్తూ.

ఈ రోజు వీళ్ళకు భయపడి ఊరు వదిలిపోయి చదువుకుంటే వసంత ఒక్కతే బాగుంటుంది. వాళ్ళు మళ్ళీ ఇంకో అమ్మాయిని ఏడిపించరని ఏమిటి గ్యారంటీ? అందుకే అదే ఊర్లో ఉంటూ వాళ్ల కళ్ళెదురుగానే ఉంటూ ఆత్మ విశ్వాసంతో, ఆత్మరక్షణతో బతికే విద్యనూ అందిస్తాను అన్నది దృఢంగా.

మీకు తెలుసుగా నాకు మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ ఉందని, తైక్వాండోలో శిక్షణ తీసుకున్నానని. ఇక మీదట పిల్లలకు వాటిని నేనే స్వయంగా నేర్పిస్తూ ఆత్మ విశ్వాసాన్ని, స్వీయరక్షణను కూడగడతాను అన్నది స్థిరంగా.

తమన్, వెరీగుడ్ తామస! అదొక్కటే కాదు, ఇంకో ముఖ్య అంశం డిజిటల్ మాధ్యమంగా జరుగుతున్న దారుణాలపై కూడా వారికి కొంత అవగాహన కలిగిస్తే ఇంకా ఏ విషయంలోనూ ఎదురుండదని ప్రోత్సహించాడు.

* * *

అలా తామస బడి అయిపోయిన తరువాత ఉచితంగా తరగతులు తీసుకొని పిల్లలలో మానసిక ధైర్యాన్ని నూరిపోసింది. వసంత, శారద వంటి బడి పిల్లలే కాక కాలేజికి వెళ్ళే పిల్లలు కూడా ఎంతో ఆసక్తిగా నేర్చుకొని తిరుగులేని శక్తిగా తయారయ్యారు.

తమన్ చెప్పినట్టుగా ఆన్లైన్ మోసాల గురించి డిజిటల్ వెల్బీయింగ్ పాలసీ గురించి పరిచయం చేసింది.

పూసింది పూసింది రాణి... అని ఏడిపించిన ఆకతాయిలే కాక, సురేష్ కూడా వెకిలిగా చూడకుండా గట్టి ట్రీట్మెంట్ ఇచ్చింది. ఇప్పుడు అమ్మాయిలందరూ ఆత్మవిశ్వాసంతో, స్వీయరక్షణతో పూస్తున్నారు.

కవిత

# మళ్ళీ మొదలవ్వాలి...



**కొమ్మెట కళ్యాణి, 80084 42908**

తప్పుగా రాసిన పదాలని చెరిపి మళ్ళీ రాసినట్టు
గతం తాలూకు జ్ఞాపకాలని చెరిపి మళ్ళీ మొదలవ్వాలి...
వడబోసిన తేనీటిలా మనసులోని మలినాలను
మచ్చుక్కూడ మిగలనీయక మళ్ళీ కొత్తగా మొదలవ్వాలి...

పడి లేచి నడిచే పసిపిల్లలా ఓడిన ప్రతీసారీ
ఆత్మస్థైర్యంతో లేచి మళ్ళీ మొదలవ్వాలి...
కనుకొలనుల్లో కన్నీటిని కనిపించకుండా చేసి మళ్ళీ మొదలవ్వాలి..
మనిషి మనసుకి వేసిన సంకెళ్ళను తెంచి మళ్ళీ మొదలవ్వాలి...
మళ్లీ మళ్లీ మొదలవుతూనే ఉండాలి..

వ్యాసం

# తెలంగాణ అంతర్వాహిని...

ఆత్మలను పట్టుకున్న అక్షరాలు...




సి.హెచ్. ఉషారాణి
94412 28142


కవి మనసు అంతర్లీనమైన ఆలోచనల, ఆవేశాల, ప్రవాహాల సమూహ వ్యక్తీకరణే దాస్యం సేనాధిపతి "అంతర్వాహిని".

భూమి తన గర్భపొరలలో అనేక ఖనిజాలను, నీటి వూటలను దాచుకొని పైకి నిశ్శబ్దంగా వుంటుంది. అలాగే ప్రతి మనిషిలో ఒక భావుకుడు, చిత్రకారుడు, తత్వవేత్త దాగి వుంటాడు. అది అనేక సందర్భాలలో అనేక విధాలుగా వ్యక్తపరుస్తాడు. వ్యక్తపరిచిన విధానాన్ని బట్టి ఒక ప్రక్రియలో ఒదిగిపోతాడు. భూమి పొరల్లో నీరు, చెరువు, నది, బావులుగా ఏవిధంగా రూపాంతరం చెందుతుందో లలితకళలు, సాహిత్య ప్రక్రియలు అంతే.

> **ఈ 53 మంది రచయితల యొక్క అమూల్యమైన అభిప్రాయాలను, అనుభవాలను చదువుతున్నప్పుడు వారి రచనారంగ ప్రవేశానికి కారణం చాల మంది ఒకే రకమైన సమాధానం ఇచ్చారు. వారియొక్క ఉపాధ్యాయుడే కారణమని. దీనిని బట్టి ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తూ విద్యావంతులుగా తీర్చిదిద్దడమే కాదు.**




సాహిత్యం... ఈ ప్రక్రియ ప్రజలలోకి చాల తొందరగా చొచ్చుకొని పోయేది. ఒక కవిని ఇంటర్వ్యూ చేసినప్పుడు అతని అభిప్రాయాలు చాల విలువను సంతరించుకుంటాయి. ఈ అంతర్వాహినిలో 53 మంది అమూల్యమైన రచయితల అభిప్రాయాలను ఒక్కచోటే చేర్చడం జరిగింది. ఇంతమంది ప్రముఖులను గురించి ఒకేచోట తెలుసుకునే అవకాశం దాస్యం సేనాధిపతి "అంతర్వాహిని". ఈయన ప్రముఖ కవి, ప్రసిద్ధ విమర్శకులుగా అందరికీ సుపరిచితులు. 13 గ్రంథాలను ప్రచురించినారు.

ఈ పుస్తకాన్ని మనం చదువుతున్నట్లు కాకుండా మనమే స్వయంగా రచయిత ముందు కూర్చుని వారి మనోగతాల గురించి, అనుభవాలను, అనుభూతుల మాలికలను అల్లుకుంట ముచ్చట పెట్టిన అనుభూతిలోకి తీసుకొని పోతుంది.

ఈ 53 మంది రచయితల యొక్క అమూల్యమైన అభిప్రాయాలను, అనుభవాలను చదువుతున్నప్పుడు వారిరచనారంగ ప్రవేశానికి కారణం చాల మంది ఒకే రకమైన సమాధానం ఇచ్చారు. వారియొక్క ఉపాధ్యాయుడే కారణమని. దీనిని బట్టి ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తూ విద్యావంతులుగా తీర్చిదిద్దడమే కాదు ఎంతోమంది రచయితలను కూడా సమాజహితానికి అందివ్వడంలో కీలక పాత్ర వహిస్తున్నారు. సిధారెడ్డి "నా అన్ని కళానైపుణ్యాలకు శివారెడ్డి మార్గదర్శకులు" అని అనడం వారి మనసును పట్టిస్తుంది. కవిత్వం ఎలా వుండాలో సిధారెడ్డి చెప్పిన నిర్వచనం నేటి కవులకు మార్గదర్శకం.

అయితే తెలంగాణ ఉద్యమ కాలంలో వచ్చిన స్ఫూర్తి తరువాత కాలంలో కూడా రచయితల్లో కొనసాగాలి అంటారు.

రచయితలను రచనలే నిలబెడతాయి కాని పురస్కారాలు కావు, రచయితకు విస్తృత అధ్యయనం అవసరం అంటారు. నేటి రచయితలకు ఇట్లాంటి ఈ

వ్యాసం

లక్షణాలు కొరవడినవి. ఇలాంటి లక్షణాలను అలవరుచుకోవలసిన ఆవశ్యకతను తెలియజెప్పారు.

సంగినేని రవీంద్ర తాను పెరిగిన వాతావరణం, తన చుట్టూ ఉన్న పరిసరాలు, కష్టాలు, కవిత్వాన్ని ఎంతైనా ప్రభావితం చేస్తాయి అంటారు. ప్రతి జాతి అస్తిత్వ పోరాటం చేస్తుంది, ఇందుకు కవిత్వాన్ని ఆయుధంగా వాడుకుంటుంది అన్నారు. ఇలాంటి విలువల్ని ఈ అంతర్వాహిని తనలో పొదువుకుంది.

కపిలవాయి లింగమూర్తి ప్రాచీన, ఆధునిక కవితా లక్షణాలను ఆకళింపు చేసుకుంటూ సామాజిక సమస్యలతో ప్రజల పక్షాన నిలిచి రచనలను చేస్తూ కవులు, రచయితలు తమ కలాలకు పని కల్పించాలని బాధ్యతను గుర్తుచేసినారు. వీరి సాహితీ కృషికి నివాళి అర్పించవలసేవుంది.

ప్రతిజాతికి గర్వించదగ్గ తృప్తినిచ్చిన క్షణాలుంటాయి. తెలంగాణ రాష్ట్ర సాధన గురించి ఆయన మాటలు ముత్యాల మూటలుగ అగుపడతయి. అమ్మంగి వేణుగోపాల్ అన్న మాటలివి.

"బతుకు పోరులో" ఓటమిలేని బి.యస్. రాములుగారి అమూల్య అభిప్రాయాలు ఉన్నాయి.

ఉద్యమకాలంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంకు ఎంత ప్రాధాన్యత ఉందో అందరికీ తెలుసు. ఆ సమయంలో ప్రత్యక్షంగా విద్యార్థి కార్యకలాపాలలో పాల్గొన్న మసన చెన్నప్పగారి అనుభవాల ముచ్చట చదవాల్సిందే.

దేవులపల్లి ప్రభాకర్‌రావు సామాజిక స్పృహ, సమాజం పట్ల బాధ్యతలేని కవిత్వం పదికాలాలు నిలువలేదంటూనే, తెలంగాణ ప్రాచీన కవుల, ఆధునిక కవుల రచనలను పాఠకులకు అందుబాటులోకి తీసుకురావాలి అంటారు. కాంచనపల్లి తెలంగాణ ఉద్యమంలో వెలువరించిన "తండ్లాట" దీర్ఘకావ్యం వీరి కృషికి మారు పేరుగా నిలవడమేకాదు వీరు కవి, కథకులుగా



**వర్ధమాన కవులకు, పరిశోధనలు చేసేవారికి, ఈ అంతర్వాహిని ఒక చీకటిలో దీపంలా దారి చూపుతుంది అని చెప్పవచ్చు. అంతేకాదు తెలంగాణ సాహిత్యంలో వచ్చిన గ్రంథాలు, జరిగిన సాహిత్య కృషి, జరగబోయే మార్పులు ఇవన్నిటినీ కూడా ఈ అంతర్వాహిని తనలో దాచుకుంది. ప్రతి రచయిత ఫొటో కూడా పెడితే మరింత అందాన్ని ఇచ్చేది.**

భావితరం వారికి ప్రోత్సాహంగా నిలిచారు.

డా॥ పల్లేరు వీరాస్వామి చిన్ననాడే సాహిత్యంలోకి ప్రవేశించి తెలుగుభాషలోనే కాకుండా ఆంగ్లభాషలో వచ్చే సాహిత్యాన్నంతటినీ పరిశీలించడం అవసరం అంటారు. వారాల ఆనంద్ మనిషి శ్వాస తీసుకున్నంత సహజంగా తనను తాను వ్యక్తీకరించుకునే రూపమే సృజన. కవిత్వం, పాట, వచనం ఒక్కొక్కరు ఒక్కొక్క రూపాన్ని వ్యక్తీకరణ కోసం ఎంచుకుంటాడు అంటారు. డా॥ కూరెళ్ళ విఠలాచార్య ఇంటినే గ్రంథాలయానికి అంకితమిచ్చారు. చిన్నప్పుడు చదువుకోడానికి పుస్తకాలు లేక వేరే విద్యార్థులు పండుకున్నంక వారు లెగిసేలోపు వారి పుస్తకాలు చదివేవారు అంటారు. వీరి అనుభవాలు, వీరి జీవితం భావితరాలకు పాఠంగాక ఏమైతది? విస్తృత అధ్యయనం కొండపల్లి నీహారిణి రచనా వ్యాసంగాన్ని మరింత ముందుకు తీసుకుపోతుంది. బహుముఖ ప్రజ్ఞాశాలి సరోజ బండ పాఠ్యాంశాలలో ప్రాంతీయతను చేర్చడమనే అభిప్రాయాన్ని వెలుబుచ్చారు. శ్రీ గన్నమరాజు, అయాచితం నటేశ్వర శర్మ, శ్రీమతి గరిశకుర్తి శ్యామల, శ్రీ ఎం.వి.నరసింహారెడ్డి, తెలంగాణ పోరాట నవలల్లో స్త్రీ అనే గొప్ప అంశముపై పరిశోధన చేసిన సుజాతగారి జీవితం స్ఫూర్తి దాయకమైనది.

జె. చెన్నయ్య తెలంగాణ సారస్వత పరిషత్తు ద్వారా అనేక సాహిత్య కార్యక్రమాలతో సాహితీ ప్రయాణం సాగిస్తున్నారు. కందాళై రాఘవాచారి, ఎస్. వేణుశ్రీ, టి. శ్రీరంగస్వామి, కన్నోజు లక్ష్మీకాంతం, లింగంపల్లి రామచంద్ర, శ్రీమతి పొద్దుటూరి మాధవీలత, రేగులపాటి కిషన్‌రావు, బండారు విజయ, బి. మురళీధర శర్మ, వెలిగొండ కాంతారావు, మౌనశ్రీ, వాసాల నర్సయ్య, జ్యోతిరాణి, హనుమాండ్ల రమాదేవి, జగతీధర్, చిదెళ్ళ సీతాలక్ష్మి, సుజనాదేవి, దేవరాజు మహారాజు వంటి ప్రముఖుల అభిప్రాయాలు నిక్షిప్తం చేసుకుంది అంతర్వాహిని.

వర్ధమాన కవులకు, పరిశోధనలు చేసేవారికి, ఈ అంతర్వాహిని ఒక చీకటిలో దీపంలా దారి చూపుతుంది అని చెప్పవచ్చు. అంతేకాదు తెలంగాణ సాహిత్యంలో వచ్చిన గ్రంథాలు, జరిగిన సాహిత్య కృషి, జరగబోయే మార్పులు ఇవన్నిటినీ కూడా ఈ అంతర్వాహిని తనలో దాచుకుంది. ప్రతి రచయిత ఫొటో కూడా పెడితే మరింత అందాన్ని ఇచ్చేది. ఇంతమంది రచయితలను ఒక తాటిపైకి తీసుకరావడానికి ఎంతగా కష్టపడి ఉంటారో పుస్తకం చూస్తే అర్థం అవుతుంది. వారికృషికి ఎంతైనా జోహార్లు.

కవిత

# రగిలే వేసవి వెన్నెల్లో...!!!



కందకట్ల జనార్దన్, 78936 31456

ఎండకు తట్టుకోలేవు
ఎంతగానో తిట్టుకుంటావు..

ఎండమావుల్ని చూసి
ఎందుకో భ్రమపడి
భ్రహ్మరథంపట్టి పరిభ్రమిస్తుంటావు..!?

అయినా...
ఎండిన జీవితాలు మళ్లీ చిగురిస్తాయి
నిత్యవసంతం - నీ సొంతం
అది మళ్లీ మళ్లీ వస్తుంది
మది.. లేచి లేచి వేచి వేచి చూడాల్సిందే
వేసవి రవిలా-వేగుచుక్కలా...

నీలోకి నీవు లీనమై విలీనమై
నీ-నా మనోవీథికి వీణాగానమై
కొన్ని చన్నీటి మధురానుభూతుల్లో
వేసవి తాపానికి వేణువూదుతూ...

మండుటెండలను
మంచుటెడారిగా మచ్చిక చేసుకుని
వేనవేల వెండివెన్నెల వేడుకలా..
పట్టపగలే విరబూసే పున్నమి పూవులా...

చెమటోడ్చిన
స్వేదబిందువులన్నీ స్వేచ్ఛగా
చివరికి స్వాతిముత్యాలుగా
మారుతూ మెరిసి మురిసేందుకు...

ఉక్కునరాలు ఉప్పెనలై
ఉక్కపోతల కూడలిలో కూడా
దేదీప్యమానంగా-జ్వాజ్వల్యమానంగా

దారి దొరికే దాకా
దాహాల్నీ తీరిగ్గా తీర్చుకునేదాకా
ప్రజ్వలిస్తూనే ఉంటాయి...!

ఈ కాలవలయంలో
నిప్పులు కురిసే ఎండ
పూలవాన చినుకులై
చలిపులితో
వేసవిని వేకువనే
మరల మరల వేడుకుని
గ్రీష్మాన్ని శిరసుకెత్తుకుని
ఆ ప్రకృతికాంత-
ప్రతీ ఋతువులోని
కష్టసుఖాలకలయికని
కొత్తగా స్వప్నిస్తూంటుంది..!!

పుణ్యం కొద్దీ-
మూడుకాలాల పునరాగమనమే
పుట్టి పెరిగిన కొద్దీ-
పురివిప్పుకునే పురోగతి కోసమే
అపుడే... మన జీవనగమనం
రమ్యమైన గమ్యసుగమం...!!!

1968 నోబెల్ సాహిత్య పురస్కార గ్రహీత

సాహితీ శిఖరం

**యసునారి కవాబాటా 1899లో జపాన్‌లోని ఒసాకాలో జన్మించారు. జపనీస్ ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. 1920 నుండి 1924 వరకు, కవాబాటా టోక్యో ఇంపీరియల్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడు, అక్కడ అతను తన డిగ్రీని పొందాడు. ఆధునిక జపనీస్ సాహిత్యంలో కొత్త ఉద్యమానికి మాధ్యమం అయిన బంగీ జిడై ప్రచురణ వ్యవస్థాపకులలో ఆయన ఒకరు.**

# జపానీయుల మనస్సును ఆవిష్కరించిన యసునారి కవాబాటా



19 అక్టోబర్ 1968న, జపాన్‌లోని స్వీడిష్ రాయబారిగా పని చేస్తున్న కార్ల్ ఫ్రెడ్రిక్ అల్మ్‌క్విస్ట్, రచయిత యసునారి కవాబాటాను పిలిచి, ఆయనకు 1968కి గాను సాహిత్యంలో నోబెల్ బహుమతిని పొందినట్లు అధికారికంగా తెలియజేసారు. జపనీస్ రచయిత యసునారి కవాబాట సాహిత్యంలో ప్రదర్శించిన "జపనీస్ మనస్సు యొక్క సారాంశాన్ని గొప్ప సున్నితత్వంతో వ్యక్తీకరించే అతని కథన నైపుణ్యానికి" 1968 లో సాహిత్యంలో నోబెల్ బహుమతి వరించింది. 1927లో, యసునారి కవాబాటా ఇజు నో ఒడోరికో (ఇజు నర్తకి) అనే చిన్న కథతో రచయితగా అరంగేట్రం చేశారు. అనేక విశిష్ట రచనల తర్వాత, నవల యుకిగుని (1937) (మంచుదేశం) జపాన్‌లోని ప్రముఖ రచయితలలో ఒకరిగా కవాబాటా స్థానాన్ని పొందినారు. 1949లో, కవాబాటా సెన్బజురు (వెయ్యి క్రేన్లు) మరియు యమ నో ఓటో (ది సౌండ్ ఆఫ్ ది మౌంటైన్) సీరియల్స్ ప్రచురణను ప్రారంభించారు. యసునారి కవాబాటా 1899లో జపాన్‌లోని ఒసాకాలో జన్మించారు. జపనీస్ ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. 1920 నుండి 1924 వరకు, కవాబాటా టోక్యో ఇంపీరియల్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడు, అక్కడ అతను తన డిగ్రీని పొందాడు. ఆధునిక జపనీస్ సాహిత్యంలో కొత్త ఉద్యమానికి మాధ్యమం అయిన బంగీ జిడై ప్రచురణ వ్యవస్థాపకులలో ఆయన ఒకరు. అతను 1953లో ఆర్ట్ అకాడమీ ఆఫ్ జపాన్‌లో సభ్యుడయ్యాడు మరియు నాలుగు సంవత్సరాల తర్వాత అతను క్లబ్ ఆఫ్ జపాన్ P.E.N ఛైర్మన్‌గా నియమితుడయ్యాడు. అనేక అంతర్జాతీయ కాంగ్రెస్‌లలో కవాబాటా ఈ క్లబ్‌కు జపనీస్ ప్రతినిధిగా ఉన్నారు. ది లేక్ (1955), ది స్లీపింగ్ బ్యూటీ (1960) మరియు ది ఓల్డ్ క్యాపిటల్ (1962) అతని తరువాతి రచనలుగా పేర్కొనవచ్చు. ది ఓల్డ్ క్యాపిటల్ రచయిత యొక్క స్వదేశంలో మరియు విదేశాలలో లోతైన ముద్ర వేసింది. 1959లో, కవాబాటా ఫ్రాంక్‌ఫర్ట్‌లో గోథే-పతకాన్ని అందుకున్నారు. 11 జూన్ 1899న ఒసాకా, జపాన్లో జన్మించిన ఆయన 1972 ఏప్రిల్ 16న జుషి, జపాన్లో మరణించారు.

కథ

# ఎటులైనా నిలబెడుతా......

**ఇంటిల్లిపాది ఏకమైనా చలించని తండ్రి...**



దాసరి మోహన్
99853 09080

మా ఇంటిలో ఇప్పుడు ఒక ప్రత్యేక సమావేశం జరగనుంది. ఒక అసెంబ్లీ సమావేశం కంటే తక్కువేం అనిపించడం లేదు... అధికార పక్షంలో నేను, ప్రతిపక్ష పాత్రలో కొడుకు కూతురు ఉన్నారు.. మా ఆవిడది ప్రత్యేక పార్టీ, ఎటువైపు మద్దతు పలుకుతుందో చూడాలి మరి. ఇక స్పీకర్ కుర్చీలో మా పెద్దన్నయ్య... మొదటిసారి ఒక హెూదాలో పిలిచానని మహా ఆనందంగా వున్నారు.

ఎజెండా ప్రకారం వారి వారి వాదనలు తయారు చేసుకున్నారు అనే కంటే ఆయుధాలు పదును పెడుతున్నారు అంటే బాగుంటుంది. ఒక వేటు పడితే కానీ శాంతించేలా లేరు. ఈ కోపాలకు, ఈ సమావేశానికి కారణం నా కోరిక. అవును. నా కోరిక వారిని కలవర పెట్టడమే కాదు, దూరం చేసేలా వుంది. అయినా నా కోరికకు కట్టుబడి ఉన్నాను. వారు నాతో విభేదించినంత మాత్రాన నేను తగ్గను. ఇన్ని రోజుల తరువాత నేను ఒక నిర్ణయం తీసుకుంటే ఇంటిల్లిపాదీ నన్ను వింతగా చూస్తున్నారు..

పెద్దన్నగారు, ఇక మొదలు పెడదాం అన్నట్లు, ఒక్కసారి దగ్గి, గొంతు సవరించుకుని “అందరూ జాగ్రత్తగా వినండి. మీ అందరికి అవకాశం ఇవ్వబడుతుంది. నేను అవకాశం ఇచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోండి... అభ్యంతరకరమైన అంశాలు కానీ, ఆధారం లేని ఆరోపణలు కానీ, బాధ పెట్టే భాష కానీ వాడరాదు... ముఖ్యంగా క్రమశిక్షణ తప్పరాదు... ఇంకొకరు మాట్లాడేటప్పుడు మరొకరు మధ్యలో దూరకూడదు. అన్నయ్య పెద్దరికాన్ని తనివి తీరా అనుభవిస్తూ, నా ద్వారా వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రసంగం చేసే అవకాశం ఎప్పటికి రాదుగా ముందుగా వెంకటేశ్వర్లు మాట్లాడతారు” అని నా వంక సైగ చేశాడు...

“ఆయన మాట్లాడేది ఏముంది... పట్టు విడవకుండా వున్నాడు కదా... మళ్లీ మళ్లీ వినడానికి ఇదేమన్న రామాయణమా” శ్రీమతి గారు ఎప్పటిలాగానే తన అస్తిత్వాన్ని, జెండాను ఎగురవేస్తున్నారు.

“నువ్వు వుండవమ్మ... నీకు అవకాశం ఇస్తాను కదా... తొందర ఎందుకు...”

“ఆయన్ను తొందర పడకండి అని చెప్పండి... తన ఇష్టం వచ్చినట్లు చేస్తానంటున్నాడు.. ఆయనికి చెప్పరేం సుజాత ఆమె పూనకం వచ్చినట్లు వూగుతుంది.. పంతులు అంత పెద్ద తప్పు చేశారా...!?

“సరే సరే... ముందు వెంకటేశ్వర్లు మాట్లాడిన తరువాత నువ్వు ఏం చెప్ప దలచుకుంటే అది చెప్పు”.

అన్నయ్య గారూ అసహనం ప్రకటించారు...

“నాన్న మాట్లాడేది ఏముంది పెద్దనాన్న.. ముందు మాతోని మాట్లాడి నిర్ణయం తీసుకోవాలికాని, పెద్ద రాయుడులాగా నిర్ణయం తీసుకుని మాకు చెబితే ఎలా.. కనీసం అమ్మకు కూడా చెప్పకుండా అంత డబ్బుపై తను ఒక్కడే ఎట్లా నిర్ణయం తీసుకుని.. వూరంతా చెప్పి చివరకు ఇంట్లో చెబుతాడా...” కొడుకు కూడా సభా మర్యాద పాటించకుండా మాట్లాడడం అన్నయ్యను మరింత బాధ పెట్టింది... కానీ ఏమీ అనలేకపోతున్నాడు..

“అవి నా డబ్బులు నా ఇష్టం.. మీ అనుమతి అక్కర్లేదు..!” సంపాదన పరునిగా తగ్గదలచుకోలేదు.

“మేము మీ వాళ్ళం కాదా... పరాయి వాళ్ళమా...” కొడుకు లాజిక్ లాగాడు.

“మీకు చాలా చేశాను... ఇక నన్ను వదిలిపెట్టండి..” పంచ్ వదిలాను.

“ఏం చేశావు నాన్నా... నా కట్నం డబ్బులు పూర్తిగా ఇచ్చారా? నా కొడుకు పుట్టిన రోజుకు కనీసం ఒక తులం గొలుసు చేయించారా” కూతురూ అందుకుంది పాతవి కొత్తవి కలిపి.

“ముందు చెప్పినవి ఇచ్చాను కదా! Extra అడిగితే వున్నప్పుడు చూస్తాను అన్నాను. అది కూడా బాకీ ఉన్నట్లేనా? అయినా మీకేం తక్కువ అయ్యింది. గవర్నమెంట్ ఉద్యోగమే కదా...”

"గవర్నమెంట్ ఉద్యోగం అయితే కోట్లు వస్తున్నాయా...? అయినా మా అత్తమ్మవాళ్ళు సగం వాటా కోసం కోర్టు కేసే పెట్టమన్నారు నేను పెట్టానా? అన్నయ్యకు ఇచ్చినంత ఇయ్యమన్నానా...!?" కూతురు తక్కువేం కాదుగా నాన్నను నిలదీయడంలో.

"అత్తమ్మవాళ్ళు అన్నారా? నువ్వే ఐడియా ఇచ్చావా తల్లి" కొంత వెటకారకంగా అన్నాను.

"చూసావా అమ్మ... నాన్న ఎంతమాట అంటున్నాడు. అత్తామామలతో ఎన్ని మాటలు పడ్డా, మీ దాకా తీసుకురాలేదు. అయినా కూడా నాన్న నన్నే అంటు న్నాడు" ఏడుపు అనే వజ్రాయుధాన్ని అందుకుంది.

"ఆపండి... ఆపండి..." ఆర్డర్ ఆర్డర్ అన్నట్లు అరిచాడు నేటి స్పీకర్ పెద్దన్న..

"నేను అవకాశం ఇస్తా అన్నా కదా... ఎవరికీ వారే మాట్లాడడం ఒక క్రమశిక్షణ అంటూ ఉండాలిగా పైగా ఏడుపు ఒకటి ఇంట్లో ఏదో జరిగినట్లు.

"ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు మాట్లాడితే నన్ను ఎందుకు పిలిచినట్లు" పెద్దన్నయ్య ఆవేశంగా గట్టిగా అన్నారు.

"సారీ అన్నయ్య దానికి తెలియదులే.." కొంత వెనకేసుకు రావడానికి ప్రయత్నము చేసాను.

"తెలియదు, తెలియదు అనే కదా మోసం చేస్తున్నారు.." ఏడుస్తూ లాజిక్ జత చేసింది కూతురు.

"ఏడుపు ఆపమన్నాన..." గట్టిగా అరిచాడు అన్నయ్య..

"ఎలా ఆపుతది అండి... ఆడకూతురు అని చూడకుండా ఎలా మాట్లాడుతున్నారో చూడండి.." తల్లి ఎప్పుడూ కూతురు సైడే సుమీ...

"ముందు తను ఏమనుకుంటున్నారో చెప్పాక కదా, మీరు మాట్లాడవల్సింది.... మీకు ఏమైనా క్లారిటీ కావాలంటే ఇస్తాడు..."

అన్నయ్య అసెంబ్లీ సమావేశాలు బాగా చూసినట్లు వున్నారు...

"ఎన్నడు విన్నారండీ... మొన్న దీపా

> **"నాన్న మాట్లాడిన తరువాత మాకేం మాట్లాడడానికి మిగలదు. పెద్దాయన మాట తీసేయకూడదు అని మీరు నీతి వాక్యాలు చెబుతారు. రిటైర్మెంట్‌కు వచ్చిన డబ్బులను అందరికీ సమానంగా పంచాల్సిందే..." ఏకవాక్య తీర్మానం ప్రవేశ పెట్టాడు.. పెద్దకొడుకు.**

వళికి నాకు గొలుసు చేయిస్తా అన్నారు. చేయించారా. పోయిన సంక్రాంతికి పట్టుచీర కొనియ్యమంటే ఈ వయస్సులో నీకు పట్టుచీర ఎందుకు ఎక్కడికి వెళుతున్నావు అని తప్పించుకున్నాడు" సుజాతగారు పాతవి అన్నీ తోడుతున్నారు.

"Zero hourలో మాట్లాడవలసినవి ఇప్పుడెందుకు అమ్మా... అంటే మీరు ఇద్దరు వున్నప్పుడు మాట్లాడుకునేవి అందరి ముందు ఎందుకు అని నా ఉద్దేశం ఇది చీరల.. గొలుసుల పంచాయితీయా" అన్నయ్యగారు స్పీకర్ పాత్రలో జీవిస్తున్నారు.

మైక్ ఇవ్వకపోయినా ప్రతిపక్ష నాయకుడు, ఇక ఆగను అన్నట్లు పెద్ద కొడుకు లేచాడు..

"నాన్న మాట్లాడిన తరువాత మాకేం మాట్లాడడానికి మిగలదు. పెద్దాయన మాట తీసేయకూడదు అని మీరు నీతి వాక్యాలు చెబుతారు. రిటైర్మెంట్‌కు వచ్చిన డబ్బులను అందరికీ సమానంగా పంచాల్సిందే..." ఏకవాక్య తీర్మానం ప్రవేశ పెట్టాడు.. పెద్దకొడుకు.

"మీకు ఇల్లులు ఇచ్చాను. పొలం కూడా పంచి ఇచ్చాను. ఇంకా నా రిటైర్మెంట్ డబ్బుల పైన కన్ను ఎందుకు?" నాకు కోపం వస్తుంది.

" పోనీ డిపాజిట్ అయినా చేసుకోండి. ముందు ముందు ఏం అవసరాలు పడతాయో. ఎవ్వరికీ తెలుసు." సుజాత గారు ఇంకో ఆప్షన్ చెప్పారు.

కొడుకు కూతురు తల్లి అన్నీ



ఆలోచించి చాలా ఉపాయాలు ఆలోచించారు.

యుద్ధంలో ఒక వ్యూహం చెడినప్పుడు వెంటనే ఇంకో వ్యూహం అమలు చేస్తారు.. అలా వుంది ఇక్కడ..

రిటైర్మెంట్ కంటే కొన్ని రోజుల ముందు డబ్బుల్ని ఏం చెయాలి అని నేను మథనపడ్డాను. కానీ... కొడుకు కూతురు సంవత్సరము ముందు నుండే సన్నద్ధం అయ్యారు. పంతులును కదా పసి కట్టలేదు.

నీ డబ్బుల గురించి నీ కంటే నీ పక్క వాళ్లే ఎక్కువ ఆలోచిస్తారు. నిన్ను ఎలా కొల్లగొట్టాలో ఎన్నో ప్రణాళికలు రచించ బడతాయి కలికాలం.

"అన్నగారు నేను మాట్లాడవచ్చా..." ప్రాధేయపడ్డాను.

నా ఇంటిలో నేనే దోషిగా నిలబడ్డాను.

'తొందరగా చెప్పు... నీతో బాటు నన్ను ఏడిపించేలా ఉన్నారు' అని అందు కున్నాడు పెద్దన్నయ్య.

"అందరూ వినండి... విన్న తరువాత మాట్లాడండి" పెద్దన్న మళ్లీ ఒకసారి హుకుం జారీ చేశాడు..

నేను గంభీరంగా మొదలు పెట్టాను.

"ఇన్ని సంవత్సరాలు, నా స్తోమతను బట్టి, అవకాశాలను బట్టి కుటుంబాన్ని ఒక పొజిషన్‌లో పెట్టగలిగాను. ప్రతి నెలా జీతంలో పొదుపు చేసి.. చాలా కోరికలు చంపుకుని... పిల్లల భవిష్యత్తు కోసం కొన్ని స్థలాలు పొలాలు కొనిపెట్టాను. ఎవ్వరికీ తక్కువ చేయకుండా పెళ్ళిళ్ళు చేశాను. పెద్ద అయ్యారు అని పంచి ఇచ్చాను. ఇక పోతే ఇప్పుడు నేను రిటైర్మెంట్ అవుతున్నాను. ఒక వ్యక్తి రిటైర్మెంట్ అవుతున్నాడు అంటే, ఇక రెస్ట్ తీసుకుం టాడు అని.. చాలా డబ్బులు వస్తాయని అసూయ పడుతుంటారు. కానీ తనకు ఇంకేదో చేసే అవకాశం అని ఎవ్వరూ ఆలోచించరు. నాకు రిటైర్మెంట్ పెన్షన్ వస్తుంది. నెలవారీ అవసరాలు తీరుతాయి. అందుకే రిటైర్మెంట్‌తో వచ్చే నలభైలక్షలతో ఒక మంచి పని చేయాలను కుంటున్నాను.. స్కూల్ గోడల పరిస్థితి బాగా లేదు ఎప్పుడో కట్టిన స్కూల్.. ఎప్పుడు కూలిపోతుందో తెలియదు.. ప్రతి వర్షాకాలం పిల్లల పుస్తకాలు కాదు ప్రాణాలు అరచేతోలో పెట్టుకుని బతుకుతారు. రెండు పెద్దరూమ్‌లు కట్టించి, ఒకటి మా అమ్మ పేరు, ఇంకోటి నాన్న పేరు పెట్టాలనుకుంటున్నాను. ఇలా అమ్మనాన్నల ఋణం, బడి ఋణం ఏకకాలంలో తీర్చుకోవాలని అనుకుం టున్నాను. నేను అందరికీ ఆదర్శంగా నిలబడాలని అనుకుంటున్నాను. నన్ను చూసి ఇంకొంత మంది ముందుకు వచ్చి వారి బడిని వారు బాగు చేసుకోవచ్చు. నా ఆశయానికి అడ్డు పడకండి."

**రిటైర్మెంట్‌తో వచ్చే నలభైలక్షలతో ఒక మంచి పని చేయాలను కుంటున్నాను.. స్కూల్ గోడల పరిస్థితి బాగా లేదు ఎప్పుడో కట్టిన స్కూల్.. ఎప్పుడు కూలిపోతుందో తెలియదు.. ప్రతి వర్షాకాలం పిల్లల పుస్తకాలు కాదు ప్రాణాలు అరచేతోలో పెట్టుకుని బతుకుతారు. రెండు పెద్దరూమ్‌లు కట్టించి, ఒకటి మా అమ్మ పేరు, ఇంకోటి నాన్న పేరు పెట్టాలనుకుంటున్నాను.**

పెద్దన్న చప్పట్లు కొట్టారు. ఒక పెద్దన్నే చప్పట్లు కొట్టాడు.. మిగతా అందరు పళ్ళు కొరికారు..

"ఉపన్యాసం అయ్యిందా ఆదర్శ మూర్తి...." సుజాత వెటకారంగా అంది.

నేను నొచ్చుకున్నాను. నా ఆశయాన్ని నా భార్యనే ఉపన్యాసం అన్నందుకు.

"ఏదైనా అడగాలనుకుంటే సూటిగా అడగండి" పెద్దన్న అన్నాడు.

"అంత సూటిగా చెప్పాక... ఇంకేం అడుగుతాంలే" అంది సుజాత

" నువ్వేం అంటావమ్మా..." కూతురు వంక చూస్తూ అడిగాడు పెద్దన్న.

"నా డబ్బులు నా ఇష్టం అన్నప్పుడు.. నన్ను ఈ ఇంటిదానిగా చూడనప్పుడు... నేనేం చెప్పాలి. మా అత్తామామల మాటలతో నేను చచ్చిపోతాను" అని వాక్ ఔట్ చేసి వెళ్ళింది.

వెనకాలే తల్లీ వెళ్ళింది.

"బాబూ నువ్వేం అంటావు" కొడుకుతో అన్నాడు పెద్దన్న...

"ఇక కొడుకు లేడని అనుకోండి... చచ్చినా తలకొరివి పెట్టడానికి రాను..." ఆవేశంగా అనుకుంటూ వెళ్ళాడు.

"నీ నిర్ణయంలో ఏమైనా మార్పు వుందా తమ్ముడు..

పెద్దన్న అడిగాడు...

"లేదు అన్నయ్యా... వీళ్ళ ప్రవర్తన చూసాక నా నిర్ణయం మరింత బలపడింది. తలకొరివి పెట్టడానికి నాకు చాలా స్టూడెంట్స్ వున్నారు. నా ఆశయాన్ని అర్థం చేసుకోని కొడుకు అక్కరలేదు.. నా ఆత్మ శాంతించదు కూడా నేను నా రిటైర్మెంట్ డబ్బును బడికే ఉపయోగి స్తాను. ఎవరు అడ్డు వచ్చినా. ఎటులైనా బడిని నిలబెడతాను..."

"శభాష్ తమ్ముడు.. కుటుంబం అంతా కాదన్నా.. నీ ఆదర్శానికే కట్టుబడి వున్నావు.. ఆశయ సిద్ధిరస్తు.."

"ధన్యవాదాలు అన్నయ్య"

"ఇక ఈ సభ ముగిస్తున్నాను"

"ముగించడానికి ఏముంది మనిద్దరమే మిగిలాం. ఇంటిలో ఎవ్వరూ లేరు... పదండి బజారు కెళ్ళి టీ తాగుదాం"

"టీ పడాల్సిందే... తల పట్టినట్టు అయ్యింది..".

"మిమ్మల్ని ఇబ్బంది పెట్టినట్లు వున్నాను సారీ అన్నయ్య.

"సారీ ఎందుకులే .. నాకూ కొంత మేలు జరిగింది... ఇన్నాళ్లు నాకు పిల్లలు లేరని బాధగా వుండేది... ఇప్పుడు తొలిగి పోయింది... నేను పోయే లోపల నీలాగే ఏదైనా మంచి పని చేస్తాను"

"మీది పెద్దమనసు అన్నయ్యా".

"నీ అంత కాదులేరా" భుజం తట్టుతూ అన్నాడు.

ఇద్దరం మాట్లాడుకుంటూ వెళ్లి టీ తాగాము.. మళ్లీ అన్నయ్యకు థాంక్స్ చెప్పి బడివైపు బయలుదేరాను గర్వంగా.

కవిత



(ఎల్.వి. ప్రసాద్ ఐ హాస్పిటల్ అనుభవంతో)

# చక్షు ప్రపంచంలో...



ఎం.వి. ఉమాదేవి, 78423 68534

కారిడార్ల నిండా ఎదురుచూపుల కావ్యాలు
సందిగ్ధంతో కొన్ని,
నమ్మకపు ప్రతిబింబాలై మరిన్ని...
అక్కడ నయనాల భాష మాత్రమే నడుస్తూ..!

పసితనపు చూపులు సైతం
ప్రజ్ఞా వైద్య విశేషంతో
ఇంద్రధనుస్సులై..!

ముడతలు పడిన చర్మం
ఇంకా జవజీవాలనే ప్రదర్శన
ఆత్మవిశ్వాసం చాళ్లుగా దున్నిన చెలకలు
నరాలు తేలిన కాళ్ళుచేతుల్లో
నడమంత్రపు శక్తిని కూర్చుకునే ప్రయత్నం!

చీకటి నిండిన కనుపాపల
చిరకాల నిరీక్షణ...
గాయపడితేనే గంధపు పరిమళ భాగ్యం
కుర్చీల వరసల్లో
కూర్మి నిండిన ఆరోగ్యం
పక్కింట్లో వాళ్ళకీ, ఆత్మబంధువులకీ
రంగుల ప్రపంచం తిరిగి పరిచయం చేసేక
నల్లకళ్లద్దాల వెనుక నందనవన చిత్రాలు!

యంత్రాల ముందు కొలువుల నాగరికత
విద్యా చైతన్య వనమై
సరిచూసుకునే చికిత్స పద్ధతి!

భానుకిరణ ఆగమనం కంటే ముందే
ధవళ వస్త్రాల్లో నయనదేవతలు
చెరగని చిరునవ్వు...
ఇనుడు పశ్చిమాద్రి కేగాక
హఠాత్తుగా నిర్మానుష్య
ఆర్పుతున్న దీపాలు...
మసకబారిన చక్షువుల్లో ఆశా కిరణాలు!!
గోడలు మాట్లాడుకుంటాయి
రేపటి చూపు గురించి!

అప్పుడప్పుడు...
వైఫల్య ఛాయలు పర్చుకున్నా..
విక్రమార్క విజయమే
పైకి లేచిన బొటనవేలు
సహచరుల కంటివెలుగు!
శ్రీలు చెలగిన ఆరోగ్యం
సేవావిపంచి విశ్వవీథుల్లో
మోగించే నయన "ప్రసాదం"!!

వ్యాసం

# బడిపలుకులు పలుకుబడులు....

భాషా పరిణామాన్ని వివరించిన వ్యాసం...



కాలువ మల్లయ్య
91829 18567

(గత సంచిక తరువాయి)

**ఉర్దూ ప్రభావిత నానుడులు...**

తెలంగాణ భాషపై, సమాజంపై ఉర్దూ ప్రభావమెక్కువ. కోస్తాంధ్ర ప్రాంతం వందలేండ్ల బ్రిటీష్ పాలనలో ఉన్న మద్రాస్ ప్రెసిడెన్సీ పాలనలో ఉంటే తెలంగాణ ముస్లిం నవాబుల పాలనలో ఉంది. కోస్తాంధ్ర సాహిత్యంపై ఇంగ్లీషు, బెంగాలీ ప్రభావమెక్కువగా ఉంటే, తెలంగాణ సాహిత్యం, సమాజంపై ఉర్దూ, హిందీల ప్రభావముంది. ఉర్దూ, హిందీ దాదాపు ఒకే తీరులో ఉండటం. కోస్తా ప్రాంతంలో వచ్చిన హిందీ వ్యతిరేక ఉద్యమం తెలంగాణలో రాలేదు. ఉర్దూ ప్రభావంతో తెలంగాణ భాషలో అనేక జాతీయాలు చోటు చేసుకున్నాయి. జాన్తో, బాంచోత్, బహెన్‌కేలవ్‌డే లాంటి బూతుపదాలను వదిలిపెడితే ఊదు గాలది పీరి లేవది, అరబ్బులోని బాకి, లిఫాఫోలె మల్సుక పన్నడు, ఎండెలుమ వాన తురక, బాంచె బతుకులు, నీ బాంచెన్ కాల్మొక్తా లాంటి అనేక నుడికారాలు తెలుగు భాషలో చేరాయి. జమీందారీ, ఖరారునామా, జబర్దస్త్, బందోబస్తు లాంటి పదబంధాలు చేరి తెలంగాణ వాడుకభాషలో భాగమ య్యాయి. పీరీలు లేవాలంటే ఊదు పొగవేయాలి. వాని వల్ల ఏ పనీ కాదు అనే అర్థంలో ఈ పదబంధం వాడుతారు. అరబ్బులోని బాకీ అంటే తప్పకుండా చెల్లించాల్సిన బాకీ చెల్లించకుంటే అప్పు ఇచ్చినవాడు ఊర్కోడు. ముస్లిం నవాబుల కాలంలో వచ్చిన పదబంధమిది. ఎండకు కొంతవరకు ఓర్చుకోగలిగినా వానచ్చిందంటే పరుగెత్తాల్సిందే. ఆ కాలంలో వసూల్లకు ముస్లిం అధికార్లు వస్తే ఉన్న పరిస్థితిని వివరిస్తుంది. బాంచె బతుకులు, బాంచెన్ కాల్మొక్తా లాంటివి ఫ్యూడల్ వ్యవస్థ తెలంగాణలో చాలా కాలం కొనసాగిందని చెప్పడానికి ఉదాహరణలు. ఇలా ఎన్నో పదబంధాలు తెలంగాణ, తెలుగుభాషలో విడదీయలేనంతగా కలిసిపోయాయి.

**ఆర్థిక సంబంధితాలు...**

ఎవరి జీవితంలోనైనా ఆర్థికం అనేది అతిముఖ్యమైందే. అదే అన్నీ కాకున్నా ముఖ్యమైందన్నది వాస్తవం. కాని గ్రామాల్లో చాలా జీవితాలు ఇకా ఆర్థిక పరిస్థితులను చక్కబెట్టుకోవడానికే సరిపోతాయి. పేదరికంతో జీవనపోరాటాలూ తప్పవు. అలాంటి అనుభవాల్లోంచి అనేక పదబంధాలను రూపొందించుకున్నారు. పేదలు అన్నం తింటారు. ఉన్నవారూ తింటారు. కాని పేదలు తినేది ఎందుకు? ఆకలి తీర్చుకోవడానికి. ఉన్నవారు రుచికోసురం, పేదలిండ్లలో రుచీ పచీ లేని తిండి అనే పదం వినబడుతుంది. రుచిగా లేదన్న భర్తతో అన్నం తినడం రుచికోసు రమా? అంటుంది భార్య. కడుపు నింపుకోవడానికి ఇందులో ఎంతో లోతైన తాత్వికార్థముంది? పండుగనాడే మెతుకుల బువ్వ అనే పదబంధముంది. రోజూ జొన్న గడుకలాంటివి తినేవారికి, దళితులకు పండుగనాడు మాత్రమే మెతుకుల బువ్వ తినే అవకాశం దొరుకుతుంది. మెతుకులు కావాలన్నా పిల్లలతో మనకు రోజూ మెతుకులన్న మేడ దొరుకుతుంది బిడ్డా! పండుగనాడు తప్ప అనే తల్లిదండ్రులెంతో మందున్నారు. ఈ పరిస్థితి ఇప్పటికీ గ్రామాల్లో ఉంది. ఆకలి తెలియనీయ కుండా ఉండడానికి పేద బ్రాహ్మణులు తినకుండానే తాంబూలం వేసుకుంటారు. దీన్నే ఆకలి తాంబూలం అంటారు. కాలక్రమంలో కావచ్చు, స్వయంకృతం వల్ల కావచ్చు ఉన్నవాడు లేనివాడుగా, లేనివాడు ధనవంతుడుగా మారడాన్ని ఓడలు బండ్లు కావడం, బండ్లు ఓడలు కావడం పదబంధాల ద్వారా చెబుతారు. చిన్నమాటల్లో ఎంతద్భుత అర్థం వస్తుంది. ఇదే పదబంధాల ప్రత్యేకత. ఇంట్ల జ్యేష్టక్క కూసుంది అనే పదబంధంతో ఆ ఇంటి ఆర్థిక దుస్థితిని చెబుతుంది. జ్యేష్టక్కను దరిద్రానికి ప్రతీకగా వాడుతారు. కోడలచ్చిన వేళ అనే నానుడి ఉంది. ఇంటికి కొత్తకోడలు వచ్చినపుడు మంచి జరుగుతే అదృష్టజాతకమని, ఏదైనా చెడు

వ్యాసం

జరిగితే ఆమెను కారణం చేస్తారు. ఎవరొచ్చినా కాలక్రమంలో జరిగేదే జరుగుతుందని, మన దుస్థితికైనా, మంచిస్థితికైనా మన పనులే కారణమన్న విషయాన్ని తెలుసుకుంటే ఏ చిక్కులూ ఉండవు.

### పండుగలు, అదృష్టంపై పదబంధాలు...

జానపదులు కాని ఈనాటి విద్యావంతులు కాని మన అదృష్టాన్ని బట్టే అంతా జరుగుతుందని నమ్మేవాళ్ళున్నారు. దేవుడు రాసిన రాత తప్పదనే వాళ్ళూ ఉన్నారు. ఇలాంటి అదృష్టం, గ్రామాల్లో చేసుకునే పండుగలు, పబ్బాలననుసరించి కూడా చాలా పదబంధా లేర్పడ్డాయి. నొసటి రాత, అదృష్టవంతుడు, జాతకచక్రం, అష్టమిచంద్రుడు, అమాసచీకటి, ఉంటే ఉగాది లేకుంటె శివరాత్రి, పశువుల పండుగ, బోనాల పండుగ లాంటి అనేక పదబంధాలున్నాయి. నొసటిరాత అనే పదబంధంలో ఉన్న నొసలు, రాత పదాలకు ఈ పదబంధంలో పదాల అర్థం పోయి నుదిటిపై గీసిన బ్రహ్మరాత తప్పించరానిదనే అర్థం వస్తుంది. ఉగాది నాడు అన్ని రకాల వంటలు, భక్ష్యాలు, చేసుకొని హాయిగా తింటారు. శివరాత్రి నాడు ఉపవాసమే. మనిషి జీవితం ఆర్థికంగా ఉన్నవాడికి రోజూ ఉగాదే. లేనివాడికి రోజూ శివరాత్రి ఉపవాసాలే అనే అర్థంలో ఈ పదబంధాలేర్పడ్డాయి. అదృష్టవంతుడు మంచిజాతకం అనే అర్థంలో ఈ పదబంధాలేర్పడ్డాయి. అష్టమిచంద్రుడంటే అష్టమీ కాదు చంద్రుడూ కాదు. నిందలు మోసే వాడని. అష్టమి నాడు చంద్రుణ్ని చూస్తే నీలాపనిందలు పడుతాయని జానపదుల నమ్మకం. వాని ముఖంలో అమాసచీకటుంది. అంటే అమావాస్య రోజున్నంత దట్టమైన చీకటి నీడలున్నాయని. తెలంగాణలో బోనాల పండుగ ప్రసిద్ధి. సంక్రాంతిని పశువుల పండుగగా పిలుస్తారు. ఇలా వందలాది జాతీయాలు, తెలంగాణ సమాజంలో వాడుకలో ఉన్నాయి.

### అనుకరణ శబ్దాలు...

ప్రతి సమాజంలోనూ అనుకరణ శబ్దాలతో పదబంధాలున్నట్టే తెలంగాణ భాషా సమాజంలోనూ ఉన్నాయి. ఇందులో కొన్ని మొరటుగా, కఠినంగా అనిపించినా ఈ పదబంధాలు విస్తృతార్థమిస్తున్నాయి. బర్రున పిత్తుడు, చిర్రున చీదుడు, లబలబ మొత్తుకునుడు, కవ్వర కవ్వర వదురుడు, గజగజ వణుకుడు, ముస ముస మాటలు, సలసల కాగుడు, నసవెట్టుడు లాంటి అనేక పదాలు వాడుకలో ఉన్నాయి. ఈ పదబంధాలు ఆయా పనులు ఎంత తీవ్రతతో చేస్తున్న విషయాన్ని తెలుపుతాయి. కాకోలె కవ్వర కవ్వర ఒర్రకురా అనడంలో ఎంత లోతైన అర్థముంది. అనవసరపు ఒర్రుడు చాలించుమని హెచ్చరిక ఉంది. నీ ఒర్రుడు కాకిగోల తప్ప మరేం కాదన్న నిగూడార్థముంది. చిర్రున చీదడం అనడంలో బాగా ఏడ్చి ఏడ్చి ముక్కు నుండి కూడా నీరు కారుతుంటే చీదేంత ఎక్కువగా ఏడ్చాడని, లబలబ మొత్తుకోవడమంటే ఇంకేమీ చేయడం చేతకాక నిస్సహాయంగా తీవ్రధ్వనితో ఏడ్వడం. తీవ్ర ప్రమాదాన్ని ఊహిస్తూ భయంతో గజగజా వణికిపోవడాన్ని, భయంతోని తీవ్రతను తెలుపుతుంది గజగజ వణకడం అనే పదబంధం, నీళ్ళు పొగలు వచ్చేట్టు కాగడాన్ని సలసల కాగడమంటారు. ఇలా అనుకరణ శబ్దాలు వాడి ఏడ్చే, నవ్వే, బాధపడే, ఉరికే క్రియల్లో తీవ్రతను తెలిపే పదబంధాలివి. కంటికోధార అనే పదబంధముంది. ఇది ఏడ్చే సందర్భంలో వాడేది. కంటి నుంచి ధారాపాతంగా నీళ్ళు కారడాన్ని, ఏడ్పులో అత్యధిక డిగ్రీని చూపే పదబంధం. తల్లి చనిపోతే ఆమె కంటికోధారై ఏడ్చింది కాని అత్త చనిపోతే చుక్క కన్నీరు కూడా రాల్చలేదు. ఇలా పదబంధాల నుపయోగించి విశేషార్థాన్ని రాబట్టవచ్చు.

### మానసికపరమైన నుడికారాలు...

మానసిక, హృదయసంబంధమైన జాతీయాలు తెలంగాణ భాషా భూషణాల నదగినవి ఎన్నో ఉన్నాయి. ఆ పదబంధాలు వింటేనే షాక్ అయ్యేంత తీవ్ర ప్రభావం కలిగించేవీ ఉన్నాయి. చావుకబురునుగాని, బాగా బాధ కల్గించే విషయాన్ని గాని హఠాత్తుగా చెప్పకూడదంటారు. ఎంత తొందరగా చెప్పాల్సిందైనా అతిమామూలుగా కొంతసేపు మాట్లాడి నెమ్మదిగా చెప్పాలి. తండ్రి చావు కబురు విన్న తర్వాత ఆమె 'గుండె గుభేలు' మంది అంటారు. అంటే వినకూడని తీవ్రమైన దుఃఖకరమైన విషయాన్ని విని గుండె ఆగిపోయినంత పనయిందని. చెప్పలేనంత బాధ కల్గిందని. అతిసంతోషకరమైన విషయాన్ని హఠాత్తుగా విన్నా అలాంటి ఉద్వేగమే కలుగుతుంది. గుండె పగలడం, గుండె ఆగిపోవడం లాంటివన్నీ ఇలాంటి తీవ్రార్థాన్ని చెప్పేవే లాటరీలో కోటి రూపాయలు వచ్చిందని అకస్మాత్తుగా విని ఉద్వేగంతో గుండాగి పోయినవాళ్ళూ ఉన్నారు. కోర్టు తీర్పులో అతని ఆస్తులన్నీ పోయిన ఆతని పరిస్థితి 'మిన్ను విరిగి మీద పడ్డట్టు' అయింది. మిన్ను విరగదు మీద పడదు. ఈ పదబంధంలో పదాలకున్న అర్థం కాక ఆకాశం విరిగి మీద పడితే ఎంత భారంగా, కష్టంగా ఉంటుందో అంత కష్టంగా ఉందని అర్థం.

**ప్రతి సమాజంలోనూ అనుకరణ శబ్దాలతో పదబంధాలున్నట్టే తెలంగాణ భాషా సమాజంలోనూ ఉన్నాయి. ఇందులో కొన్ని మొరటుగా, కఠినంగా అనిపించినా ఈ పదబంధాలు విస్తృతార్థమిస్తున్నాయి. బర్రున పిత్తుడు, చిర్రున చీదుడు, లబలబ మొత్తుకునుడు, కవ్వర కవ్వర వదురుడు, గజగజ వణుకుడు, ముస ముస మాటలు, సలసల కాగుడు, నసవెట్టుడు లాంటి అనేక పదాలు వాడుకలో ఉన్నాయి.**

వ్యాసం

అపరిమితమైన భారాన్ని మోసినట్టయిందని అర్థం. ఆ విషయం తెలిసిన తర్వాత ఆయన నోటిమాట రాలేదు అంటారు. అంటే అత్యంత ఆశ్చర్యపోయాడని అర్థం. అది సంతోషంతో కావచ్చు. దుఃఖంతోనూ కావచ్చు. ఆ బాబుకు విమానం బొమ్మను కొనిస్తే గుర్రమెక్కినంత సంతోషం అయిందన్న పదబంధమూ ఉంది. ఆ బొమ్మ వల్ల గుర్రమెక్కిందీ లేదు. కాని చిన్నపిల్లలు గుర్రమెక్కితే ఎంత సంతోషపడుతారో అంత సంతోషపడ్డారని అర్థం. ఇలా తెలంగాణ భాషా సమాజంలో హృదయాలను కదిలించే, హృదయాలకు హత్తుకునే అర్థానిచ్చే అనేక నా'నుడు'లున్నాయి.

**శరీరవయవాల సంబంధితాలు...**

శరీరావయవాలకు సంబంధించిన పదాలు, పోలికలతో అనేక పదబంధాలున్నాయి. పొట్టోడు, కొయ్యోడు, బొత్తోడు, నల్లికుట్లోడు లాంటి అనేక పదాలున్నాయి. వాంది పెద్దబొక్క ఏనుగంత పెయ్యిలు అనడం గ్రామాల్లో చూస్తుంటాం. ఏనుగుతో పోల్చి చెప్పగలం. పండ్లు సరిగ్గా తోముకోక పాసుబట్టుంటే వాన్ని బంగారు పండ్లోడు అంటారు. పాసుపండ్లోడు తిట్టుపదంగా చెప్పడం ఒక పద్ధతయితే బంగారం రంగులో పాసుపట్టిన పండ్లున్నోడు అని కొంత మర్యాదగా చెప్పడం మరో పద్ధతి. బంగారు పండ్లోడు అనే పదబంధం గౌరవంగా చెబుతూనే దెప్పిపొడవడం. గజం పుల్లగాడు, బింగి చెవులోడు, గద్దముక్కోడు లాంటి పదబంధాలు కొంచెం మొరటుగా చెప్పినట్టు అనిపించినప్పటికీ విశేషమైన అర్థాన్నిస్తాయి. వాడెప్పుడు ఎట్లనో ఉంటాడేంది అనే ప్రశ్నకు మాడ్పు మొకపోడు, వానిమొకమే గంత అనే జవాబులు రావడం చూస్తున్నాం. ఆస్తిమూరెడు, ఆశబారెడు అనే రెండు పదబంధాలు కలిసి రూపొందాయి. మూరెడు అంటే గజంలో సగం. మోచేతి నుండి నడిమి వేలు చివరివరకున్న పొడవు. మూరెడు కంటే బారెడు చాలా పెద్దది. ఆస్తి తక్కువగా ఉండి, ఖర్చులు, ఆశలు ఎక్కువగా ఉంటే ఈ పదాలను పయోగిస్తారు. ఎంత సంపాదించినా చివరకు మిగిలేది మూడుమూరల జాగ అని తాత్వికంగా అంటారు. మనిషి చనిపోయిన తర్వాత బొంద పెట్టడానికి, లేదా సమాధి చేయడానికి ఉపయోగపడేది మూడు మూరల నేలే. సంపాదనేదీ వెంటరాదు అనే అర్థంలో ఈ పదబంధాన్ని వాడతారు. నీ పరిస్థితి ఎలా ఉందని అడిగితే పీకల లోతుకు మునిగున్న అనే జవాబొస్తుంది. తెలంగాణలో దీన్నే బొండిగెల్దాక మునిగున్నారంటారు. తేరుకోలేనంత చాలా క్లిష్టపరిస్థితిలో ఉన్నారని అర్థం. ఇంకా పిక్కబలం, మోకాళ్ళబంటి దిగుబాటు, తలతిక్క, తలబిరుసు, కళ్లు నెత్తికెక్కడం లాంటి అనేక పదబంధాలు నిత్యవాడుకలో ఉన్నాయి.

**బూతు, శాపనార్థ పదబంధాలు...**

తెలంగాణ సమాజంలో మాత్రమే కాదు ఏ భాషా సమాజంలో నయినా బూతు, శాపనార్థాలకు సంబంధించిన పదాలు, పదబంధాలు విరివిగానే ఉంటాయి. ఈ బూతులు వాడటంలో మాటలుగా అసభ్యత కనిపించినా వాళ్ళ మనసుల్లో ఏ కల్మషమూ ఉండదు. నోటినుంచి ప్రవాహంలా ఈ పదజాలం వస్తూనే ఉంటుంది. తాతలు మనుమలు మనుమరాండ్రను, భార్యాభర్తలు ఒకర్నొకరిని, తల్లిదండ్రులు పిల్లలను, వరుసైనవారు ఇతర్లను ఈ పదాలను అలవోకగా ఉపయోగించి తిడుతారు. శాపాలు పెడుతారు. ఇందులో ఏ కల్మషమూ ఉండదు. వాళ్ల నోటినుండి మాటలు అలవోకగా వస్తాయి. అద్భుత అర్థాన్నిస్తాయి. మొల్దారం తెంప అనడంలో నువ్వు చచ్చిపో అనే అర్థం వస్తుంది. కాని మొలకున్న దారం, తెంపడం అనే అర్థాలేం రావు. మనిషి చనిపోయినప్పుడు బొందపెట్టేప్పుడు గాని, కాష్టంలో కాల్చేప్పుడు గాని నడుం చుట్టూ ఉన్న మొలదారాన్ని తెంపేస్తారు. ఇది ఆచారం. ఆడవాళ్ళు మగవాళ్లను తిట్టేప్పుడు వాడే అతి మామూలు పద

**తాతలు మనుమలు మనుమరాండ్రను, భార్యాభర్తలు ఒకర్నొకరిని, తల్లిదండ్రులు పిల్లలను, వరుసైనవారు ఇతర్లను ఈ పదాలను అలవోకగా ఉపయోగించి తిడుతారు. శాపాలు పెడుతారు. ఇందులో ఏ కల్మషమూ ఉండదు. వాళ్ల నోటినుండి మాటలు అలవోకగా వస్తాయి. అద్భుత అర్థాన్నిస్తాయి. మొల్దారం తెంప అనడంలో నువ్వు చచ్చిపో అనే అర్థం వస్తుంది. కాని మొలకున్న దారం, తెంపడం అనే అర్థాలేం రావు.**

బంధమిది. నిన్నెత్తుకపోను అనే పదం కూడా నువ్వు చచ్చిపో అనే అర్థంలో వాడేదే. మనిషి చనిపోతే పాడెగట్టి దానిపై పడుకోబెట్టి నలుగురు మనుషులు కాష్టం వరకు ఎత్తుకుపోయే ప్రక్రియ ఇది. నీ ఇంట దీపం పెట్ట దిక్కులేకుండగాను అనీ శపిస్తారు. అంటే ఇంటివాళ్ళందరూ చనిపోవాలని శాపం. నీతలపండు పలుగ అంటే కూడా నువ్వు చావాలనే.... శవాన్ని కాట్లో పెట్టి కాల్చినప్పుడు తలపగిలిపేలిపోతుంది. అదే తలపండు పగలడం. రాక్షసిముండ, సాటుకు సమర్తపుడు లాంటి పదబంధాలూ ఉన్నాయి. రేగు చెట్టుకింది భాగోతం లాంటి వ్యభిచార సంబంధ తిట్లూ ఉన్నాయి. ఏ మనిషయినా చదువు నేర్చుకోవాల్సిన సమయమెప్పుడంటే చన్ను విడిచి చన్ను బట్టే సమయం మధ్యలో నంటారు. తల్లిపాలు మరిచి పెళ్ళయ్యే వరకే మగవాడయినా, ఆడవాళ్లయినా చదువుకోవాల్సిన సమయమని. అందుకే వివాహం విద్యానాశనం అన్నప్పటికీ వివాహం తర్వాత కూడా చదువులు కొనసాగించడం చూస్తూ ఉన్నాం. మహాత్మాగాంధీ, బి.ఆర్. అంబేద్కర్ లాంటివాళ్ళు కూడా వివాహం తర్వాత కూడా పెద్ద చదువులు చదివారు. ఇప్పుడు

వ్యాసం

అరవై డెబ్బై ఏండ్ల పైబడినవారు చాలామంది తెలంగాణలో బాల్యవివాహాలు చేసుకొన్నా చదువును కొనసాగించినవారు చాలా మందే ఉన్నారు.

**ఆంగ్ల భాషా ప్రభావంతో వచ్చినవి...**

అనేక కారణాల వల్ల తెలుగు సమాజంలో చదువురాని మహిళలు, పురుషులు కూడా ఇరవై ముప్పై ఆంగ్లపదాలను ప్రతిరోజూ అనేక సందర్భాలలో ఉపయోగిస్తున్నారు. అలాగే రచయితలు, చదువుకున్నవాళ్ళు తమ రచనల్లో, మాటల్లో ఆంగ్లపదాలను విరివిగానే ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలో తెలుగు, ఆంగ్ల పదాల మిశ్రమంతో దుష్ట సమాసాలుగా అనేక పదబంధాలు ఏర్పడ్డాయి. సంస్కృతం, తెలుగు పదాలతో దుష్టసమాసాలు ఏర్పడినట్టే ఇవీ ఏర్పడ్డాయి. వీటిని దుష్టసమాసాలు అనడం కంటె జనం వాడుకలో ఉన్న ఇతర భాషా ప్రభావంతో ఏర్పడిన పదబంధాలుగా పేర్కొనవచ్చు. జనం వాడితే, రచయితలు రాస్తే అది దుష్ట సమాసం ఎలా అవుతుంది? హ్యామరసం, ప్లాస్టిక్ సంతతి, గ్లోబలి, హెూంశాఖ మంత్రి, టింగరోడు, టింగరిది.. లాంటి ఎన్నో పదబంధాలు న్నాయి. హ్యామర్ ఇంగ్లీషు ఏ సెంటిమెంటూ లేని ఈ తరాన్ని ప్లాస్టిక్ సంతతి అంటారు. గ్లోబలి, గ్లోబును బలితీసుకోవడం. ప్రపంచీకరణకు మరో పేరు గ్లోబలైజేషన్. భార్యను హెూం మినిస్టర్ లేదా హెూంశాఖా మంత్రిగా పిలువడం చాలా కుటుంబాల్లో ఉంది.

ఇవన్నీ కొన్ని మాత్రమే. తెలంగాణ సమాజంలో వేలాది పదబంధాలు ఇంకా అనేక విభాగాలుగా విభజించేవి ఉన్నాయి. గుంపగుత్త, కాళ్ళబ్యారం, కొయ్యోడు, కోయిల కంటం, కత్తులవంతెన, ఖంగుతినడం, జబర్దస్... లాంటి పదబంధాలు వేలసంఖ్యలో ఉన్నాయి. వీటి నన్నిటినీ గుమ్ముల్లో, గరిసెల్లో నింపి భద్రపరచాల్సిందే. ఇలా తెలంగాణ భాష (పదబంధాలు, సామెతలు, పదాలు) తమ ప్రత్యేకతను కాపాడుకుంటూనే సోదర తెలుగు ప్రాంత పదాలను, సరిహద్దు ప్రాంతాల భాషా పదాలను, ఉర్దూ ఇంగ్లీషు పదాలను తనలో సంలీనం చేసుకుంటూ సుసంపన్నమవుతుంది. ఈ భాషకు ఇంతవరకున్నవి చాలా వరకు బడిపలుకుల నిఘంటువులే. ఇంగ్లీషు భాషకున్న ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులా తెలంగాణ పలుకులు, పలుకుబడులు - సామెతలకు గుమ్మి గరిసె జీవద్భాషా నిఘంటువులు కావాల్సిన అవసరముంది. అలా భాషను తరతరాలకు సజీవంగా ఉంచవచ్చు.



# కఠిన ప్రేమ



సైదాచారి మండోజు, 6300 235 079

నా ప్రేమ నదిలో నువో కాగితం పడవ  
నా మనసు భావనలో  
- నువో క్షణిక తరంగ మాయ  
ఎన్ని ప్రేమ పల్లవులు  
నన్ను పఠించి పలకరించినా  
ఉత్సాహపు గగనంలో విహరించలేను  
విషాద సంధ్యల్లో నిద్రోను  
ఆనంద డోలికలో ఊగిపోను...!  
వలపువలలో చిక్కుబడను  
వలపు గాలం విసరకుండా వుండలేను  
మాయను మర్మంతో కనిపెట్టినోడిని  
మర్మపు లోగుట్టు కనుగొన్నవాడిని  
తత్వసారం ఎరిగినవాడిని  
వివరం తెలిసిన సన్యాస సంచారిని  
ఆ మత్తులో కాస్త సేద తీరుతా  
శోకిస్తా రోదిస్తా విరహిస్తా విరహంలో  
రగిలిపోతా... విరహాగ్ని చితిలో కాలిపోతా  
మరుపేలేని నా మదికి మరణం  
దాక ఎదురు చూస్తా...!!

స్పందన

# నాటి 'పచ్చికి' కథే నేటి 'బలగం'

గతపక్షం 'పచ్చి'కి కథపై పాఠకుడి స్పందన...



చిటుకుల మైసారెడ్డి
94905 24724

'గడ్డం సతీష్' అంటే మనకు తెలియని రచయిత కాదు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికతో పాటు పలు సామాజిక మాధ్యమాల్లో ఆయన రాసిన వ్యాసాలు వందల్లో ఉన్నాయి. ఆయన ఈతరం యువ తెలంగాణ తేజం. ఉడుకుడుకు అన్నంలో మామిడికాయ తొక్కు కలుపుకొని తింటే ఎంత కమ్మగా ఉంటుందో 'గడ్డం సతీష్' రాసే వ్యాసాలు కూడా అంతే కమ్మగా ఉంటాయనడంలో అనుమానమే అక్కర్లేదు. 'నమస్తే తెలంగాణ' దినపత్రిక వేదికగా ఆయన రాసే 'సామాన్యుడి మాట' కాలం పూర్తిగా తెలంగాణ భాషలోనే కొనసాగుతున్నది. ఈ కాలంలో గడ్డం సతీష్ ఎన్నో అద్భుతమైన కథలు రాశారు.

'బలగం' సినిమా విడుదల కాకముందే ప్రివ్యూ షో చూసిన గడ్డం సతీష్ సామాజిక మాధ్యమాల్లో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'బలగం సినిమా సూడుర్రి. నేను రాసిన 'పచ్చికి' కథ లాగే ఉంది' అని చెప్పాడు. అప్పటికే 'పచ్చికి' కథ చదివి ఉన్న నాకు పలు రివ్యూలు చదివితే కూడా అతను చెప్పింది నిజమే అనిపించింది. అందుకే మార్చి 3న 'బలగం' సినిమా మా సిద్దిపేటలోని వెంకటేశ్వర థియేటర్‌లో చూసిన. కాకితో మొదలయ్యే కథ కాకితోనే ముగుస్తుంది.

కాకి 'పచ్చి' ముడితే మరణించిన వ్యక్తి ఆత్మ శాంతిస్తుంది. ఈ వస్తువుతోనే 'పచ్చికి', 'బలగం' కథలు నడుస్తాయి. 'పచ్చికి' కథ చదివిన నేను, గడ్డం సతీష్ 2022 జూన్ 25న 'నమస్తే తెలంగాణ'లో రాసిన 'మన బలగం మనకు బలం' అనే ఆర్టికల్ కూడా చదివాను. తర్వాత 'బలగం' సినిమా చూసిన నాకు 'పచ్చికి' కథకు ఏ మాత్రం తేడా కనిపించలేదు. పాత్రల పేర్లు మాత్రమే మారాయి. 'పచ్చికి' కథ ఆధారంగా దర్శకుడు వేణు, నిర్మాత దిల్ రాజులు 'బలగం' సినిమా తీసినట్లు స్పష్టంగా తెరమీద కనిపించింది. అంతే 'నూటికి నూరుపాళ్లు 'బలగం' సినిమా 'పచ్చికి' కథ నుంచి పుట్టిందే అని సోషల్ మీడియా ద్వారా నా అభిప్రాయాన్ని రాశాను.

'పచ్చికి' కథలో తాత పాత్ర మల్లయ్య అయితే 'బలగం' సినిమాలో తాత 'కొమురయ్య, 'పచ్చికి' కథలో హీరో పాత్ర రాజు 'బలగం' సినిమాలో హీరో పాత్ర సాయిలుది. 'పచ్చికి' కథలో కొడుకు పాత్ర భూమయ్యది అయితే 'బలగం'లో కొడుకు పాత్ర ఐలయ్యది. అంతే పేర్లు మారాయి. ముఖ్యమైన అంశం ఏమంటే 'పచ్చికి' కథ ఆరంభంలో 'అవ్వల్లో... ఏ ఊకోర్రి, పోయినోడు లేసత్తడా...? వాడేమన్న పసివోరడా, ఎప్పుడో భూమి పుట్టినప్పుడు పుట్టిండు. సూడాల్సినయన్ని సూసిండు. చేయాల్సినయన్ని చేసిండు. ఇంతకుమించి ఇంకేం గావాలె' అని కథను ముందుండి నడిపించే రాజయ్య పాత్ర చెప్తుంది. 'బలగం' సినిమా ఆరంభంలో 'ఓరి మీ ఏడ్వు పాడుగాను, ముసలాయన బంగారు సావు సచ్చిండు. సంబురంగా పంపియ్యాలె.. సప్పుడు జేయుర్రా సప్పుడు జేయుర్రి' అని ఒక ముసలాయన కథ నడిపిస్తాడు.



'పచ్చికి' కథలో హీరో రాజుగాడు పొలం కాడ దాసిపెట్టుకున్న కాకిని తీసుకొచ్చి పచ్చి కాడ ఇడిసిపెడుతడు. 'బలగం' సినిమాలో హీరో సాయిలు మర్రిచెట్టు కాడ ఉన్న ఫ్యామిలీ ఫొటో తీసుకొచ్చి పచ్చి కాడ ఇడిసిపెడుతడు. రెండు కథల్లో ఆఖరికి కాకి పచ్చి ముట్టడంతోనే అక్కడున్నోళ్లందరు పకపకా నవ్వుతరు. ఇలా చెప్పుకుంటూ పోతే 'బలగం' సినిమా మొత్తం 'పచ్చికి' కథలోని ప్రతి అక్షరం కన్నీటి సిరా కనిపిస్తుంది. ఈ రోజు తెలంగాణలో 'బలగం' సినిమా ఇంతటి ప్రభంజనం సృష్టిస్తున్నదంటే దానికి కారణం రచయిత గడ్డం సతీష్ రాసిన 'పచ్చికి' కథ మూలమే అని ఘంటాపథంగా చెప్పవచ్చు. తెలంగాణ ప్రతి పల్లెలో 'బలగం' సినిమా ప్రదర్శన జరుగుతుంది. ఇంతగా ఈ సినిమా ప్రజల హృదయాలను తట్టి లేపుతున్నదంటే కథకు ఉన్న బలం. ఆ బలం ఎవరిచ్చారు? 'పచ్చికి' కథ రచయిత బలం ఇస్తే నేడు అది తెలంగాణ బలగం అయింది. తెలంగాణ జీవితాలు ఎట్లుంటయి? కుటుంబ బాంధవ్యాలు ఎంత బలంగా ఉంటాయి. సతీష్ రాసిన 'పచ్చికి' తెలంగాణ జీవనచిత్రం ద్వారా 'బలగం' పురుడు పోసుకున్నది. పురిటి నొప్పుల బాధ అమ్మకే ఎరుక. ఆ పురిటి నొప్పుల బాధలన్నీ తెలంగాణ తల్లికే ఎరుకే. ఆ తెలంగాణ జీవిత గాథల మట్టికెరుక. ఆ మట్టిబిడ్డ గడ్డం సతీష్ రాసిన 'పచ్చికి' కథ పురిటి నొప్పుల జీవమే బలగం బంధాలను గుండెలకు హత్తుకున్నది. ఇది నిజం. ఇదే నిజం, పచ్చి నిజం. అవును పచ్చికి వెట్టే సంప్రదాయం తెలంగాణది అని వెల్దండి వేణు మొండిగా వాదిస్తున్నాడు. ఆయన అనుకున్నదే మనం మాట్లాడుకుందాం. కథ తెలంగాణ సంప్రదాయం అయితే గడ్డం సతీష్ వలె పచ్చికి వెట్టే సంప్రదాయాన్ని కథ రూపంలో వేరే ఎవరు ఎందుకు తీసుకురాలేకపోయారన్నది నేను వేణుకు వేస్తున్న ప్రశ్న.

నేను చెప్పేదొక్కటే మిత్రులు వేణు, దిల్‌రాజులు ఈ సందర్భంగా ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. 'మనోని కంట్లె మన వేలుతో పొడిసే నైజం మన తెలంగాణది కాదు' అని సీనియర్ విశ్లేషకులు శ్రీశైల్‌రెడ్డి పంజుగుల 'బలగం' సినిమా చూసిన తర్వాత చెప్పిన గొప్ప మాట ఇది. ఈ సినిమా వివాదంలో ఒక్క పంజుగులనే కాదు, యావత్ తెలంగాణ సమాజం మొత్తం సోషల్ మీడియా వేదికగా 'పచ్చికి' కథా రచయిత గడ్డం సతీష వెంట ఉన్నది. 'నాటి పచ్చికి కథే నేటి 'బలగం' సినిమా అని కోడై కూస్తున్నది. ఇప్పటికైనా 'పచ్చికి' రచయిత గడ్డం సతీష్‌కు న్యాయం జరిగితేనే తెలంగాణ సమాజం హర్షిస్తది. అవార్డులు మీరు అందుకుంటుండవచ్చు. కానీ, సినిమాలు, కథల మీద అవగాహన ఉన్నోళ్లు 'గడ్డం సతీష్'దే నైతిక విజయం అని అభినందిస్తూనే ఉన్నారు.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర,
అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in



# సాహిత్య సంగీత సవ్యసాచి
# బాలాంత్రపు రజనీకాంతరావు

**1920** జనవరి 29 న జన్మించిన బాలాంత్రపు రజనీకాంతరావు బహుముఖ ప్రజ్ఞాశాలి. వాగ్గేయకారుడు, రచయిత, స్వరకర్త. తొలితరం సంగీత దర్శకుల్లో ఒకడు. 1920 జనవరి 29న పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలులో రజనీకాంత రావు జన్మించారు. ఆయన తండ్రి బాలాంత్రపు వేంకటరావు ప్రసిద్ధి చెందిన వేంకటపార్వతీశ కవుల్లో ఒకరు. 1961లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ఆయన రాసిన ఆంధ్ర వాగ్గేయకారుల చరిత్ర ఉత్తమ పరిశోధనా గ్రంథానికి లభించింది. ఇంకా ఆయనను వరించిన ఎన్నో అవార్డులు సార్థకతను పొందినాయి. టాగూర్ అకాడమీ రత్న - రవీంద్రనాథ్ టాగూర్ 150 జయంతి సందర్భంగా సంగీత నాటక అకాడమీ ప్రదానం చేసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం 1981లో బహుకరించిన గౌరవ డాక్టరేట్ కళాప్రపూర్ణను ప్రదానం చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2007లో ఇచ్చిన పురస్కారం కళారత్న అవార్డు,

అమెరికాలోని అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి ప్రతిభామూర్తి జీవితకాల సాఫల్య బహుమతి పురస్కారం, మదరాసు మురళీరవళి ఆర్ట్ అకాడమీ నాథసుధార్ణవ పురస్కారం, పుంభావ సరస్వతి, నవీన వాగ్గేయకార, 2008లో తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారం మొదలైనవి ఆయనను వరించినవి. ఆకాశవాణి కేంద్రంలో స్వరకర్తగా, గీతరచయితగా, సంచాలకునిగా పలు బాధ్యతలు నిర్వహించిన పలువురు కళాకారుల్లో రజనీకాంతరావు అగ్రగణ్యులు.

ఆయన ఎన్నో రచనలు చేశారు. ఆయన రాసిన శతపత్ర సుందరి గీతసంపుటిలో 200కు పైగా గీతాలున్నాయి. (దీనికి 1953లో తెలుగు భాషా సమితి పురస్కారం లభించింది). విశ్వవీణ రేడియో నాటకాల సంకలనం (1964లో ప్రచురణ), ఆంధ్ర వాగ్గేయకారుల చరిత్ర ఉత్తమ పరిశోధనా గ్రంథం. (దీనికి 1958లో తెలుగు భాషా సమితి పోటీ బహుమతి లభించింది), తండ్రి రచించిన ఏకాంతసేవను ఆంగ్లంలో అలోన్ విత్ స్పౌస్ డివైన్‌గా అనువాదం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీవారి కొరకు క్షేత్రయ్య పదాలకు ఆంగ్లానువాదం అమవురస్ ఆఫ్ ద డివైన్ కవహేర్డ్ రాశారు. అకాడెమీ వారికొరకే క్షేత్రయ్య, రామదాసు జీవిత చరిత్రలు రాశారు. 'రజనీ భావతరంగాలు' - ఆంధ్రప్రభలో శీర్షికగా వచ్చాయి. క్షేత్రయ్య పదాలు, గాంధారగ్రామ రాగాలు, గీతగోవిందం, భారతీయ సంగీతంలో ప్రాచీన రాగాలు మొదలైనవాటి మీద పరిశోధనావ్యాసాలు (మద్రాసు మ్యూజిక్ అకాడమీలో), జేజిమామయ్య పాటలు, మువ్వగోపాల పదావళి, త్యాగరాజు, శ్యామశాస్త్రి జీవితచరిత్రలు, ఏటికి ఎదురీత (కవితలు), చతుర్భాణీ (4 సంస్కృత నాటకాలకి తెలుగు అనువాదం), అన్నమాచార్య కీర్తనలకి ఆంగ్లానువాదం రాశారు. ఇవేకాక చండీదాసు, మేఘసందేశం, సంధ్యాదీపకళిక, మధురానగరిగాథ, సుభద్రార్జునీయం, గ్రీష్మఋతువు, శ్రీకృష్ణశ్శరణం మమ, మేనకావిశ్వామిత్ర, క్షీరసాగర మథనం (స్వరరచన), విప్రనారాయణ (స్వరరచన), కృష్ణశాస్త్రిగారి అతిథిశాల (ఉమర్ ఖయాం) (స్వరరచన) - పర్షియన్ బాణీలో కూర్చిన సంగీతం. దీనికి చాలా పేరు వచ్చింది. దివ్యజ్యోతి (బుద్ధుడు), విశ్వవీణ (ఓర్ఫియస్), కళ్యాణశ్రీనివాసం, నమోస్తుతే హరి మొదలైనవ సంగీత, నృత్య రూపకాలు ఆయన రాశారు. లలిత సంగీతాన్ని అభివృద్ధి చేసి జనరంజకం చేసి, లలిత సంగీతానికి ఆద్యుల్లో ఒకడిగా పేరొందాడు. ఆయన 2018 ఏప్రిల్ 22న మరణించారు.

# కవన గోదారి



డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి, 99497 00037

గిరి శిఖరాల్లో జన్మించి..
బిందువు బిందువు తోడై..
సమూహంగా ప్రవహించి..
పరుగులిడుతోంది గోదారి!

మానవ మేధా పొరల్లో పుట్టి..
ఆలోచనామృతాలు ఊరి..
భావ ఊటలు గలగల పారుతూ..
ప్రవహించు కవనం గోదారిలా!

నిర్మల గోదారి నదీ వేషమేసి..
ఇరుకు దారుల్లో వేగాన్ని పెంచి..
లోలోన ఆవేశ సుడులు ఎగిసి..
భూమాతను తానమాడిస్తు తరలె!

అక్షర గుంపే అర్థాన్ని నింపుకొని..
నరుల అవలక్షణాలకు మందు వెతికి..
మదిలోన మథనపడి నిలదీసి..
జనాన్ని జాగృత పరిచేదే కవనం!

సకల జీవుల గొంతులు తడిపి..
పచ్చని పైర్ల దాహాన్ని తీర్చి..
హరిత క్షేత్రాలన్నింటిని వికసింపజేసి..
లోకాల ఆకలి తీర్చెను కదా తల్లి గోదారి!

సర్వ జనుల మనసును తడిపి..
సద్భావనలకు ఊపిరి పోసి..
ఆకుపచ్చ ఆలోచనలు వికసింపజేసి..
నరుల అజ్ఞాన చీకట్లు చిదిమేదే కవనం!

పుస్తక పరిచయం

# చార్ ధామ్ యాత్ర - అనుభూతి చిత్రణ

అలంకారాలు తోడైన యాత్రాచరిత్ర...




సాగర్ల సత్తయ్య
79891 17415


'యాత్ర కేవలం తేదీల సంఘటనల వివరాలు మాత్రమే కాకుండా అక్కడ ఆ యాత్రికుడు పొందే అనుభవాలు, అనుభూతి, ప్రతిస్పందనల సమాహార రూపం కావాలి. అలా జరిగినప్పుడే ఆ యాత్ర నిజమైన యాత్ర అవుతుంది.' (తెలుగులో యాత్రా చరిత్రలు పుట సంఖ్య 99) అంటారు డాక్టర్ మచ్చ హరిదాసు. ఇట్టి యాత్రను అక్షరబద్ధం చేసినప్పుడు అది సాహిత్య చరిత్రలో యాత్రాచరిత్రగా నిలిచి పోతుంది. కూరెళ్ల పద్మాచారి ఇటీవల వెలువరించిన 'ఆధ్యాత్మికదారుల్లో చార్ ధామ్ యాత్ర ' గ్రంథం చదివినప్పుడు హరిదాసుగారి మాటలు గుర్తుకొచ్చాయి. ఆలంకారికమైన సొగసుతో ఆయా ప్రాంతాలను, వాటిని చూసినప్పుడు మనసులో కలిగిన భావాలను తనదైన శైలిలో వ్యక్తీకరించి పాఠకుడిని తన వెంట ఆయా ప్రాంతాలకు తీసుకు వెళ్ళగలిగారు.

"యాత్రాచరిత్రలో సృజనకారుడు తాను దర్శించిన వివిధ ప్రదేశాలను గురించి వివరిస్తాడు. దానికి తోడు అక్కడి తన అనుభవాలను అనుభూతులను పాఠకులకు నచ్చే విధంగా ఉటంకిస్తాడు. ఇవి కేవలం యాత్రాకథనాలుగా మాత్రమే కాకుండా, చారిత్రక స్పృహతో కొనసాగుతాయి. విశేషించి కవి,




యాత్రాచరిత్ర రాస్తే తగు మోతాదులో అలంకారాలు తోడై మనోహరంగా నిలుస్తుంది". (తంగేడు పక్షపత్రిక, సంపాదకీయం 15-30, ఏప్రిల్ 2023) ఈ మాటలు కూరెళ్ల పద్మాచారి యాత్రా చరిత్రకు సరిగ్గా వర్తిస్తాయి. ఆధ్యాత్మిక దారుల్లో "చార్ ధామ్ యాత్ర"లో చారిత్రక స్పృహ ఉంది. ఆలంకారిక సొగసు ఉంది.

కూరెళ్ల పద్మాచారిలో గొప్ప భావుకుడున్నాడు. యాత్ర ప్రారంభంలోనే హైదరాబాదులోఎయిర్ పోర్టుకు వెళ్లే క్రమంలో వర్షం అడ్డంకిగా మారినప్పుడు సాధారణంగా ఎవరైనా చిరాకు పడతారు. కానీ 'వానదేవుడు ఉరుములు మెరుపులతో మాకు శుభాకాంక్షలు తెలుపుతున్నాడు' అని భావించటం ఆయన సానుకూల దృక్పథానికి నిదర్శనం. కొద్దిపాటి వర్షానికి రోడ్డంతా మడుగులు కట్టింది. ఆకాశంలో వెలుతురు కరువైంది. విమానం మబ్బులతో సయ్యాటలా డుతుంది మొదలైన వాక్యాలు ఆయన వర్ణనా చతురతకు నిదర్శనాలు. తమలో ఉరకలెత్తుతున్న ఉత్సాహాన్ని పాఠకుల ముందు పరిచేందుకు 'మా ఉత్సాహం ముందు కొండలు చిన్నవవుతున్నవి' అంటారు. అంటే అక్కడి పర్యాటకుల ఉత్సాహము హిమగిరుల కంటే ఉన్నతంగా ఉంది అని చెప్పకనే చెప్పారు. హరిద్వార్‌కు వెళ్లే మార్గంలో 'బస్సు చిటపటలాడే ఎండను చీల్చుకుంటూ పోతుంది.' అనే వాక్యం పాఠకుడి మదిలో అందమైన భావచిత్రాన్ని ఆవిష్కరిస్తుంది.

గంగానదిని వర్ణించే సందర్భంలో పద్మాచారిగారి వాక్యాలు ఉత్తుంగ తరంగాలతో గంగ దుముకుతున్నట్లుగా కనిపిస్తాయి. 'డమడమ డమరుక ధ్వనులతో అన్నార్తుల దాహార్తుల మనోరథ సంతృప్తి కొరకు తన స్థానాన్ని పతనం చేసుకుంటూ లోక కళ్యాణి గంగ కొండ కోనలు దాటి సుడులు తిరుగుతూ

వయ్యారంగా తన మలుపులను అనుసరిస్తున్నది' (ఆధ్యాత్మిక దారుల్లో చార్‌ధామ్ యాత్ర పుట 62). ఎంత అద్భుతమైన వర్ణన..!! నిజంగా గంగా ప్రవాహాన్ని పాఠకుల కళ్ళముందు నిలుపగలిగిన వాక్య ప్రవాహం ఇది. బదరీనాథ్ కొండల అందాలను వర్ణించే క్రమంలో 'చీకటి దుప్పట్లను కప్పుకున్న కొండలు డ్యూటీ దిగినట్లు తెల్లని మంచు వస్త్రాలను ధరించి సేద తీరుతున్నాయి. ఉదయభానుని లేత కిరణాలు సోకి బంగారు మయమై ప్రజ్వలిస్తున్నవి.' అని చెప్పే మాటలు అక్కడి ప్రకృతి రమణీయతను పాఠకుల మనోఫలకంపై అద్భుతంగా ముద్రించగలుగుతున్నాయి. ఇట్లాంటి అనేక రూపకాలు ఆయా సందర్భాలలో అలవోకగా ప్రయోగించారు.

ఒకే విషయాన్ని అనేక సార్లు చెప్పాల్సి వచ్చినప్పుడు వచ్చిన పదాలే పునరావృతం కాకుండా విభిన్నమైన ప్రతీకలతో పాఠకులకు ఎక్కడా బోర్ కొట్టకుండా చెప్పడం పద్మాచారిగారి రచనలో ప్రత్యేకత. ఉదాహరణకు వీరు చేసిన పదిహేను రోజుల యాత్రలో అనేక సందర్భాల్లో నిద్రించాం లేదా నిద్ర లేచాం అని చెప్పవలసి వస్తుంది. అలా చెప్పడానికి ఎన్ని రకాల వాక్యాలు ప్రయోగించారో క్రింది వాక్యాలను గమనిస్తే అర్థమవుతుంది.

'సెల్ఫోన్లో వారు పెట్టే పాటలు ప్రయాణబడలికలో అలసి సొలసిన రెప్పలకు జోలపాటల జిగురు అంటించినట్లు ఉంది'.

'డిన్నర్ కానిచ్చి అలసిన శరీరాలను పరుపుల మీదకు నెట్టేసాం'.

'చలికి మందపాటి రగ్గుల కింద శరీరాన్ని దూర్చేసి ధవళకాంతుల గంగోత్రి దేవాలయ సందర్శనం కోసం ఉవ్విళ్లూరుతూ పెందలాడే నిద్రాదేవిని ఆహ్వానించాను'.

'నిద్రాదేవి ఉక్కు కౌగిలిని కష్టంగా విడిపించుకుని...'

'నిద్రాదేవి గాఢ పరిష్వంగాన్ని విడిపించుకోవడం'

'చలికి బద్ధకంగా కళ్ళు తెరుచుకున్నాయి.

నిద్రా దేవి వశీకరణ మంత్రాలకు దాసోహమైపోయాం'.

'ఆ యుగళగీతం నాలోని కూని రాగాల తుట్టెను నిద్రలేపింది' వంటి వాక్యాలు గద్య రచనలో పద్మాచారి శిల్ప శ్రద్ధకు మచ్చుతునకలు.

తాను చెప్పవలసిన విషయం ఆనందమైనా విషాదమైన చక్కని ప్రతీకలతో పాఠకులకు ప్రత్యక్ష అనుభూతి కలిగించడం వీరి ప్రత్యేకత. శ్రీనివాస్‌కు కుక్క కరిచినప్పుడు 'బస్సంతా భీత హరిరేక్షణ అయింది. ప్రశాంతిగారి కళ్ళలో యమున కన్నీరై కాలువలు కట్టింది'. అనే మాటలు అప్పటి విషాద వదనాలను ఉద్విగ్నస్థితిని తెలియజేస్తాయి.

చెప్పదలుచుకున్న విషయాన్ని అందంగా చెప్పడంలో పద్మాచారి అందవేసిన చేయి. గ్రూప్ ఫోటో దిగడాన్ని 'కెమెరా సూత్రంతో బంధించడం' అంటారు. నది అంచున లోయల వెంట ప్రయాణించే సందర్భాన్ని పాఠకులకు దృశ్యమానం చేస్తూ 'కుడివైపు ఆకాశాన్ని తాకే కొండలు, ఎడమవైపు అగాధములో ప్రవహించే యమున భూమి గుండెలను ఒరుసుకుంటూ మృదంగ ధ్వనుల సవ్వడులతో అంతరాంతరాల కవితావేశాన్ని తట్టి లేపుతున్నాయి' అని అభివర్ణించారు. ఈ వాక్యాలు చదువుతున్నప్పుడు మనం కూడా చార్ధామ్ యాత్రలో రచయితతో కలిసి ప్రయాణం చేస్తున్నామా అన్న అనుభూతి పాఠకులకు కలగక మానదు.

ఆయా సందర్భాలను తెలిపే క్రమంలో చక్కని ఆలంకారిక సొగసు ఈ యాత్రాచరిత్రలో కనిపిస్తున్నది. అనేక ఉపమా అలంకారాలు చెబుతున్న విషయానికి మరింత వన్నె చేకూర్చాయి.

'యమున మెలికలు తిరిగిన తాచులా మెల్లగా ప్రవహిస్తున్నది', 'మంచివాడి మనసులా యమున పరిశుభ్రంగా సాగుతుంది', 'ఆకాశానికి సూదుల్లా పొడుచుకుని ఎదిగిన పైన్ వృక్షాల సోయగం', 'వారంతా మాకు కాలకేయ సైన్యంలా కనిపించారు', 'ప్రయాణికులను ఎక్కించుకొని హెలికాప్టర్లు తుమ్మెదలా ఎగురుతున్నాయి'. మొదలైన ఉపమా అలంకారాలు ఇందుకు నిదర్శనాలు.

ఎన్నో ప్రయాసలకోర్చి చేసిన ప్రయాణం దగ్గరికి పోయే వరకు దేవాలయం కనిపించకపోయేసరికి కొంత నిరాశ... తీరా కనిపించాక వాళ్లు పడ్డ కష్టమంతా దూదిపింజల్లా ఎగిరిపోయింది అంటానే. భక్తి పారవశ్యంలో మనసు తేలిక



**పుస్తక పరిచయం**

పడింది అనడానికి దూదిపింజలను ఉపమానంగా వాడుకోవడం గమనించవచ్చు. భారతదేశపు అంచున ఉన్న మాన గ్రామం సమీపంలోని వసుధారా జలపాతాన్ని అభివర్ణిస్తూ సుమారు నాలుగు వందలకుపైగా అడుగుల నుంచి దుముకుతున్న జలం 'దివిజగంగ భూమికి ఇక్కడే దిగినట్లు ఉంటుంది' అంటారు. అక్కడి నీటి తుంపర్లు పైనుంచి విభూతి చూర్ణాన్ని కిందకు బుట్టల కొద్దీ కుమ్మరించినట్లు, ఆ చూర్ణం గాలికి తెరలు తెరలుగా విస్తరించినట్లు' ఆశ్చర్యం గొలుపుతాయని పాఠకులు అచ్చెరువు చెందేలా చెప్పారు.

సహ ప్రయాణికుల మనస్తత్వాలను తెలియజేసే సందర్భంలోనూ అక్కడి ప్రకృతితో మమేకమై అక్కడికి ఉపమానాలే వాడడం ఔచిత్యంగా కనిపిస్తుంది. గలగల మాట్లాడే భారతిని కొండ నుండి దూకుతున్న ప్రవాహంతో పోల్చారు. నెమ్మదస్తురాలైన భారతి చెల్లెలు రాజేశ్వరిని ఒద్దికతో కూడిన నిలకడ నదులతో పోల్చాడు.

సందర్భాన్ని బట్టి చక్కని ఉత్ప్రేక్షలతో తన యాత్ర అనుభవాలను పాఠకులకు ఉత్కంఠ కలిగించేలా చెప్పడం పద్మాచారి గారి రచనాశైలిలో కనిపిస్తుంది 'భక్తులంతా బారులు గట్టి స్వర్గారోహణ చేస్తున్నారా! అన్నట్లున్నదా సుందరదృశ్యం' కేదారనాథ్ వెళ్లే దారిలో కొండల పైకి భక్తులు ఎక్కుతున్న వైనాన్ని ఈ వాక్యాల ద్వారా తెలియపరిచారు. కేదార్నాథ్ స్వర్గధామం అని చెప్పకనే చెప్పారు. అక్కడి ప్రాకృతిక సౌందర్యం మనోహరమైన శబ్దాలు తన మనసును ఓలలాడించిన విధాన్ని తెలియపరచడానికి 'అసంఖ్యాక గుర్రాల మెడల్లో ఉన్న కంచుగంటల శబ్దం, అలకనంద నది మద్దెల చప్పుడు రెండు కలిసి సంగీత జుగల్బందిలా చెవులకింపుగా రససామ్రాజ్యంలోకి తీసుకెళుతుంది అని అతిమనోహరంగా వర్ణించారు. అనుభూతులను వ్యక్తీకరించే క్రమంలో కవితావేశం ఆవహించినట్లుగా చక్కని వృత్త్యనుప్రాసలు కనిపిస్తాయి.' తరులు

**ఒకే విషయాన్ని అనేక సార్లు చెప్పాల్సి వచ్చినప్పుడు వచ్చిన పదాలే పునరావృతం కాకుండా విభిన్నమైన ప్రతీకలతో పాఠకులకు ఎక్కడా బోర్ కొట్టకుండా చెప్పడం పద్మాచారిగారి రచనలో ప్రత్యేకత. ఉదాహరణకు వీరు చేసిన పదిహేను రోజుల యాత్రలో అనేక సందర్భాల్లో నిద్రించాం లేదా నిద్ర లేచాం అని చెప్పవలసి వస్తుంది.**

దాటి గిరులు దాటి ఝరుల తుంపరల తడుస్తూ... ఇలా సాగుతుందా వాక్యం.

భక్తి పారవశ్యంలో ప్రాకృతిక తన్మయంలో మునిగిపోయినా అక్కడి సామాజిక జీవనం పద్మాచారిగారి దృక్పథం నుంచి జారిపోలేదు. గుర్రాన్ని నడిపే అంకేష్ జీవితాన్ని తడిమి చూశారు. అతనికి ఉన్న జీవకారుణ్య భావనను సూక్ష్మదృష్టితో పరిశీలించాడు. అతని గుర్రం చేతక్‌కు అతనికి మధ్య అనురాగాన్ని గమనించారు. యమునోత్రిలో గుర్రము, పల్లకి నడిపే వారికి, అక్కడి వ్యాపారస్థులకు ఆరు నెలలే పని దొరుకుతుందన్న ఆవేదనా స్వరాన్ని ప్రకటించారు. డ్రైవర్ శర్మాజీ పట్ల మిక్కిలి సానుభూతి భావాన్ని వ్యక్తం చేశారు. చివరకు కొంత నగదును సమీకరించి అందజేయడంతో మానవతను చాటుకున్నారు. సీజన్లో నేపాల్ నుండి పల్లకి మోయడానికి వచ్చే బీదల బాధలను ఏకరువు పెడుతూ 'ఏం చేస్తాం.. ఆకలి దేశాల్ని దాటిస్తుంది' అంటూ వారి దుస్థితికి ఆవేదన చెందుతారు.

భారతీయ ఆచారాలలో ఉన్న శాస్త్రీయతను కూడా సందర్భానుసారంగా తెలియజెప్పడం ఈ యాత్రాచరిత్రలో గమనిస్తాం. 'అనేక ఓషధులతో తనిసిన నదుల్లో స్నానం చేయడం వల్ల ఆరోగ్యం స్థిరంగా ఉంటుందని నదీస్నానానికి ప్రాముఖ్యత ఇచ్చి, వాటికి దేవతలతో సమానంగా గుర్తింపు ఇచ్చి పుష్కరాల పేరుతో కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాడు భారతీయుడు' ఇట్లా నదీస్నానం వల్ల ప్రయోజనాలు పుష్కరాల వెనుక ఉన్న శాస్త్రీయత తెలియజెప్పారు.

సందర్భానుసారం ఆయా ప్రదేశాల పౌరాణిక, చారిత్రక ఘట్టాలను వివరించడంతోపాటు అక్కడి సంస్కృతిని, నమ్మకాలను తెలియపరిచారు. ఈ కోణంలో చూసినప్పుడు ఈ యాత్ర చరిత్ర ఒక విజ్ఞానదర్శిని మాత్రమే కాక కొత్తగా వెళ్లే పర్యాటకులకు ఒక గైడ్‌లా మార్గదర్శనం చేస్తుంది. అక్షరధామ్ వైభవం, ఆ కట్టడం నిర్మాణ విశేషాలు, హరిద్వార్ నామౌచిత్యం, గంగాహారతి చండీదేవి ఆలయం, యమునోత్రి వద్ద సూర్య కుండం, గంగ భూమికి దిగిన వృత్తాంతం, గంగోత్రి దేవాలయ ప్రాశస్త్యం, దేవాలయ చారిత్రక నేపథ్యం, పంచప్రయాగల గొప్పదనం, కేదారేశ్వర క్షేత్రమాహాత్మ్యం, గౌరికుండ్, నారాయణ టెంపుల్ , కర్ణప్రయాగ విశేషాలు, బద్రీనాథ్ దేవాలయం, గోవింద్ ఘాట్, తప్తకుండ్, బ్రహ్మకపాలం, వ్యాసగుహ, మొదలైన పౌరాణికాంశాలతో పాటు చిప్కో ఉద్యమం వంటి ఇటీవల సామాజిక చారిత్రాకాంశాలను, భారతదేశపు చిట్టచివరి గ్రామం మానగ్రామ విశేషాలను కూడా సందర్భానుసారం చక్కగా వివరించారు.

పద్మాచారిగారి చార్‌ధామ్ యాత్ర చదువుతుంటే ఆచార్య నాయిని కృష్ణకుమారిగారి కాశ్మీర దీపకళిక స్మరణకు వస్తుంది. వర్ణనల్లో కాశ్మీర దీపకళికకు 'ఆధ్యాత్మిక దారుల్లో చార్ ధామ్ యాత్ర' ఏంతమాత్రం తీసిపోదు. ఒక విషయాన్ని చెప్పడానికి ఆ అంశం లోతుల్లోకి వెళ్లి పరిశోధనాత్మక దృక్పథంతో సౌందర్యాత్మక స్పృహతో చెప్పగలిగిన పద్మాచారిగారు ఇప్పటికే ఎన్నో పుస్తకాలు వెలువరించవలసి ఉండె. జరగని దానికి చింతించడం కంటే ఇక ముందైనా కలాన్ని పరుగులు పెట్టిస్తారని ఆశపడుతున్నాను.



# చెలియలి కట్ట



**వకుళ వాసు, 99891 98334**

ఎక్కడికో ఈ పయనం కాలాన్ని
వెంటబెట్టుకొని చెలియలికట్ట దాటుతూ
ఎన్నో కఠినరాత్రుల కన్నీటి నదులలో
కొట్టుమిట్టాడుతూ ఉదయపురెప్పల తీరాన్ని చేరి

గుప్పెడుగుండెలో పిడికెడు ధైర్యాన్ని నింపుకొని
పాదాలలో సంకల్పశక్తిని ఆసరాగా చేసుకొని
అడుగులేస్తున్నా బతుకుపయనానికి

తొలిపొద్దులోని కెంజాయిరంగును మోముకు
పులుముకొని నాలుగు పువ్వుల నవ్వులను
అరువుగా అడిగి పెదాలకు అద్దుకున్న

ఎక్కడో అల్లంతదూరం నుండి శ్రవణపేయముగా
వినపడే శుభశకునాల పిల్లతెమ్మెర మోహనరాగాలను
ఎదనిండా నింపుకొని

నీకు నేనున్నాను ముందుకు నడువుమంటూ
వాకిలిలో వెలుగుపూలు జల్లి బంగరుకిరణాలతో
బాటను పరిచిన పొద్దులరేడే తోడుగా

చెమటచినుకులు జల్లుతూ బతుకు
పొలాన్ని దున్నుతున్న ఆశలపంట పండించేదాక
ఆగదు ఈపయనం కాలరేఖలపై...

ఎన్ని పోటురాళ్ళు తగిలినా మాటలముండ్లు
గుచ్చినా బెదరక అదరక అక్కరలేకుండా
పుట్టుకొచ్చే వెన్నుపోటు కలుపుమొక్కలను ఏరిపారేస్తూ

మొక్కవోని ధైర్యపు ఎరువును విరివిగా వెదజల్లుతూ
నవ్వులసెలయేరులను పారించి కన్నులనిండుగా
ఆనందపు పంట పండించనా
నా ఆయువు వాయువులో కలిసేవరకు ...

# అనువాదం మౌలిక సృజనాత్మక రచనకు ఏ మాత్రం తీసిపోదు...

- డా॥ జె. చెన్నయ్య

**చెన్నయ్య ముచ్చట్లలో మురిసిన అనుభవాలు, జ్ఞాపకాలు...**

**ప్రతిష్ఠాత్మక తెలంగాణా సారస్వత పరిషత్తు కార్యదర్శిగా మీ స్పందన.**

తెలంగాణ సారస్వత పరిషత్తు ఎనిమిది దశాబ్దాల ఘన చరిత్ర కలిగిన సంస్థ. గొప్ప వాళ్ళు అధ్యక్షులుగా, కార్యదర్శులుగా ఉన్నారు. దానికి నేను కార్యదర్శి కావడం గర్వకారణం. అయితే గొప్ప బాధ్యత కూడా. ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం, అందరి మన్నన పొందడం సామాన్యమైన విషయం మాత్రం కాదు. జర్నలిస్టుగా,తెలుగు విశ్వవిద్యాలయంలో తెలుగు భాషా సాహిత్యాలు, కళా సంస్కృతులతో ముడిపడిన నా 30 ఏళ్ల అనుభవం సారస్వత పరిషత్తు కార్యదర్శి బాధ్యతల నిర్వహణకు ఎంతగానో దోహదపడుతున్నది. మొదటినుంచి నా వృత్తి, ప్రవృత్తి భాషా సాహిత్యాలే కావడం వల్ల పరిషత్తు అప్పగించిన బాధ్యతలను నిర్వహించడం కష్టంగా అనిపించడం లేదు. వేతనం అనేది లేకుండా ఇంతకుముందు పెద్దలు చేసినట్టుగానే నా సేవలు కొనసాగిస్తున్నాను.

**సాహిత్యం, జర్నలిజం రెంటిలో మీది అపార అనుభవం, రెండింటినీ ఎలా సమన్వయం చేస్తున్నారు?**

సాహిత్యం, జర్నలిజం రెండూ కూడా భాషతో కూడుకున్నవి. అందువల్ల రెండూ ఏకకాలంలో నిర్వహించడం సమన్వయలోపానికి ఇబ్బంది లేని రంగాలే. మొదట



ప్రత్యేకంగా 10 సంవత్సరాల పాటు పూర్తిస్థాయి పత్రికారచన వృత్తిలో ఉన్నాను. తర్వాత విశ్వవిద్యాలయంలో ప్రజా సంబంధాల అధికారిగా ప్రవేశించాను. ప్రజా సంబంధాల రంగం పత్రికా రంగంతో అనుబంధం కలిగిన వ్యాపకం. ఒకరకంగా సోదరతుల్యం. దాంతో పాటుగా ఆకాశవాణిలో రేడియో జర్నలిజం వృత్తి నిర్వహణ 32 ఏళ్లుగా కొనసాగుతున్నది. వార్తలు ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించడం, చదవటం, రాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి ప్రముఖుల ప్రసంగాలను అనువదించడం, జాతీయ అంతర్జాతీయ సంఘటనల సమాచారం ఇక్కడి శ్రోతలకు వార్తలు రూపంలో అందించడం కొనసాగిస్తున్నాను. ఈ రెండూ నాకు విరుద్ధ అంశాలుగా కాకుండా ఏకకాలంలో రెండు ఇబ్బంది లేకుండా కొనసాగించేవిగానే ఉన్నాయి.

**మౌలికంగా మీరు రచయిత, అనువాదకులుగా విశేష కృషిచేశారు. రెంటిని గురించి చెప్పండి?**

రచయితగా, అనువాదకుడిగా ప్రయాణం కొనసాగుతున్నది. మొదట్లో కవిత్వం, కథ, వ్యాసం, సమీక్ష వంటివి రాశాను. పత్రికా రచన వృత్తి చేపట్టిన తరువాత సృజనాత్మక ప్రక్రియలు వదిలేసి భాషకు సంబంధించిన గ్రంథాలు, అనువాదాలు చేస్తున్నాను. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధనాసక్తి వల్ల తెలుగు దినపత్రికలు- భాషా సాహిత్య స్వరూపం అనే అంశంపై పిహెచ్డి చేశాను. తర్వాత పత్రికా రంగంలో ఉన్న వారికి ఉపయోగపడే విధంగా భాషకు సంబంధించిన మెళకువల గురించి కొన్ని గ్రంథాలు వెలువరించాను. ముఖ్యంగా పత్రికా రచనలో తెలుగు నుడికారం ప్రయోగించవలసిన ఆవశ్యకతను నా గ్రంథాల్లో ప్రధానంగా ప్రస్తావించాను. అనువాదం మొదటి నుంచీ ఇష్టమైన రంగం. మొదట్లో ఈతరాని వ్యక్తి బావిలో దూకినట్టే నేను అనువాదం ప్రారంభించినా తర్వాత విశేష

కృషితో పరిణతి సాధించే ప్రయత్నం చేశాను. ముఖ్యంగా అనువాదం చేసేటప్పుడు మూలానికి విధేయంగా ఉంటూనే లక్ష్యభాషలోని పాఠకులకు అర్థమయ్యే శైలిలో రాయాలన్న సూత్రాన్ని పాటించాను. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా పనిచేసిన బర్నాల ఆత్మ కథాత్మక రచనను ఆంగ్లం నుంచి తెలుగు లోకి అనువదించి ఉత్తమ అనువాద సాహిత్య పురస్కారాన్ని పొందాను. ఆ తర్వాత నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా వంటి సంస్థలు ఇచ్చిన అవకాశంతో మరికొన్ని గ్రంథాలు వెలువరించాను. అనువాదం మౌలిక సృజనాత్మక రచనకు ఏమాత్రం తీసిపోదు. మూలభాషలోని వాక్యాన్ని లక్ష్యభాషలోకి తీసుకొస్తున్నప్పుడు సృజనశక్తికి పదును పెట్టవలసి ఉంటుంది. అట్లా వాక్యాలు, పుటలు, మొత్తం పుస్తకం అనువదించడం పూర్తి చేసినప్పుడు కలిగే ఆనందం చెప్పనలవి కానిది.

**ఆకాశవాణితో మీ అనుబంధం చాలా నాళ్ళుగా ఉంది.. ఎలా మొదలయ్యింది... అరుదైన అనుభవాలు.. జ్ఞాపకాలు పంచుకోండి.**

ఆకాశవాణితో నా అనుబంధం 45ఏళ్ళ పైనే. మొదట రేడియో కార్యక్రమాలు విని శ్రోతగా ఉత్తరాలు రాసేవాణ్ణి. ఆకాశవాణి కళాకారులను అభిమానించేవాడిని. వాళ్ళలాగా మాట్లాడాలని శ్రోతల మెప్పు పొందాలని తపన కలిగింది. మొదట కవితలు కథానికలు మొదలైనవి రాసే ప్రసారం చేశాను. తరువాత ఆడిషన్‌లో నెగ్గి అనౌన్సర్ కం ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా ఎంపిక అయ్యాను. కార్యక్రమాలు స్వయంగా రూపొందించే నైపుణ్యం సంపాదించాను. రూపొందించిన కార్యక్రమాలను ప్రసారం చేసే బాధ్యతలు కూడా నిర్వహించాను. తొలితరం న్యూస్ రీడర్లు అద్దంకిమన్నార్, కందుకూరి సూర్యనారాయణ, దుగ్గిరాల పూర్ణయ్య, జూలీ పాలెం మంగమ్మ, తిరుమలశెట్టి, శ్రీరాములు, డివి వెంకటరామయ్య వంటి ప్రముఖుల వార్తలు వింటున్నప్పుడు

**నేను కూడా న్యూస్ రీడర్ కావాలి అనే పట్టుదలతో అను వాదం, వార్తా పఠనం రెండు పరీక్షల్లోనూ నెగ్గి న్యూస్ రీడర్, ట్రాన్స్లేటర్ అయ్యాను. వార్తలు అనువదించి చదవటంతోపాటుగా రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్ వంటి అత్యంత ప్రముఖులు స్వాతంత్ర్యదినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి ప్రత్యేక సందర్భాల్లో దేశ ప్రజలనుద్దేశించి చేసే ప్రసంగాలను అనువదించి చదవడం కొనసాగించాను.**

వారిలాగా న్యూస్ రీడర్ కావాలని కోరిక కలిగింది అప్పటివరకు యువవాణి అనౌన్సర్‌గా ఉన్న నాకు వయోపరిమితి పెరగడంతో సరిగ్గా అప్పుడే న్యూస్ రీడర్ ట్రాన్స్లేటర్ ఆడిషన్ రావడం ఎంపిక కావడంతో 1991లో ఆకాశవాణి వార్తలు అనువాదం చేయడం చదవడం ప్రారంభించాను. ఇప్పుడి దాకా కొనసాగుతూ ఉంది వార్తలు అనువాదం పట్టణంతో పాటుగా రాష్ట్రపతి ప్రధాన మంత్రి గవర్నర్ వంటి అత్యంత ప్రముఖులు స్వాతంత్ర్య దినోత్సవం గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలు ఉద్దేశించి చేసిన ప్రసంగాలను అనువదించి చదివాను. అనువాదంలోనూ, పఠనంలోనూ మంచి పేరు వచ్చింది. ఈ విధంగా శ్రోతల అభిమానం పొందాను.

**తెలుగు విశ్వ విద్యాలయం ప్రజా సంబంధాల అధికారిగా, విస్తరణ సేవా విభాగం ముఖ్యులుగా, కొంతకాలం సహాయ ఆచార్యులుగా బాధ్యతలు నిర్వహించారు. వాటిని గురించి తెలపండి.**

తెలుగు విశ్వవిద్యాలయం ప్రజాసం బంధాల అధికారిగా నేను జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, మహాకవి డాక్టర్ సి.నారాయణరెడ్డి గారి ఆశీస్సులతో చేరాను. ప్రజా సంబంధాల అధికారిగానే కాకుండా విస్తరణ సేవా విభాగం అధిపతిగా కూడా విశేష సేవలు అందించాను. కవులు, రచయితలు, కళాకారులకు విశ్వవిద్యాలయం తరుపున ప్రతిభకు తగిన గౌరవం లభించే విధంగా, వాళ్ళ రచనలు వెలుగు చూడటానికి విశ్వవిద్యాలయం పక్షాన సహాయం లభించే విధంగా, విశ్వవిద్యాలయం చేస్తున్న భాషా సాహిత్య వికాస కృషికి తగిన ప్రాచుర్యం వార్తా మాధ్యమాలలో లభించే విధంగా పాటుపడ్డాను. నా జీవితంలో ప్రధానమైన రెండున్నర దశాబ్దాలకు పైన కాలాన్ని తెలుగు విశ్వవిద్యాలయానికి అంకితం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించాను. అధ్యాపకుడు కావాలన్నది నా ఆశయం. అయితే కారణాంతరాల వల్ల ఇది నెరవేరలేదు. చివరి సంవత్సరాల్లో



ముఖాముఖి

అనువాద అధ్యయనకేంద్రంలో సహాయ ఆచార్యునిగా ఎంపికైనా ఎక్కువకాలం ఉండలేదు. అక్కడ బోధన లేదు. నాకు వేతనపరమైన ప్రోత్సాహం కూడా లేదు. అందువల్ల వెనక్కి వచ్చి పిఆర్ఓ గానే కొనసాగాను.

**మీకు యితర సంస్థలతో ఉన్న అనుబంధం గురించి తెలపండి?**

అమెరికాలో కాలిఫోర్నియాలో తెలుగు భాషాసంస్కృతుల పరిరక్షణ లక్ష్యంగా ఏర్పడిన సిలికానాంధ్ర సంస్థతో నాకు గాఢమైన అనుబంధం ఉంది. సంస్థ భారతదేశ ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం భారతదేశ ఉపాధ్యక్షుడిగా ఉన్నాను. అన్నమాచార్య సంకీర్తనల గురించి తెలుగు నాటనే కాకుండా వివిధ రాష్ట్రాలు, వివిధ దేశాలలో కార్యక్రమాలు నిర్వహించాము. లక్షగళ సంకీర్తనార్చన గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కింది. అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనం అమెరికాలోనూ, హైదరాబాదులోనూ, విజయవాడలోనూ పలుమార్లు నిర్వహించి మహా బృందనాట్యాలతో ప్రపంచ రికార్డును నెలకొల్పడం జరిగింది. అంతర్జాతీయ మంగళవాద్య సమ్మేళనం గురించి కూడా అందరికీ తెలిసిన విషయమే. ఇలాంటి కార్యక్రమాలు సంస్థ చాలా నిర్వహించింది. వాటిలో నా వంతు పాత్ర ఉంది.

**మహాకవి సి. నారాయణరెడ్డితో అత్యంత సన్నిహితంగా ఉన్న కొందరిలో మీరొకరు. ఒక రకంగా “అదృష్టం” అంటాను. మాకు వివరించండి?**

మహాకవి డాక్టర్ సి. నారాయణరెడ్డితో అనుబంధం నాకు లభించిన గొప్ప వరం. ఆయన వాత్సల్యం పొందిన అదృష్టం నాది. జర్నలిస్టుగా ఉన్నప్పుడు వారితో ఏర్పడిన పరిచయం, తెలుగు విశ్వవిద్యాలయంలో వారి చేతుల మీదుగా ఉద్యోగ నియామకం, సారస్వత పరిషత్తులో సంయుక్త కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా వారి వద్ద పనిచేసే మహాభాగ్యం ఇవన్నీ చెప్పుకోదగిన అంశాలు. వారి దగ్గర నేను నేర్చుకున్న విషయాలు నన్ను ఎంతగానో మలచాయి.



ఎక్కడైనా, ఏ స్థాయిలోనైనా అందరి మెప్పు పొందే విధంగా పనిచేయటం వారి నుంచి నేను నేర్చుకున్న గొప్ప సంపద అని చెప్పదగిన అవగాహన, శిక్షణ. నా జీవితమంతా కొలుచుకుంటున్న దైవం డాక్టర్ సినారె.

**మీరు సభ్యులుగా ఉన్న సుశీలా నారాయణరెడ్డి ట్రస్ట్, సినారె జాతీయ పురస్కారాల గురించి చెప్పండి?**

డాక్టర్ సి. నారాయణరెడ్డి తమ దివంగత సతీమణి పేరుతో స్వయంగా నెలకొల్పిన శ్రీమతి సుశీలా నారాయణ రెడ్డి ట్రస్ట్‌కు ప్రధాన కార్యదర్శిగా ఉన్నాను. రచయిత్రుల రచనల్ని ప్రచురించేందుకు ఆర్థిక సహాయం అందించడం, అవసరమైతే ట్రస్టు స్వయంగా రచయిత్రుల రచనల్ని ఎంపిక చేసి ప్రచురించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ముఖ్యంగా రచయిత్రుల, కవయిత్రుల తొలిరచనల్ని వెలుగులోకి తేవడానికి సహాయం అందించాము. అట్లా ట్రస్టు సహాయంతో తొలిరచనలు వెలువరించిన వారు ఈనాడు ప్రముఖ రచయిత్రులుగా, కవయిత్రులుగా వెలుగొందుతున్నారు. సీనియర్ రచయితలకు రసమయి వేదిక మీదుగా ఏటా లక్షరూపాయల అవార్డు అందజేస్తున్నాం. విశ్వంభర డాక్టర్ సి. నారాయణరెడ్డి జాతీయ సాహిత్య పురస్కారం అందజేస్తున్నాం. జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు డాక్టర్ చంద్రశేఖర కంబార, డాక్టర్ ప్రతిభారాయ్‌లకు ఇప్పటివరకు పురస్కారాలు అందించాం.

ఏటా 5 లక్షల రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రత్యేక ప్రశంసా పత్రం అందజేసి ఘనంగా సత్కరిస్తున్నాం. ఆ రకంగా డాక్టర్ సి. నారాయణ రెడ్డిగారి జన్మ దినోత్సవాన్ని జరుపుతూ వారి కొత్త పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేస్తూ వస్తున్నాము. ఈ కార్యక్రమాలు ఇంత ఘనంగా నిర్వహించడం వెనుక సినారె గారి ఉమ్మడి కుటుంబం కృషి ఎన్నదగింది.

**పరిషత్తు ఇటీవల ప్రారంభించిన జిల్లాల సమగ్ర స్వరూపం గొప్ప ఫలితాలను ఇస్తోంది కదా ఈ యోజన గురించి వివరించండి?**

తెలంగాణ సారస్వత పరిషత్తు ఇటీవలి కాలంలో 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, సాహిత్యం తదితర అంశాలపై వెలువరిస్తున్న సమగ్ర స్వరూప గ్రంథాల పరంపర అపూర్వమైనదనే చెప్పాలి. ఇప్పటివరకు పది పదిహేను జిల్లాల సమగ్ర స్వరూప గ్రంథాలు పూర్తయ్యాయి. ఆయా జిల్లాల్లో ఆయా అంశాల్లో కృషి చేసిన వారి చేతే వ్యాసాలు రాయించి పుస్తకాలు ముద్రిస్తున్నాం. ఈ ప్రాజెక్టు



మొత్తం పూర్తయితే 13000 పేజీలకు పైగా తెలంగాణ చారిత్రక సాంస్కృతిక వారసత్వ సంపద గ్రంథస్తం అవుతుంది. ఈ కార్యక్రమ నిర్వహణకు తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ ఆర్థిక సౌజన్యం అందిస్తున్నది.

**తెలుగు బాలసాహిత్యం పైన ఒకరోజు సదస్సు పరిషత్తు పక్షాన జరిపారు. అనుకున్న ఫలితాలు సాధించారా? భవిష్యత్తు కార్యాచరణ ఏమిటి?**

బాలసాహిత్య వికాసంపైన ఇటీవలి కాలంలో సారస్వత పరిషత్తు దృష్టి కేంద్రీకరించింది. బాలసాహిత్య రచయితలను, బాలసాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్న సంస్థలను, పెద్దలను, అలాగే ముఖ్యంగా పాఠశాలలో చదువుకుంటూ సృజనాత్మక రచనపైన అభిరుచిని పెంపొందించుకుంటున్న బాలల్ని ఒక వేదిక మీద తీసుకొచ్చి ఇటీవల కాలంలో రాష్ట్రస్థాయి బాలసాహిత్య సమ్మేళనం నిర్వహించాం. బాలసాహిత్య స్వరూపాన్ని గురించి చర్చించడం, సాహిత్యంపై అభిరుచి ఉన్న బాలలకు రచనలు చేయడంపైన అవగాహన కల్పించడం, పాఠశాలల్లో బాలల్ని రచన వైపు ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులకు మరింత అవగాహన కలిగించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నాము. బాలసాహిత్య వికాస కార్యక్రమాలను నిరంతరంగా జరపాలన్నదే మా లక్ష్యం.

> **మహాకవి డాక్టర్ సి. నారాయణ రెడ్డితో అనుబంధం నాకు లభించిన గొప్ప వరం. ఆయన వాత్సల్యం పొందిన అదృష్టం నాది. జర్నలిస్టుగా ఉన్నప్పుడు వారితో ఏర్పడిన పరిచయం, తెలుగు విశ్వవిద్యాలయంలో వారి చేతుల మీదుగా ఉద్యోగ నియామకం, సారస్వత పరిషత్తులో సంయుక్త కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా వారి వద్ద పనిచేసే మహాభాగ్యం ఇవన్నీ చెప్పుకోదగిన అంశాలు. వారి దగ్గర నేను నేర్చుకున్న విషయాలు నన్ను ఎంతగానో మలచాయి.**

**మీ కుటుంబం, నేపథ్యం, ప్రస్థానం గురించి తెలపండి?**

నేను గ్రామస్థాయి నుంచి, పేదరికం నుంచి ఈ స్థాయికి చేరుకున్నాను. నా ఆరు నెలల వయసులోనే మా నాన్న చనిపోయాడు.

నా ఉన్నతికి కారకురాలు మా అమ్మ. ఆమె ఇప్పుడు లేదు. ఆ తర్వాత నా విజయాలలో సగభాగం పొందవలసింది నా శ్రీమతి. నా పరిస్థితులను గమనించి కష్టపడి చదువుకుని వృద్ధిలోకి వచ్చిన నా కుమార్తె, కుమారుడు. కుమార్తెకు ఇద్దరు పిల్లలు. కొడుకుకు ఒకపాప.

**పొందిన గుర్తింపులు, అందుకున్న పురస్కారాలు?**

పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ. వరప్రసాద రెడ్డి మెచ్చి ఇచ్చిన తెలుగు భాషా సేవారత్న లక్ష రూపాయల పురస్కారం, సురవరం ప్రతాపరెడ్డి వైజయంతి ట్రస్ట్ వారు అందించిన సురవరం ప్రతాపరెడ్డి పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయ అనువాద పురస్కారం, ఢిల్లీ తెలుగు అకాడమీ వారి పురస్కారం, ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ వారి పురస్కారం, అధికార భాషాసంఘం పురస్కారం, నేను జన్మించిన మహబూబ్‌నగర్ జిల్లా యంత్రాంగం ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా అందించిన పురస్కారం, పిఎస్ఆర్ ఆంజనేయశాస్త్రి ఉత్తమ న్యూస్ రీడర్ అవార్డు వంటివి నాకు లభించిన పురస్కారాల్లో కొన్ని.

ఇంటర్వ్యూ...
**గరిపెల్లి అశోక్**

# ఒంటరీకరణ...

కొత్త గాయాల కలయికతో పుట్టిన అనుభవం....



డా॥ రూప్ కుమార్ డబ్బీకార్
99088 40186

'తెలియని నిర్బంధంలోంచి తెలిసిన స్వేచ్ఛా ప్రపంచంలోకి ప్రయాణం' - అతని ఒంటరీకరణ .

'ప్రశ్నార్థకం నుంచి ఆశ్చర్యార్థకంలోకి' కవి మానసిక ప్రయాణం.

'ఖాళీలను ఖాళీలతోనే నింపాక తెల్చింది - Life is an empty vessel, All the noise is just bubble - శూన్యంలో అభద్రతాభావంతో అస్తిత్వాన్ని తడుముకునే ఒక లోకసంచారి తాత్వికత.

"మా శరీరానికవతల ఓ ప్రపంచం ఉందని తెలీని అజ్ఞానులమే.." భౌతిక ప్రపంచం నుండి అధిభౌతిక ప్రపంచంపై అవలోకన. అనేక పొరలను కప్పుకున్న కవి మనసు లోతుల్లోకి వెళ్లాలంటే పై వాక్యాలను పసిగట్టాలి. ఆ కవి గుంపులో వుండి ఒంటరితనాన్ని ఆశ్రయించే మామిడి హరికృష్ణ.

**'నైమిషం' కవి అనేక సందిగ్ధతల మధ్య జీవితం పట్ల ఒక అస్పష్టతలో ఒంటరీకరణ చెంది అస్తిత్వ సంక్షోభంలోంచి బయటపడే ప్రయత్నం. ఈ పంక్తుల్లో ప్రకృతిపై పాద ముద్రలతో మనిషి తన ఉనికిని శాశ్వత పరుచుకోవాలనుకునే ప్రయాస కనబడుతుంది. కానీ అలల రూపంలో ప్రకృతి దానిని తుడిచి పెట్టేస్తుంది.**

'Fusion షాయరీ' అంటూ రెండు కొత్త గాయాల కలయికతో పుట్టిన అనుభవాన్ని ఒడిసి పట్టుకుని ఒంటరితనంలోకి జారిపోవడం మామిడి హరికృష్ణకి సరదా.

*నింపాల్సిన శూన్యాలు*
*పూడ్చాల్సిన గుంతలు*
*రాయాల్సిన అక్షరాలు*
*చెక్కాల్సిన నిమిషాలు*
*దిద్దాల్సిన జ్ఞాపకాలు*
*ఎన్నో ఉంటాయ్!*
*'gapలను fill చేయాలి*
*అసంపూర్ణతలను భర్తీ చేయాలి*
*పరుగునాపి.. నడకను నిలువరించి*
*ఒక్కసారి తిరిగి చూస్తే*
*ఇంకా ఎన్నెన్నో ఖాళీలు*
*మరెన్నోఅసంపూర్ణ గదులు..*
*చిత్రంగా-ఖాళీలను ఖాళీలతోనే*
*నింపాక తెల్చింది.*
*Life is an empty vessel/All the noise is just bubble..!'*

చివరికి అంతా శూన్యమే అంటాడు కవి 'ప్రహేళిక' అనే కవితలో. మార్మిక అనుభవాలనుండి వాస్తవాలను తెలుసుకోవాలనుకునే ప్రయత్నంలో కవి ముందుగా బాహ్య ప్రపంచంలోని విషయాగత సంఘటనల ద్వారా అనుభవంలోకి వచ్చిన ఎరుకను తెలియపరుస్తాడు. విషయం, విషయాగత మౌలికాంశాలనుండి సంవేదన చెందిన కవి బహిర్ముఖీనత్వం నుండి, బాహ్యప్రపంచం నుండి విడివడి అంతర్ముఖీనుడవుతాడు. 'ప్రహేళిక' కవిత ఒక వాస్తవిక తత్వచింతనతో సాగుతుంది.

*'ఇక్కడంతా ఎడారి*
*నిన్ను వెదుక్కుంటూ*
*ఒయాసిస్సు కోసం వస్తాను*
*ప్రేమగానే నువ్విస్తావు*
*గుప్పిళ్ళ కొద్దీ ఇసుకని*
*వాకిట్లోనే నిలిపేసి'*

"గుప్పెట్లో ఎడారి" పట్టుకొని ఒయాసిస్సుకై తండ్లాడితే దొరికిన పొడిబారినతనంలో ఒయాసిస్సును వెతికే అమాయకపు తెలీనితనం వ్యక్తీకరించడమంటే కవి లోపలి చేతనాప్రకృతితో మమేకమై వైయక్తిక సంవేదనలను ఇముడ్చుకోవడమే.

ఇతరుల అనుభవాన్ని కవి తన అనుభవంలోకి తీసుకొని ఉద్వేగం చెందడాన్ని 'సోమాలియా... సోమాలియా...' కవితలో చూడవచ్చు. ఈ కవితలో అక్కడి సమాజపు జీవన రేఖల్ని, జీవితాలను, ప్రపంచ రాజకీయ ప్రభావాలను చిత్రీకరిస్తాడు.

*'మేం అనాగరికులమే*
*మా శరీరానికవతల ఓ ప్రపంచం*

ఉందని తెలీని అజ్ఞానులమే
ఓ పశ్చిమ పవనాల, పల్లవుల పచ్చ
మనుషులారా
మేం ఆదిమ జీవులమే నల్లరంగును
దేహాన్నిండా ధరించిన అనాధునికులమే!'

అని వర్ణవివక్ష, జాతివివక్షను చూపే తెల్లవారి ఆధిపత్య ధోరణికి నిరసన తెలుపుతాడు.

'పాలక అంధులారా, అధికార
బధిరులారా
మాకెక్కడొచ్చిన పీడా అనుకుంటే
విస్మృత దేశం నుండి
తిరస్కృతి కవి ఒకడు
నలుదిక్కులా ఆక్రోశపు విత్తనాలను
జల్లుతున్నాడు'....

'ఓ నా చీకటి సోమాలియా
ఓ నా ఆకటి సోమాలియా
ఓ నా కన్నీటి సోమాలియా
ఓ నా రుధిర సోమాలియా..'

అంటూ కవి తన ఆవేదనను వ్యక్తీకరిస్తాడు. సోమాలియా మీద ప్రపంచ దేశాల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తాడు.

'అలల పైకి నడిచి వెళ్లిన పాదముద్రలు
ఒక్కటీ ఘనీభవించవు
తీరంలో పిట్టగూడు ఎంతకీ తుది
మెరుగులు దిద్దుకోదు... ఏ ప్రకంపనల
వంచనకో
చెల్లాచెదురైన ఇసుక రేణువులు
మాత్రం
సన్నగా గొణుక్కుంటాయి 'నేను
ప్రేమించాను'

అని 'నైమిషం' కవి అనేక సందిగ్ధతల మధ్య జీవితం పట్ల ఒక అస్పష్టతలో ఒంటరీకరణ చెంది అస్తిత్వ సంక్షోభం లోంచి బయటపడే ప్రయత్నం ఈ పంక్తుల్లో ప్రకృతిపై పాదముద్రలతో మనిషి తన ఉనికిని శాశ్వత పరుచుకోవాలనుకునే ప్రయాస కనబడుతుంది. కానీ అలల రూపంలో ప్రకృతి దానిని తుడిచి పెట్టేస్తుంది. అలల చర్యకు పాదముద్రల ఉనికి నిలవలేదు. ప్రకృతి ముందు మనిషి అస్తిత్వం ఎంత బలహీనమైందో కవి గుర్తు చేస్తాడు. అసంతృప్తమైన అక్షరాలతో ఏర్పడిన పదం, అలజడికి గురయ్యే స్వభావంతో వాక్యంగా ఏర్పడి, ఒక




అభద్రతా భావంలోకి జారిపడి ఏకాంతవాసంలోకి వెళ్ళిపోతుంది. కవికి సముద్రం ఒడ్డున నిలబడి దాహం తీర్చుకోవాలనే తపనలో ఏదో తెలీనితనం. అమాయకత్వం. ఒక అపరిచితకవి ఆవేదన - వాస్తవిక విలువల ప్రపంచంలోకి ప్రయాణం. ప్రశ్నను అనుసరిస్తూ వస్తున్న వ్యక్తీకరణలు భిన్న విషయాగత వ్యక్తీకరణ లేమో?! స్పర్శ, శబ్ద, రూప, రస వాసనలు లేని ఇంద్రియాలు బాహ్యప్రపంచంతో అనుబంధం కలిగి విషయాలను మనసుకు అందిస్తుంటాయ్. అలా ఖాళీలను ఖాళీలతో నింపాకే అంది వచ్చిన శూన్యంలో అస్తిత్వాన్ని తడుముకునే ప్రయత్నంగా అనేక తెలియని తనాలలోంచి బాహ్యప్రపంచంలో తండ్లాడుతూ, ఒంటరితనంలోనే స్వేచ్ఛా ప్రపంచాన్ని వెతుక్కునే తెలీనితనంలో కవి మామిడి హరికృష్ణ వైయక్తికమైన ఎరుకలోంచి చేతనాస్పృహతో ఒక మార్మిక అనుభవాన్ని సమాజానికి అందిస్తున్నాడు.

కొత్త పదబంధాలతో, కొత్త శైలి, నడకను కవిత్వంలో ప్రవేశపెట్టి పాఠకుడికి ఒక కొత్త అనుభూతి అందించాలనే ప్రయత్నం ఈ కవిత్వంలో కనబడు తుంది. ఒక వైపు అడ్మినిస్ట్రేషన్, మరో వైపు సృజన. సృజనలో అనేక పార్శ్వాలు- కవిత్వం, అనువాదాలు, చిత్రకళ, సినిమా రంగం, డాక్యుమెంటరీస్, నాటకాలు, జానపదకళలు మరెన్నో భిన్న వర్ణ ఛాయలు. ఇంద్రధనుస్సులోని ఏడు రంగులు కలిసి తెలుపురంగులో ఇమిడిపోవడం, ఒకటిగా కనబడడం. తెలుపు వర్ణం ఒక శూన్య సూచిక. ఏ రంగైనా అద్దుకోవచ్చు. అన్నిరంగులు వున్నా తెలుపు ఒంటరిగానే ప్రవహిస్తుంది. ప్రకాశిస్తుంది. గుంపులో వుండి ఒంటరీకరణం చెందడంలోని సూత్రం ఒంటబట్టించుకున్న కవి 'ఒంటరీకరణ' కవితాసంపుటితో అమాయకంగా ఏమీ తెలీనితనాన్ని వెంటబెట్టుకొని ఏకంగా జీవన తాత్వికతను పాఠకులకు అందించడానికి వచ్చాడు. అతను మామిడి హరికృష్ణ. శీర్షిక 'ఒంటరీకరణ' అవగాహన లోకి రావాలంటే కవిజీవిత నేపథ్యం తెలిస్తే స్పష్టమవుతుంది. అర్థమయ్యాక ఆ కవితల్లోని పంక్తులు పాఠకుడికి దగ్గరవుతాయి. అలా దగ్గరైన కవిత్వంతో పాటు కవి కూడా పాఠకులకు దగ్గరవ్వాలని కవిత్వం ద్వారా మరిన్ని తాత్విక దారులు వెయ్యాలని ఆశిస్తూ...

వ్యాసం

# వ్యక్తిత్వంలో బాలుడు.. సాహిత్యంలో త్రివిక్రముడు

**అర్థవంతమైన తెలుగు వాక్యం...**



ఘనపురం దేవేందర్
99480 32705

బాలశ్రీనివాసమూర్తి... తెలుగు సాహిత్యంలో తెలంగాణ పరిమళం. నికార్సైన సాహిత్య విమర్శకు నిలువెత్తు నిదర్శనం. అర్థవంతమైన తెలుగు వాక్యానికి నిధి. అనంతమైన ప్రేమకు, ఆత్మీయతకు నిలయం. ప్రతిభను గుర్తించడం, అభినందించడం, అక్కున చేర్చుకోవడం, ఆశ్రయం కల్పించడం ఆయనకున్న ఆభరణాలు. ఇన్ని మంచి ఆభరణాలు ఉన్న ఆ మహాసాహితీ మూర్తిని కాలం సహజంగానే అక్కసుతో తన గర్భంలోకి తీసుకుంది. మహావృక్షం లాగా స్థిరపడాల్సినటువంటి బాల శ్రీనివాసమూర్తి ఎన్నో మహావృక్షాలకు ఆరాధనీయునిగా మిగిలిపోయాడు. ఆయన మాత్రమే చేయగల సాహిత్యసేవ ఇంకా ఎంతో మిగిలిపోయింది. ఇది పూడ్చలేని విషాదం. అందరూ తల్లిదండ్రుల నుంచి ఆస్తులను వారసత్వంగా తీసుకుంటే బాలశ్రీనివాసమూర్తి సాహిత్య సౌగంధాన్ని వారసత్వంగా తీసుకున్నాడు. లోకానికి పంచిపెట్టాడు. గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ ముద్దులబిడ్డ గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి అక్షరం ఉన్నంతవరకు పుస్తకాలలోనే కాదు మన మస్తిష్కాలలోనూ చిరంజీవులుగా ఉంటారు.

> **ఒక్కమాటలో**
> **చెప్పాలంటే బాలశ్రీనివాసమూర్తి "ఈ కాలం మహావక్త". కార్యక్రమం పూర్తయిన తర్వాత వెళ్ళిపోతూ "ఘనపురం దేవేందర్! నీలాంటి సహృదయులు ఇంకా ఉన్నారయ్యా. నువ్వు నా తమ్ముడివి. నిన్ను "తమ్ముడా అని పిలుస్తా" అని భుజం తట్టిన క్షణం నాకు గొప్ప పురస్కారాన్ని అందుకున్నట్టు అనిపించింది.**

తెలంగాణ విశ్వవిద్యాలయంలో బాలన్నకు ఉద్యోగం రావడం నిజామాబాద్ సాహిత్యానికి కూడా ఎంతగానో మేలు చేసింది. బాలశ్రీనివాసమూర్తితో మొదటి పరిచయం ఫోన్ ద్వారానే. అవి ఆయన నిజామాబాద్ జిల్లాలో అప్పుడప్పుడే మొదలైన తెలంగాణ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రోజులు. నిజామాబాద్ జిల్లా డైట్ కళాశాలలో ఉపాధ్యాయులకు వృత్త్యంతర శిక్షణ జరుగుతున్నది. అప్పటికే గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి తండ్రి గారు గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ గురించి, వారి అవధానం గొప్పతనం గురించి పరిచయం ఉండడంతో బాల శ్రీనివాసమూర్తి తన సందేశంతో ఉపాధ్యాయులను మరింత చైతన్యం, తెలుగు భాషపై ఆసక్తిని కలిగించగలడని నమ్మకంతో ఉన్నతాధికారులకు చెప్పి వారిని డైట్ కళాశాలకు పిలిపించడం జరిగింది. డైట్ కాలేజీలోనే ముఖాముఖి పరిచయం. ఆ కార్యక్రమంలో వారి ఉపన్యాసం విన్న తర్వాత కొన్ని అంశాలలో చాలా స్పష్టతను నేర్చుకున్నాను. ఒకటి ఇచ్చిన సమయాన్ని కచ్చితంగా సద్వినియోగం చేసుకోవడం. విషయం పరిధిని దాటకుండా ఆసక్తికరంగా మాట్లాడడం. సందర్భోచితమైన ఉపమానాలు స్పష్టంగా వాడడం. శ్రోతలకు సులభంగా అర్థమయ్యే భాషను ఉపయోగించడం. హావభావాలతో ఉత్సాహంతో, చిరునవ్వుతో ఆసాంతం మాట్లాడడం అందరికీ ప్రాక్టికల్‌గా నేర్పిన సందర్భం అది. ఒక్క మాటలో చెప్పాలంటే బాల శ్రీనివాసమూర్తి "ఈ కాలం మహావక్త". కార్యక్రమం పూర్తయిన తర్వాత వెళ్ళిపోతూ "ఘనపురం దేవేందర్! నీలాంటి సహృదయులు ఇంకా ఉన్నారయ్యా. నువ్వు నా తమ్ముడివి. నిన్ను "తమ్ముడా అని పిలుస్తా" అని భుజం తట్టిన క్షణం నాకు గొప్ప పురస్కారాన్ని అందుకున్నట్టు అనిపించింది. అప్పటినుండి ఆయన నాకు బాలన్న. నేను ఆయనకు తమ్ముడిని.

తర్వాత కాలంలో ఆయన తెలంగాణ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరడం, అక్కడ నా శ్రీమతి ఎమ్మె తెలుగు చదవడం మా మధ్య

వ్యాసం



**2019 సెప్టెంబర్ 1న మిత్రుడు కాసర్ల నరేశ రావ్ రాసిన వానచుక్క శతకం ఆవిష్కరణ సభలో బాలన్న డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డితో కలిసి పాల్గొన్నారు, తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో 2021 ఫిబ్రవరి 2న నిజామాబాద్ కవి మిత్రుడు నరాల సుధాకర్ రచించిన "నేను 2" పుస్తక పరిచయ సభకు ముఖ్య అతిథిగా బాలన్న వచ్చారు. అద్భుతమైన ప్రసంగంతో అందరినీ కట్టిపడేసారు.**

మరింత అనుబంధాన్ని పెంచింది. హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సభలలో బాలన్న పాల్గొన్నారు. ప్రతిసభలోను ఆయన ఉపన్యాసం హైలైట్. ఆయనను సభకు పిలిచినందుకు నాకు అందిన అభినందనలు ఎన్నో. తెలంగాణ జాగృతి నుంచి సాహిత్య సభలు నిర్వహించాలని సంకల్పించినప్పుడు వారందించిన సహకారం మరువలేనిది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి, తెలంగాణ సాహిత్య అకాడమీ మొదలైన ప్రతిష్ఠాత్మక సంస్థలలో ఆయన చేసిన ఉపన్యాసాలు మన సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి.

బాలన్న పరిశోధనాత్మక రచనలు అన్ని గట్టివిత్తనం నుండి ఉద్భవించిన మహా వృక్షాలే. విలక్షణ పీవీ, ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణ, అభినవ పోతన వానమామలై వరదాచార్యులు, దేవులపల్లి రామానుజారావు, తెలంగాణం - తెలుగు మాగాణం, వెలుతురు కొలను, జీవన హిందోళం, మా ప్రసిద్ధిపేట, బ్రహ్మశ్రీ అవధానులు గుమ్మన్నగారి లక్ష్మీ నరసింహశర్మ స్మృతీపరిమళం, విజేత కాంపిటీషన్స్ సాహితీ సుధ, తెలంగాణ వైతాళికులలో కూడిన ప్రతిభామూర్తులు, సాహితీ మూర్తులు మొదలైన గ్రంథాలను రాశారు. జూనియర్ లెక్చరర్స్, డిగ్రీ లెక్చరర్స్, పీజీ, ఎం. ఫిల్., పి.హెచ్‌డి., గ్రూప్స్ ప్రిపేర్ పుస్తకాలు, వివిధ ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షల కేంద్రాలకు రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. పాఠ్యపుస్తకాల రూపకల్పనలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఆ సందర్భంలోనూ బాలన్నతో కలిసి పనిచేసే అవకాశం కలిగింది. పరిశోధన రంగంలో ఆయన చేసిన అపూర్వమైన కృషి "ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణ". ఆ గ్రంథానికి తెలుగు యూనివర్సిటీ ఉత్తమ వచన రచనలో సాహితీ పురస్కారం లభించింది. సర్వ వైదిక సంస్థాన్ వారి పండిత పురస్కారం, "జీవన హిందోళం" పుస్తకానికి ప్రతిష్ఠాత్మకమైన గండ్ర హన్మంతరావు పురస్కారం ప్రకటించబడింది. బహుశా ఏ కవికి, రచయితకు సాధ్యం కాని విధంగా "జీవన హిందోళం" పుస్తకం రాయడం ద్వారా బాలన్న తన తండ్రి ఋణాన్ని తీర్చుకున్నాడు.

తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో హరిదా రచయితల సంఘం 2018 నవంబర్ 11వ తేదీన నిజామాబాద్‌లో నిర్వహించిన "కొరవి గోపరాజు సాహిత్య వైభవ సమాలోచన - రాష్ట్రస్థాయి సదస్సులో" వక్తగా పాల్గొని "కథా కావ్యాలు-చమత్కారాలు" అనే అంశంపై అద్భుతంగా ప్రసంగించారు. 2019 సెప్టెంబర్ 1న మిత్రుడు కాసర్ల నరేష్‌రావు రాసిన వానచుక్క శతకం ఆవిష్కరణ సభలో బాలన్న డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డితో కలిసి పాల్గొన్నారు, తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో 2021 ఫిబ్రవరి 2న నిజామాబాద్ కవి మిత్రుడు నరాల సుధాకర్ రచించిన "నేను 2" పుస్తక పరిచయ సభకు ముఖ్య అతిథిగా బాలన్న వచ్చారు. అద్భుతమైన ప్రసంగంతో అందరినీ కట్టిపడేసారు. ఆ సభలో పాల్గొన్న ప్రముఖ సినీగేయ రచయిత వరికుప్పల యాదగిరి ఎంతో ఆసక్తిగా బాలన్న ఉపన్యాసం విన్నంక పరవశించిపోయి "ఇంత గొప్ప మహావక్త సరసన నన్ను కూర్చోబెట్టినందుకు ధన్యవాదాలు" అన్న మాటలు ఎప్పటికీ స్మృతినుంచి పోనే పోవు కదా. ఆ సందర్భంగా బాలన్నను ఘనంగా సత్కరించుకున్నాం. ఆ సత్కారానికి పులకించిపోయిన బాలన్న ఆనంద బాష్పాలతో ఆశీర్వదించిన సందర్భం ఇంకా కళ్ళల్లో మెదుల్తనే ఉంది. "విలక్షణ పీవీ" వంటి వైవిధ్యమైన ఉద్గ్రంథాన్ని రాసిన బాలన్న నేను పీవీ నరసింహారావు గురించి కవితలో "నిన్ను చూస్తే ధోతి కట్టుకున్న దేవుడిలా కనబడుతావ్" అన్న వాక్యాన్ని పలుమార్లు గుర్తుచేసి ఎంతగా మెచ్చుకున్నాడో. నేను రాసిన వచన కవితా సంపుటి "ముచ్చట"కు బాలన్న రాసిన ముచ్చటైన ముందుమాట నాకు మరొక పురస్కారమే. తెలుగు సాహిత్యంలో బాలన్న వదిలిపెట్టిన పనులు పూర్తిచేయడానికి మళ్లీ బాలన్న పుట్టాల్సిందే. కలం పట్టాల్సిందే. స్వరం మోగించాల్సిందే. బాలన్న పేరులో బాలునిలెక్క ఎంతో పవిత్రుడు. సాహిత్యంలో అన్నీ ప్రక్రియల లోకాలను అనుశీలించిన త్రివిక్రముడు.

పుస్తక పరిచయం

# స్మృతి మధురాలు "మాతృగీతాలు"

మాతృమూర్తి మీద చూపించిన భక్తిని స్పర్శించిన వ్యాసం...




రాజేశ్వరీ దివాకర్ల
93437 16723


"నే నలుగు చుందు నన్నమ్మ నీవు కలిపి
తెచ్చి నా నోటిలో కూరి తినక యున్న
నెత్తిపై మొట్టి తినిపింతు నిలువ కుబుకు
చీర చెరగున నాదు కన్నీరు తుడిచి"

అమ్మతో కలిగిన ఆత్మ సాహచర్యానికీ, హృదయ పూర్ణమైన అనురాగ వాత్సల్యాలకూ, కంఠదఘ్నమైన అనుభూతికీ అద్దం పడుతుంది ఈ గీతం. అమ్మ, ప్రేమను నూరి అన్నం ముద్దలను కలిపి కొడుకు నోట్లో కూరింది. తినక మారాములు చేసాడు తనయుడు. అమ్మకు అతడు గారాబాల బిడ్డ. ఒకవంక ముద్దు చేస్తూనే మొక్కై ఒంగనిది మానయ్యాక చేతి కందదని తెలిసిన

**ఆమె ఎడగల అవ్యాజాను రాగం, తీవ్ర వేదన కలగలసి ఒక్కక్షణం కసిగా మారింది. కఠినమైన కాలచక్రానికి కట్టేసి ఆమె శాశ్వతమైన సుగతికి ఎగిరి పోయిందని అక్కసు కలిగింది. అంతలోనే ముగ్ధ బాలకునివలె అమ్మ అచట ఎచటనున్నదో అచటకు పోయి ఆమెను చేరి అమృతాభిషిక్త పథములలో ఏ చీకు చింత లేక తల్లీ బిడ్డల ఆటలు ఆడు కోవాలని ఆశించారు.**



అనుభవజ్ఞురాలు అమ్మ. అందుకనే గారాబాల కొడుకు మారాము చేస్తుంటే మొట్టికాయ వేసి బుద్ధిగరిపింది. అమ్మ సాంగత్య మధురిమను తనివితీరా ఆప్యాయన మొనరించే కొడుకుకు తన బాల్యచేష్టలతో అమ్మకు చేరువ అయే మార్గం తెలుసు. చిలిపి నటనలతో కన్నీరు కారుస్తాడు. అమ్మ మనసు కరిగి పోయింది. బిడ్డను దగ్గరకు తీసుకుని చీర చెరగుతో ఉబుకుతున్న అతని కన్నీరు తుడిచి గోరుముద్దలను తినిపించింది.

సరళ సుందరమైన "మాతృ గీతాలను" రచించారు శ్రీ నాయని సుబ్బారావుగారు. మాతృగీతాలు కవిగారి మాతృస్మృతి పూర్వకమైన కావ్యం. తెలుగు సాహిత్యంలో స్మృతిగీతాలను గురించి, విషాద సంకీర్ణతను గురించి చెప్పుకునే ముందు మాతృగీతాలను గురించి చెప్పుకోక తప్పదు.

మాతృదినోత్సవం అనగానే మాతృ గీతాలు స్మరించక తప్పదు. అమ్మలేని లోటు తీర్చలేనిది. ఆమె లేని జీవన మార్గం కంటక నిగూఢ విపిన మార్గమై తోచింది కవికి. కుమారుడు చేసిన ఆగడాలకు అలసట చెందిన తల్లి డొక్కలో తలదాచుకుని, ఆవిడే శ్రీ రామ రక్షగా ఆత్మతృప్తిని పొందిన తనయుని తనువు నిండా ఆమె స్మృతి చెక్కిన శిలా శాసనంగా అయింది. తన అంతరంగాన్ని దేవాలయము కావించి, ఆమె విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్నాడు. ఆ మూర్తి పూజకు పారిజాతాన్ని నాటుకున్నాడు. పారిజాతం దేవజాతికి ఉపభోగ్యమైన పుష్పం. తన తల్లికి కుసుమాంజలులను సమర్పించ డానికి పారిజాతాన్ని పెంచి పోషించిన తనయుడు ఆమె నెడబాసి ఎలా ఉండ గలడు?

అతడు హతాశయుడయ్యాడు, అందుకు కారణం తాను మాతృ పూజకోసం పెంచిన పారిజాతం తొలి పూత పట్టకుండానే తల్లి పాదములను

కరములతో తాకలేని వాడయ్యాడు. మాతృమరణంతో కవిగారు అనంత దుఃఖ సముద్రాల కెరటాలలో కొట్టుకుని పోయారు. ప్రపంచమంతా నిరాశ్రయ స్థానంగా తాను ఎవరూ తోడు లేని వానిగా అయినట్లు తల్లడిల్లిపోయారు. మరు భూమిలో ఉన్నట్లు బెంగటిల్లారు.

నాయని సుబ్బారావుగారు రచించిన మాతృగీతాలను వారి కుమార్తె నాయని కృష్ణకుమారిగారు 1982లో ముద్రించారు. పితృదేవుని మనసులో కెరలిన మాతృవియోగ దుఃఖాశ్రువులకు వారి పుత్రిక అనురాగపూర్వకమైన అమర శ్రుతిని కలిగించారు. కవిగారికి కలిగిన అపారమైన జననీ వియోగ దుఃఖానికి స్మృతి వలయాలలో ముద్రపడిన మరొక కారణం కూడా ఉందని చెప్పారు - అదేమిటంటే...

కవిగారికి తన అన్న కుమార్తెతో వివాహం జరిపించాలన్నది వారి తల్లిగారి కోరిక. కాని కవిగారికి గల దేశాభిమానాకాంక్ష, ఆంగ్ల విద్యాభ్యాస నిరాకరణ, చదువు మానుకుని రికామీగా ఉండడం, మేనమామకు నచ్చలేదు, పిల్లను ఇవ్వడానికి నిరాకరించారు. తన కొడుక్కి అన్నగారు కూతురును ఇవ్వలేదన్న కోపంతో అభిమానంతో కూడిన దిగులుతో ఆవిడ మరణించింది. సోదరి స్వర్గస్థురాలయ్యాక అన్నగారికి మేనల్లునిలో మంచి లక్షణాలు కనిపించాయి. పిల్లను ఇవ్వడానికి ముందుకు వచ్చాడు.

తల్లిగారి ఆశయం ఈ నాటికి ఈడేరబోతోంది. అన్నగారు పిల్లను ఇవ్వడానికి ఒప్పుకున్నారన్న వార్తను వినిపించి మురిసిపోడానికి అమ్మ లేదు. ఇది కవిగారికి తీరనిలోటుగా మిగిలింది. తల్లితో పంచుకోలేని మధుర వార్త మరింత గాఢవిషాదస్మృతులను పెనవేసింది. మాతృ గీతాలను హృదయ సంఘర్షణకూ, అనుభూతి విచారానికీ, తీగెలు మీటిన స్మృతులకు, రాగాలను ఆలపించింది. అమ్మతో పంచుకోలేని వార్త మాతృగీతాలకు మాతృక అయింది. ఆ నిరాశ పూసలో దారంగా ప్రతిగీతంలో



**మాతృగీతాలు ప్రతి పదంలో అమ్మకు దూరమైన పుత్రుని నిరాశ ప్రతిధ్వనిస్తుంది. అపురూపమైన మాతృబంధం అనురాగ ప్రకంపనలను కలిగిస్తుంది. జీవితకాలంలో అమ్మకు ఎటువంటి ఆశాభంగము కలుగనీయరాదను పరివర్తనను కలిగిస్తుంది. జననిని దేవతగా ఆరాధించ వలెనను విమలాతి శయమును పాదుగొల్పుతుంది.**

అల్లుకునిపోయింది.

జననీవియోగం కవిగారిని వెంగలిని కావించింది. తల్లి పోయిన పది రోజుల పాటు కంటి మీద కూరుకుని వచ్చే నిద్రను ఆపుకుంటూ, ఆమె తిరిగి వస్తుందన్న ఆశతో మంచి నీళ్ళచెంబు, దీపాన్ని పెట్టి కాచుకుని కూర్చున్నారు.

ఆమె ఎడగల అవ్యాజానురాగం, తీవ్ర వేదన కలగలసి ఒక్కక్షణం కసిగా మారింది. కఠినమైన కాలచక్రానికి కట్టేసి ఆమె శాశ్వతమైన సుగతికి ఎగిరి పోయిందని అక్కసు కలిగింది. అంతలోనే ముగ్ధ బాలకునివలె అమ్మ అచట ఎచటనున్నదో అచటకు పోయి ఆమెను చేరి అమృతాభిషిక్త పథములలో ఏ చీకు చింత లేక తల్లీబిడ్డల ఆటలు ఆడ కోవాలని ఆశించారు. బాల్యంలో మొరాయించారు. కాని ఇప్పుడు ఆమె పూజకు అడ్డమురానని బుద్ధిమంతుడనై నట్లుగా ఒప్పందం చేసారు.

స్నానానికి వెళ్ళినప్పుడు అమ్మ ఏదిరా అని అలలు అతనిని ప్రశ్నించాయి. అచటి జలములో ఉన్న తాబేలు నీటి గర్భంలో చేరి నీటి అలల సుళ్ళు విసిరింది.

అచ్చటి నీటిపాము పైకెగసి కప్పను పట్టుకొనుచు, నీకు లేదమ్మ అని వెక్కిరించింది. అప్పుడు కవి తనకు అమ్మలేదు కదా అని శోకతప్త హృదయుడయ్యాడు.

గడచిన శివరాత్రి కాళహస్తీశ్వరుని కటాక్షముల మధువు పంచింది. ఈ శివరాత్రినాడు నిజ కైలాసవాసాన అమృత ముగ్ధము అతులిత ఆనందరాశి యైనది.

మరల ఉగాది వచ్చింది. ఆనాడు జడలుగట్టిన జుట్టు చిక్కుతీసి తలంటిన అమ్మ పాణియుగమును తలచుకుని హృదయం కలగిపోయింది. బ్రాహ్మణుడు తెచ్చి ఇచ్చిన ఉగాది పచ్చడి లో నిజమైన చేదుతిన్నట్టు అనిపించింది.

కవికి కలిగిన శోకం కాలకూటవిష సమానం. అతడిప్పుడు కాలకూటగళుడయ్యాడు.

మాతృగీతాలు ప్రతిపదంలో అమ్మకు దూరమైన పుత్రుని నిరాశ ప్రతిధ్వనిస్తుంది. అపురూపమైన మాతృబంధం అనురాగ ప్రకంపనలను కలిగిస్తుంది. జీవితకాలంలో అమ్మకు ఎటువంటి ఆశాభంగము కలుగనీయ రాదను పరివర్తనను కలిగిస్తుంది. జననిని దేవతగా ఆరాధించవలెనను విమలాతి శయమును పాదుగొల్పుతుంది. హృదయస్పర్శి విషాదభావనలో ఆపాదమస్తకమైన మాతృ వాత్సల్య మూర్తిత్వాన్ని దర్శనీయం కావిస్తుంది.

మాతృగీతాలు అమ్మకు అంకితమైన చిన్న పుస్తకం.

"రెండు పొలిమేరలొక్కటైన రేఖ మీద
నేను నీ ఒడి యందున మేను మరచి
నిదురపోదును జోల పాడుదువు నీవు
చిచ్చి కొట్టుచు చీకటుల్ విచ్చుదనక"

అని తల్లి ఒడిని నిరంతరంగా ఆశ్రయించిన అనంత వేదాంత గ్రంథం.

కవిత

# కృష్ణుడొచ్చాడు!



డా॥ వై. రామకృష్ణారావు, 89857 43964

రార వేణుగోపాబాలా...
సందెకసవు చిమ్మి వాకిట్లో ముగ్గులేస్తూ
రోజూ అమ్మనోట అదే పాట
కృష్ణుడొస్తాడా?
ఆశగా, ఆసక్తిగా బాలుడి ముగ్ధప్రశ్న
"తప్పకుండా వస్తాడు
చెప్పకుండా వస్తాడు"
గడపపై చిరుముగ్గు వేస్తూ
చిరునవ్వుతో ఆ ఇల్లాలు.

మర్నాడు వెన్న తీసిన గిన్నె కోసం
వంటిల్లంతా వెదుకుతూ అమ్మ
తన తెలివికి ప్రశంసను ఆశిస్తూ...
"కృష్ణుడొస్తే వెన్నంతా తినేస్తాడని
బట్టల బీరువాలో దాచేశాను"

ఓ క్షణం విస్తుపోయి
మరుక్షణం అక్కున చేర్చుకుంది ఆ తల్లి
రోజులు దొర్లిపోయినయ్
నెలలు తరలిపోయినయ్
రార వేణుగోపాబాలా....
బిలహరి రాగం ఆ బాలహరి కోసం
పల్లవిస్తూనే వుంది.

అలసిపోని ఎదురుచూపులు
జాడచూపని మునిమాపులు
ఆ రోజు పుస్తకాలు సర్దుతూ
అలవాటుగా అమ్మనోట అదే పాట
అమ్మ వెంటే ఆ బాలనిరీక్షకుడు
భాగవత గ్రంథంలో నుంచి
పుటసంఖ్యకు గుర్తుగా పెట్టుకొన్న
నెమలీక జారిపడింది!

"అమ్మా.... కృష్ణుడొచ్చాడు"
ఆశ్చర్యతరంగమై
ఇల్లంతా మారుమ్రోగిన
సమ్ముగ్ధ నినాదం!

# విలక్షణ దర్శకుడు మణిరత్నం....

మణిరత్నం దర్శకత్వం వహించిన సినిమాల పైన వర్క్ షాప్ 2 మే, 2023న నిర్వహింపబడింది. ఈ వర్క్‌షాప్‌కి ప్రధానవక్తగా హాజరైన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారగ్రహీత శ్రీమతి ఓల్గా మణిరత్నం సినీ దర్శకత్వంలోని ప్రత్యేకతలు వివరించారు. ఆయన సినిమాలలో తీసుకున్న థీమ్స్ తర్వాత ఎలాంటి సామాజిక పరిణామాలు చెందాయో ఆమె వివరించారు. కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీత పింగళి చైతన్య తన ప్రసంగంలో మణిరత్నం సినిమాలలో సాంకేతికత, వస్తువు, సినీగతమైన కల్పనలు, మనల్ని ఆకర్షిస్తాయని అన్నారు. ఈ సభకు నిర్వాహకులుగా వ్యవహరించిన తెలుగు విశ్వవిద్యాలయం విద్యార్థి అరవింద్ ఈ విశ్వవిద్యాలయంలో ఇంకా సాహిత్య కళాచైతన్యాలు వికసించాలని ఆకాంక్షించారు. కుమ్మట కళ్యాణి, నీలాంబరి, అరుణ్ జ్యోతి, ప్రవీణ్, జితేందర్, జగన్, నేహా, జగన్, రవికుమార్ తదితర విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొన్నారు.



# ఉత్తమ అధ్యాపక పురస్కారం



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి, తేదీ 25-4-2023న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాదులో ఉత్తమ అధ్యాపక పురస్కార ప్రదాన సభ జరిగింది. తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపాధ్యక్షులు అనుమాండ్ల భూమయ్య తన గురువు పాటిబండ మాధవశర్మ స్మరణలో ప్రతి ఏటా ఇచ్చే ఈ పురస్కారం ఈసారి జీయర్ ఇంటిగ్రేటెడ్ వేదిక్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ సముద్రాల వేంకటరంగ రామానుజాచార్యులకు ప్రధానం చేయడం జరిగింది. తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ తంగెడ కిషన్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ సభకు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ అధ్యక్షత వహించారు. సభలో విశిష్ట అతిథిగా శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిలం రామానుజ జీయర్ స్వామి పాల్గొన్నారు. గురువును జ్ఞాపకం చేసుకుంటూ ఇచ్చే ఈ పురస్కారం చాలా ప్రత్యేకమైనదని ముఖ్యఅతిథి తంగెడ కిషన్‌రావు ఉద్ఘాటించారు. అనుమాండ్ల భూమయ్య పాటిబండ్ల గురించి దివాకర్ల వారు రాసిన పద్యాలు శ్రావ్యంగా పాడి అలరించారు. ఈ పురస్కార ప్రదానం ఒక బాధ్యతగా భావిస్తానని ఆయన అన్నారు. పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్న ఈ సభకు తెలుగు శాఖ అధ్యక్షులు రత్నశ్రీ నిర్వాహకులుగా వ్యవహరించారు.

# హార్ట్ బీట్ పుస్తకావిష్కరణ

గత పది సంవత్సరాలుగా దేశం, రాష్ట్రంలో జరిగిన పరిణామాలపై ఎం. విప్లవ్ కుమార్ తన హృదయస్పందనగా వ్రాసిన వ్యాసాల సంకలనం 'హార్ట్ బీట్ ' పుస్తకాన్ని మే 5వ తేదీన, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ కంచె ఐలయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీడ్ రైట్ ఫైట్ ఈ మూడు అంశాలు ఒక నినాదంగా మారాలని పిలుపునిచ్చారు.

మట్టి వాసనతో రాయాలని, కింది కులాల నుండి వచ్చిన వారు బాగా రాయగలరని ఆయన అన్నారు. విప్లవ్‌కు బాగా చదివే గుణం ఉండడం వల్ల రాయగలిగాడని అభినందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రజాగాయని విమలక్క మాట్లాడుతూ రచయితకు లోకల్ నుంచి అంతర్జాతీయ దృక్పథం అవసరం అన్నారు. అదే హృదయస్పందన ఉండాలి. హార్ట్ బీట్ లేనోడు



మనిషే కాదని నిజమైన తన బీట్‌ను విప్లవ్ తెలిపాడు అని అన్నారు. మోదుగుపూలు ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కె వి పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ, ఐద్వా సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, ఏ. విజయ్ కుమార్, ఇమ్మిడి మహేందర్, వేముల ఎల్లయ్య, జర్నలిస్ట్‌లు కంబాలపల్లి కృష్ణ, కవిత, సలీమా, చంద్రమోహన్, సాంబశివ, కలుకూరి రాజు, మూర్తి, వేల్పుల మహేష్, నలిగంటి శరత్ పాల్గొన్నారు.

స్వీకారం




## మౌనమూర్తి

లేదాళ్ళ రాజేశ్వరరావు
సెల్ : 94418 73602

పాలపిట్ట బుక్స్
హైదరాబాద్
వెల : రూ. 120 /-




## ఆకుపచ్చ సైనికుడు

యక్కలూరి శ్రీరాములు
సెల్ : 99856 88922
అనంతపూర్

వెల : రూ. 120 /-




## తెలుగువాణి

పొట్టి శ్రీరాములు
తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్




## తెలుగు వ్యాకరణము

డా॥ దాసరి వేంకట రావు
సెల్ : 85007 06465
పశ్చిమగోదావరి

వెల రూ. 189/-



## శ్రీ లక్ష్మీ నరసింహ నాట్యమండలి, ధర్మపురి

డా॥ సంగనభట్ల నరసయ్య
సెల్ : 94400 73124
హైదరాబాద్




## తొడిమ లేని మొగ్గలు

వాడ్రేవు వెంకట సత్యప్రసాద్
వెల : రూ. 200/-




## కొబ్బరినీరా శతకము

వెల రూ. 30/-




## మనసుకు చికిత్స (కథలు)

డా॥ లక్ష్మీ రాఘవ
సెల్ : 80963 10140

వెల : రూ.100/-



## ఇంద్రధనుస్సు

శ్రీమతి దినవహి సత్యవతి
సెల్ : 97907 52180

వెల : రూ.100/-

స్వీకారం కోసం మీ పుస్తకాలు ఈ చిరునామాకు పంపించండి వీలైతే సమీక్ష కూడా వేస్తాం.

**తెలంగాణ జాగృతి :** పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్తు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in



తెలంగాణ వైతాళికులు

## ఒద్దిరాజు రాఘవ రంగారావు

వర్ధంతి : మే 17, 1973